ఆంధ్ర సచిత్ర వారపత్రిక



7-7-67

40 పైసలు

ఉత్తరాలు

కథలు

23—6—67 సంచికలో మీరు ప్రచురించిన 'రచయిత్రి జీవితం' కథ చదివి చాలా ఆశ్చర్యపోయాను. ఏమంటే రచయిత్రికి బదులు ఉపాధ్యాయిని అని అనుకుంటే, ఆ శేఖరం నా ప్రాణమిత్రుడే! ఇద్దరి సంభాషణలోని ప్రతి వాక్యమూ వారిని వూహించే వ్రాసేరా, రచయిత్రిగారు అన్నంత యదార్థమైన కథ వ్రాసారు. చివరలో శేఖరం వ్రాసిన ఉత్తరం ఎంతటి వారికైనా పశ్చాత్తాప పడుతుంది.

ఏమైనప్పటికి నాగరికత అనే పరదా చాటున పవిత్రమైన భారత స్త్రీ ధర్మాన్ని విస్మరించి నడుస్తున్న స్త్రీలను ఆత్మ పరిశీలన చేసికొనునట్లు చేసిన రచయిత్రి గొల్లపూడి రాజ్యలక్ష్మిగార్కి నా ధన్యవాదాలు.

కె. యస్. దాసు (వేల్పూరు)

* * *

16—6—67 పత్రికలో మీరు ప్రచురించిన గురివింద, మనిషి బుద్ధి కథలు చాలా ఆసక్తిదాయకంగా ఉన్నవి సీరియల్స్ రెండును చాలా బాగున్నవి. ఇటువంటి కథలు రచిస్తున్నవారికి నా ధన్యవాదము అర్పించుకుంటున్నాను.

వాకలపూడి రాముడు (పద్దిపర్రు)

* * *

16—6—67 ఆంధ్ర సచిత్ర వారపత్రికలో కథలు బాగున్నాయి. గురివింద కథ యువతీయువకులకు మంచి గుణపాఠం! కథ చక్కగా వుంది. 'ఎలా నీకు చెప్పేది' కథతోబాటు హాస్య కథ 'బంగారమ్మగారి బొంబాయి యాత్ర' భలే నవ్వువచ్చింది. కథలే గాక మహీధర నళినీ మోహన్‌గారి 'కుజ గ్రహంలో కాలువలు' చదవడానికి సరదాగా విజ్ఞానదాయకంగా వుంది. ఇటువంటి వ్యాసాలు ముందు కూడా వేస్తారని ఆశిస్తున్నాను.

కుమారి వి. లక్ష్మి (శ్రీకాకుళం)

వ్యాసాలు

"కొత్త సీసాల్లో పాత పానీయాలు" అనే వ్యాసం చదివాను. బాగుంది వ్యాసకర్త సేకరించిన విషయాలు పాఠకులను మరొక్కసారి మహారాష్ట్ర రాజకీయాలను సింహావలోకనం చేస్తుందనుటలో సందేహంలేదు.

బొంబాయిలో దక్షిణ భారతీయుల మీద చేస్తున్న దుష్ప్రచారాన్ని కూడా విపులంగా వివరించారు.

అయితే 57వ పేజీ మొదటి కాలంలో...

"శ్రీ బాల్‌ఠాక్రే ప్రచురించే వారపత్రిక మార్మిల్ మంచి అమ్మకం గల పత్రిక ...అని ప్రచురించారు.

కాని, బొంబాయిలో బాల్‌ఠాక్రే అధ్వర్యాన వెలువడే వారపత్రిక 'మార్మిక్' గాని మార్మిల్ కాదు.

ఇది అచ్చు తప్పా? లేక విలేఖరి తప్పా?

కె. నరేంద్ర, కె. శ్యామ్‌రావు,
కోయివాడ (బొంబాయి)

అచ్చు తప్పే!

సీరియల్

ఆంధ్రసచిత్ర వారపత్రికలోని సీరియల్ 'పూర్వాసంధ్యా ప్రవర్తతే' మొదటి రెండు సంచికలు చదివిన తర్వాత ఈ చిన్న సంఘటన వ్రాయాలనిపించింది. మా సెవెన్త్ ఫారమ్ పరీక్షలు ఏప్రిల్‌లో జరిగాయి. ప్రతి సంవత్సరం లాగానే, ఈ సంవత్సరం కూడా స్థానిక గరల్స్ హయ్యర్ సెకండరీ స్కూలులో నిర్వహించబడ్డాయి. పరీక్షలన్నీ ప్రశాంతంగా జరిగాయి. దురదృష్టవశాత్తు స్థానిక స్కూలులో పని చేస్తున్న ఒక టీచర్‌ను, స్ట్రిక్ట్‌గా చూశాడనే ఆరోపణపై ఒక విద్యార్థి, మరియొక విద్యార్థి ప్రోత్సాహంతో చివరి పరీక్ష అవ్వగానే, కొట్టాడు. దీనికి ఇతర విద్యార్థుల ప్రోత్సాహంగాని, అనుమతిగాని లేవు. కాని ఆ టీచర్ శారీరకంగా బలశాలి అయినను తిరగబడక శాంతముతో వెళ్ళిపోయారని, అక్కడనేవున్న కొద్దిమంది విద్యార్థుల ద్వారా విన్న మాకు కన్నీళ్ళు ఆగలేదు. ఈ విషయం ఎవ్వరు నమ్మక పోవచ్చు. ఒక విద్యార్థి మూలాన మాకు, మా స్కూలుకు వచ్చిన ఈ అప్రతిష్ఠ ఎలా తొలగించాలి? దీనికి జవాబు లేదేమో. కాని అసలు విషయం అర్థం చేసుకోలేక మా మాస్టర్లు దీనికంతటికీ మేమే కారణమని కనబడినప్పుడల్లా నిందిస్తున్నారు. 'శంకరం' లాంటి మాస్టర్లు, 'వేణు' లాంటి విద్యార్థులు వుంటారని ఈ అనుభవం ఒక మచ్చుతునక. ఈ ఉత్తరం మీరు ప్రచురిస్తే సంతోషిస్తాను.

ఎమ్. వి. ఎస్. మూర్తి (విశాఖ)

* * *

మధుశ్రీ గారి పరిష్కృతం బాగున్నది. రెండు సీరియల్స్ కూడా చాలా బాగున్నవి. విలియం హాం వెస్టర్ వ్రాసిన "అధ్యక్షుని మరణం" మాకు అందించు చున్నందులకు మీకు నా అభినందనలు.

మేడిశెట్టి మధుసూదనరావు (ఖరగ్‌పూర్).

ఆంధ్రసచిత్ర వారపత్రిక

వ్యవస్థాపకులు :
దేశోద్ధారక కాశీనాథుని
నాగేశ్వరరావు పంతులుగారు

శుక్రవారం : 7—7—'67
ప్లవంగనామ సం॥ జ్యేష్ఠమాసం శు॥ అమా
సంపుటము : 59 సంచిక : 43

స్థాపితము
1908

ముఖ్య సంపాదకుడు :
శివలెంక శంభుప్రసాద్

సంపాదకుడు :
శివలెంక రాధాకృష్ణ

ఆంధ్రపత్రిక కార్యాలయము
7, తంబుచెట్టి వీధి, మద్రాసు-1

పోస్టు ద్వారా


సంవత్సర చందా	22.40
6 మాసముల చందా	11.20
3 మాసముల చందా	5.60

ఇతరదేశాలకు
ఓడమీద (Sea Mail)

సంవత్సర చందా	42.00
అర్థసంవత్సర చందా	21.00

విషయానుక్రమణిక

ముఖచిత్రం : 'నవ వధూవరులు'
చిత్రకారుడు శ్రీ 'గోనిసెట్టి'



అధ్యక్షుని మరణం

6

విలియం మాంచెస్టర్



అమెరికా అధ్యక్షుని డల్లాస్ తీసుకొచ్చిన ఏంజల్ పేరుగల ఎయిర్ ఫోర్స్ 1

కొన్ని నిముషాల తర్వాత ఫోర్ట్‌వర్త్‌లో పొద్దున ఫలహారం జరుగుతున్నప్పుడు జాక్వెలీన్ కెన్నెడీకి బూట్లు, ఆమె భర్తకి 'అయిదుగాలన్ల' టోపీ ఒకటీ కానుక ఇచ్చారు అక్కడివాళ్ళు. ఈ తతంగాన్ని టెలివిషన్ మీద చూసిన వారి అంతరంగికులకి నవ్వు ఆగలేదు. అధ్యక్షుడికి వింత వేషాలు వేసుకోనటం అంటే ఇష్టం లేదని వారికి తెలుసు. కెన్నెడీ ఏమో, టోపీని వాషింగ్టన్ వెళ్ళగానే వేసుకుంటానన్నాడు. ఆయన భార్య అంతకిముందే వేసుకుంటే బాగుండుననుకున్నది.

అధ్యక్షుడి ఉపన్యాసం మొదలయింది. జాక్వెలీన్ కెన్నెడీ ఆలోచనలు మర్నాడు జాన్సన్ 'రాంచ్' (ఇల్లు, ఎస్టేటు) మీదనే ఉన్నాయి. లేడీబర్డ్ (శ్రీమతి జాన్సన్) అధ్యక్షుడికి ప్రత్యేక కార్యక్రమం ఏదయినా ఏర్పాటు చెయ్యాలేమో కనుక్కోమన్నది. 'గుర్రపు స్వారీ చెయ్యాలని ఉంది.' అన్నాడు కెన్నెడీ. అతను మంచి అశ్వికుడు. వారి వివాహం ముందు న్యూపోర్ట్‌లో జీను కూడా లేకుండా స్వారీచేస్తూ ఉండేవాడు. ఆ పెద్ద 'స్టెట్సన్' టోపీ గుర్రం మీద మాత్రమే బాగుంటుంది. అసలు, అతనికి టోపీలు ఏవీ నప్పవు! కొంచెం వింత టోపీ అయితే మాత్రం—వాయిక దళంలో ఆఫీసర్ క్యాప్, పదవీ స్వీకారం ముందు పెట్టుకున్న సిల్క్ హాట్ — ఇటువంటివి బాగా ఉండేవి.

ఆమె అంతకి ముందు 'రాంచ్'ని చూడలేదు. ఆమె భర్త అధ్యక్షుడు అయిన ఎనిమిది రోజుల తర్వాత అక్కడికి వెళ్ళి ఉన్నాడు. దానిని గురించి ఎంతగానో వర్ణించి చెప్పాడు. అప్పుడే ఒక ఇబ్బంది కలిగించే సంఘటన జరిగింది. జాన్సన్ అతనిని వేటకి రమ్మన్నాడు. కెన్నెడీకి చిన్న జంతువులని కాల్చి చంపటం అంటే ఇష్టంలేదు. కాని, ఇంటి యజమాని అంత అభిమానంతో పిలుస్తూ ఉంటే కాదనటం ఎలా? అదీకాక లిండన్ చాలా పట్టుపట్టాడు. కెన్నెడీకి మర్యాద చెయ్యాలనే ఆత్రంలో కేవలం అతను మర్యాదకోసం సందేహిస్తున్నాడనుకున్నాడు జాన్సన్.

1960, నవంబర్ 17న ఆపరిస్తూ ఉదయం 6గంటలకి బయలుదేరారు. జాన్సన్ పాత టోపీ ఒకటి, తోలుకోటు ఒకటి ధరించాడు. కెన్నెడీ గళ్ళకోటు వేసుకున్నాడు. తోటి అతిథి ఒకతను అధ్యక్షుడు ఫుట్‌బాల్‌మాచ్‌కి వెళ్ళే పామాన్యుడిలాగ కనిపించాడనుకున్నాడు. కెన్నెడీ గురి చాలా మంచిది. కాని, చిన్న జంతువులని కాల్చడం గొప్పగా కనిపించలేదు, అతనికి. తుపాకీ పేల్చేముందు నిప్పపోయంగా మంచుని ఉండిపోయిన ఆ మృగం అతని స్మృతిలో ఉండిపోయింది. తర్వాత భార్యతో తన బాధ చెప్పుకున్నాడు.

ఇది ఇంతటితో ఆగలేదు. జాన్సన్ కొన్ని రోజుల తర్వాత ఆ మృగం తలకాయని తీసుకువచ్చి అధ్యక్షుడి ఆఫీసు గది గోడకి తగిలిస్తానన్నాడు. కెన్నెడీ బయటికి సంతోషించినట్లు కనిపించినా లోపల హడలిపోయాడు. జాన్సన్ వెళ్ళిపోగానే ఆ తలని దాచివెయ్యమన్నాడు. కాని, పాపం జాన్సన్

అది గోడమీద ఎక్కేదాకా వదలలేదు. చివరికి కెన్నెడీ అతని మనస్సుని గాయపరచలేక జింక తలని తన ఆఫీసుగది పక్క గదిలో తగిలించాడు. జాన్సన్ కోరిక మన్నించాడు. నిజానికి అది ఎంత పెద్ద కోరికో ఒక్క జాక్వెలీన్ కెన్నెడీకే తెలుసు. పెద్ద ఉద్యోగాలలో ఉన్నప్పుడు ఇచ్చి—పుచ్చుకోనడాలు, గెలుపు వోటములు తప్పవు—ఇదీ కెన్నెడీ తత్వం.

'ఈ ప్రపంచంలో అనవసరంగా పొగడబడేవి మూడు—టెక్సాస్ రాష్ట్రం, ఎఫ్. బి. ఐ. (అమెరికా పరిశోధక దళాలలో ఒకటి). గోడకి తగిలించే జింక తలకాయలు,' అని తర్వాత నవ్వుతూ అంటూ ఉండేవాడు స్నేహితులతో.

ఇవన్నీ తలుచుకుంటున్న అధ్యక్షుని సతీమణి తను భర్తతో ప్రతిపర్యటనలోనూ పాల్గొనాలనుకున్నది— నవంబర్‌దాకా. తమ గదులలోకి వెళ్ళిపోయిన తర్వాత అధ్యక్షుడు వోడాన్నెల్‌తో టెలిఫోన్‌లో మాట్లాడాడు.

'మనం 10–40 దాకా బయల్దేరక్కరలేదు,' అన్నాడు భార్యతో.

'గంటసేపు తీరికగా కూర్చోటమే', అని అడిగింది ఆమె ఆశ్చర్యంతో, 'జాక్ నువ్వు అధ్యక్షుడివిగా ఉన్నప్పుడు ఎన్నిక ప్రచారం చాలాతేలిక! నీతో ఎక్కడికి రమ్మన్నా వస్తాను!'

ఇంతలో కెన్‌వోడాన్నెల్ లోపలికి వచ్చాడు. 'కాలిఫోర్నియా వస్తావా?' అని కెన్నెడీ అడిగాడు.

'తప్పకుండా!' అన్నది ఆమె.

సాధారణంగా నవ్వని వోడాన్నెల్ ముఖం మీద ఈ వార్త విన్న తర్వాత చిరునవ్వు వెలిసింది. అది మాజీ ఉపాధ్యక్షుడు జాన్ నాన్స్‌గార్నర్ 95 వ జన్మదినం. కెన్నెడీ ఉవాల్డె (టెక్సాస్)లో ఉంటున్న అతనికి ట్రంక్‌టెలీఫోన్‌చేసి జన్మదినాభినందనలు తెలుపచేశాడు. ఇంతలో ఆయనభార్య గోడల మీద తగిలించిఉన్న బొమ్మలని పరిశీలించి ఆశ్చర్యపోయింది. ప్రతిబొమ్మా ఎవరో ఒక సుప్రసిద్ధ చిత్రకారుడు వేసినది—నకలు కాదు! కిందటిదినం అలసటలో వారు ఈ సంగతి గమనించలేదు. ఒకటి పికాసో, మరొకటి వాన్‌గో, ఇంకొకటి మోనె—శిల్పాలు, వర్ణచిత్రాలు ఎన్నో ఉన్నాయి ఆ గదిలో. అది అధ్యక్షదంపతుల గౌరవార్థం ఏర్పాటుచేసిన ప్రదర్శన అని ఆగదిలోనే ఒకమూల ఉన్న 'కేటలాగు' తెలిపింది. 'జాన్ పాపం వాళ్ళెంత మంచివాళ్ళు! మన కోసం వాళ్ళ మ్యూజియం ఖాళీచేశారు!' అన్నది ఆవిడ భర్తతో ఉవాల్డె టెలిఫోన్ సంభాషణ ముగియగానే.

ఈ గౌరవం ఆమెకేనని అతనికి తెలుసు. తమ కుటుంబంలో కళాపోషణ ఆమె ప్రత్యేకత. కేటలాగు తీసుకుని, 'ఎవరు చేశారో చూద్దాము,' అన్నాడు. అందులో ఎందరిపేర్లో ఉన్నాయి.

మొదటిది 'శ్రీమతి రీ జాన్సన్' అనే ఆవిడది. 'టెలిఫోన్ డయిరెక్టరీలో ఆవిడ పేరు ఉంటుంది, ఫోన్ చేద్దామా?' అన్నాడు కెన్నెడీ. అధ్యక్షుడి టెలిఫోన్ వచ్చిన రూత్ కార్టర్ జాన్సన్ ఎంతో ఆశ్చర్యపోయింది. అది జాన్ కెన్నెడీ చేసిన చివరి టెలిఫోన్.

ఈసంతోషంలో వోడాన్నెల్ అంతకిముందు డల్లాస్ 'న్యూస్' పత్రికలో పడిన ప్రకటన అధ్యక్షుడికి చూపించాడు. కెన్నెడీ దానిని పూర్తిగా చదివి గంభీరంగా అయిపోయాడు. మారుమాట లేకుండా భార్యకి ఇచ్చాడు. ఆమె ఉల్లాసం కూడా మాయమయింది. తల తిరిగినట్లయింది.

అధ్యక్షుడు తల అడ్డంగా ఆడిస్తూ 'మనం వెర్రి దేశంలోకి వెళుతున్నామివాళ,' అన్నాడు.

గదిలో ఇటూ అటూ పచార్లు చేశాడు. హటాత్తుగా ఆమె ముందు ఆగి, 'నిన్న రాత్రి అధ్యక్షుడిని హత్య చెయ్యటానికి బలే రాత్రి కదూ!' అన్నాడు. అనాలోచితంగా అన్నమాటలని ఆమె పట్టించుకోలేదు. అదీ కాక, అసహ్యమయిన వాటి ప్రభావాన్ని ఈ విధంగా దులిపి వెయ్యటం అతనికి అలవాటు. కొన్నిప్పుడు చిన్న పిల్లవాడిలాగా కలలు కంటూ ఉండేవాడు.

'నిజంగా చెబుతున్నాను,' అన్నాడు అంతటితో ఆపక. 'వాన, చీకటి, ఒకటేగుంపు, ఎవరయినా పెట్టెలో పిస్తల్‌తీసుకు వచ్చి ఉంటే?' తర్జని చూపించి తుపాకీ పేల్చడిని అభినయించాడు. 'తర్వాత దాన్ని పెట్టెలో పడేసి గుంపులో మాయమయి పోయేవాడు.'

ఈ 007 అభినయం జరుగుతూఉంటే లిండన్ జాన్సన్ గదిలోకి వచ్చాడు, ఆయన సహోదరి, బావవెంటనే ఉన్నారు. అధ్యక్షుడితో కరచాలనం చెయ్యాలనుకున్నారట. పరిచయాలు అయిపోయిన తర్వాత, జాన్సన్ తన మామూలు మర్యాదచూపిస్తూ సెలవు తీసుకున్నాడు. ముగ్గురూ వెళ్ళిపోయిన తర్వాత పార్టీలోని కలహాలు గుర్తుకివచ్చిన కెన్నెడీ వోడాన్నెల్‌తో మరొకసారి చెప్పాడు— 'ఈసారి యార్బరో ఏమయినాసరే ఉపాధ్యక్షుడికారులో ఊరేగి తీరాలి; అవసరమయితే బలవంతంగా ఎత్తి కారులో పడెయ్యాలి' అన్నాడు. ఈ సంగతి టెలిఫోన్‌ద్వారా లారీ వోబ్రయన్‌కి చెప్పాడు వోడాన్నెల్. టెలిఫోన్ సంభాషణ ముగిసే ముందు కెన్నెడీ టెలిఫోన్ రిసీవర్‌ని తీసుకుని, ఒక్కొక్క మాటా పట్టి చెప్పాడు, 'అతన్ని కార్లో ఎక్కించాలి!' అని.

కెన్ వోడాన్నెల్ వెళ్ళిపోయాడు. జాక్వెలీన్ కెన్నెడీ ఆకాశం వంక చూసింది. మబ్బు పడితే బాగుండుననుకుంది. కష్టపడి అలంకరించుకుని చివరికి అనుకోకుండా వానలో తడిసి లాభంలేదు. కనీసం మబ్బుపడితే నయినా ప్లాస్టిక్ టాపు ఉన్న కారు వాడవలసి వస్తుంది.

కాని, ఆమె కోరిక ఫలించలేదు. అదే క్షణంలో అధ్యక్షుడు సన్నటి సూటులోకి మారుతున్నాడు పక్క గదిలో. ముందు, ముందు వాతావణం వేడిగా ఉంటుందనుకున్నాడు ఆయన. కింద వోడాన్నెల్ ఎంతో మందితో సంప్రదించి వాతావరణం నిర్మలమయితే కారు టాపు తీసివెయ్యవలసిందని ఊరేగింపు ఏర్పాట్లు చేసే వారితో చెప్పాడు. కొంత సేపటిలో మబ్బు కొంత విడిపోయింది.

'కెన్నెడీ కోసం ప్రత్యేక వాతావరణం!' అని నవ్వాడు వోబ్రయన్, వోడాన్నెల్ వంక చూసి కన్నుగీటుతూ.

మోటారుకారు ఊరేగింపు ఏర్పాట్లు పూర్తి అయ్యాయి. విలేఖరులంతా తమ కోసం ఏర్పాటు చేసిన బస్సులో ఎక్కి కూర్చున్నారు. వారిలో ఎవరూ, రాల్ఫ యార్బరో ఏమిచేస్తాడో, అని ఆత్రపడని వారులేరు. యార్బరో ఏదో ఆలోచిస్తూ బయటికివచ్చాడు. వోబ్రయన్ అతని దగ్గరకు పరిగెత్తాడు.

'సెనేటర్, మీ నిర్ణయం గురించి మరొక్కసారి ఆలోచించగలిగితే మాకు చాలా సంతోషంగా ఉంటుంది,' అన్నాడు. 'మీరు

లోకం పోకడ

డి. యమ్. కె. కి మరో అనువాదం శివసేన.

—ఆర్గనైజర్ (18—6—67) లో యస్. వి. థయాగుడే.

* * *

కట్టుదిట్టమైన వర్ణ నియంత్రణాన్ని దేశంలో అమలు జరపటం అన్న దాన్ని తాను విస్మరించలేదని శ్రీ మొరార్జీ దేశాయి అన్నారు. దాని ప్రభావం కన్పించకపోవడానికి కారణం ప్రజలు దాన్ని యిష్టపడకపోవడమే నన్నా రాయన.

—పి. టి. ఐ. వార్త.

* * *

ఆదాయపు పన్నులశాఖ కార్యకలాపాలను రెవెన్యూ ఆడిట్ అదుపులోకి తీసుకురాలేదని ఆర్థికశాఖ స్టేట్ మంత్రి శ్రీ కె. సి. పంత్ అన్నారు.

యు. ఎన్. ఐ. వార్త.

* * *

"....ముస్లిం తత్వం గురించి మీకు బాగా తెలుసు. దీన్ని జాతీయతత్వంతో ముడి పెట్టినప్పుడు అది భయంకరంగాను, అమానుషంగాను తయారవుతుంది."

—ఆర్గనైజర్ ఇంటర్వ్యూలో ఇజ్రాయెల్ కాన్సల్ జనరల్ ఆర్. దఫ్ని.

* * *

శ్రీ కామరాజుకి వ్యతిరేకంగా ఎన్నికల ప్రచారం చేసిన నిర్వాహకులు ఎన్నికలముందు కొన్ని వారాలు విదేశీ రాయబార కార్యాలయాలతో సంబంధాన్ని పెట్టుకున్నారన్న విషయంపై సి. బి. ఐ. రిపోర్టులనిబట్టి విచారణ జరుగుతున్నదని దేశీయాంగమంత్రి శ్రీ చవాన్ లోక్‌సభలో అన్నారు.

—యు. ఎన్. ఐ. వార్త.

అధ్యక్షుని మరణం

ఉపాధ్యక్షులతో వెడితే అధ్యక్షులు ఎంతో ఆనందిస్తారు.'

యార్బరో తల అడ్డంగా ఆడించ పోయాడు. ఇంతలో వోబ్రయన్ పత్రికా విలేఖరుల బస్సుని మరోకసారి త్వరగా పరీక్షించి, 'అందరూ ఇటే చూస్తున్నారు! ఇది పెద్ద కథ అయిపోతుంది!' అనేశాడు. సెనేటర్ నేరుగా నుంచుని, 'లారీ, అధ్యక్షుడి పలుకుబడి గురించి ఎంతసేపయినా మాట్లాడగలను.' అన్నాడు. లారీ వోబ్రయన్ వంక చూశాడు. అతను నిబ్బరంగా అలాగే ఉండి పోయాడు.

'పోనీ, ప్రకటన ఒకటి చేస్తాను,' అన్నాడు యార్బరో.

'మీరు పదివేల మాటల ప్రకటన చెయ్యవచ్చు కాని ఆ కారులో ఎక్కటంతో సమానంకాదు,' అని సమాధానం ఇచ్చాడు లారీ. హోటల్ లోపల నుంచి జాన్సన్ దంపతులు బయటికి రావటం కడకంట గమనించాడు. అప్పటికే 10.40 అయింది. అందరూ బయలుదేరటానికి సిద్ధంగా ఉన్నారు. అనుకోకుండా యార్బరో లొంగిపోయాడు. 'సరే, అంత ముఖ్యమయితే...' అని మొదలుపెట్టాడు.

'అంత ముఖ్యమే!' అని మాట పుంచేసి, లారీ జాన్సన్‌తో 'సెనేటర్‌గారు మీతో, శ్రీమతి జాన్సన్‌తో వస్తారు,' అని గొణిగాడు,

'మంచిది!' అన్నాడు ఉపాధ్యక్షుడు.

తర్వాత ఒక 'ఫార్సు' జరిగింది. డ్రయివర్ వెనకాల యార్బరో, అతనిపక్కన లేడీ బర్డ్ జాన్సన్, ఆమెకి కుడివయిపున ఉపాధ్యక్షుడు కూర్చున్నారు వెనక సీటులో. లారీ తలుపు వెయ్యపోతున్నాడు. ఇంతలో, ఒకపార్టీ మనిషి హడావుడిగా గవర్నర్ కాన్నలీ సతీమణితో వచ్చాడు. అధ్యక్షుడు వెళ్ళే 'లింకన్' కారులో ఆమెకి చోటులేదు. అందుకని అతను ఆవిడని జాన్సన్ పక్కన కూర్చోపెట్ట దలుచుకున్నాడు. తలుపుతీసి ఆమెని లోపలికి తొయ్యటం మొదలు పెట్టాడు. జాన్సన్, శ్రీమతి జాన్సన్ అవతలకి జరుగవలసివచ్చింది. యార్బరోకి చాలా ఇరుకుఅయింది. ఇదే సదవకాశం చేసుకుని, తనని బయటికి తోసివేస్తున్నారనే మిషతో, కారు దిగటానికి ప్రయత్నించాడు. లారీకి పళ్ళుమండింది. సెనేటర్ యార్బరోని దిగనివ్వకుండా అడ్డునుంచుని చేతితో పార్టీమనిషితో ఏవేవో సంజ్ఞలు చేశాడు. అతనికి పరిస్థితి అర్థం అయింది. మాట్లాడకుండా నెల్లీ కాన్నలీని ముందుసీటులో కూర్చోపెట్టాడు. ఆమెకి తను పోలీసు డ్రయివర్, రహస్య రక్షకదళం భటులమధ్య ఎందుకు కూర్చుందో అర్థం కాలేదు కాని కారు బయలుదేరి వెళ్ళిపోయింది!

డల్లాస్‌లోని 'లవ్‌ఫీల్డ్'లో బందోబస్తు అత్యధికంగాఉంది. ఎక్కడచూసినా పోలీసు వారు నుంచునున్నారు. అయితే, విమానం పయిలట్ జిమ్ స్వెండాల్‌కి కింద గుంపు అంత వ్యతిరేకంగా కనిపించలేదు.

ఇది సరయిన ఊహకాదు. శాన్ ఆంతోనియోలో అధ్యక్షుడికి నగరం యావత్తూ స్వాగతం ఇచ్చింది. ఇక్కడికి హాజరయినవారు సగిర 'ప్రముఖులు'కారు. మితవాదులు, పురోగమనవాదులు మొదలయిన వారు. డల్లాస్‌లో ఈ వర్గాలు వోడిపోయాయి. అందుచేత కెన్నెడీని నిరసించే వర్గాలకి 'పాఠం' నేర్పాలనే ఆకాంక్ష ద్విగుణీకృతమయి తమకి వీలయినంత పెద్ద స్వాగతం ఇస్తున్నారు.

బడి ఎగగొట్టిన కొందరు అబ్బాయిలు 'జాన్ అంటే మాకు ఇష్టం' అని రాసిన అట్టని, అమెరికా జండాని ఎత్తిపట్టుకున్నారు. ఒక చిన్న నీగ్రో పిల్లవాడు, 'హుర్రే ఫార్ జె. ఎఫ్. కె.' అని రాసివున్న అట్టముక్కని ఎత్తిపట్టుకున్నాడు.

ఇది డల్లాస్ స్వరూపంకాదు. ఎందరో ప్రేక్షకులు కెన్నెడీనిచూసి చెయ్యివూపటం ప్రారంభించి ఎదురుగా, వెనక్కి తిరిగి చూడటం టెక్సాస్ 'కాంగ్రెస్' సభ్యులలో ఒకడయిన హెన్రీ గొంసాలెజ్ గమనించాడు.

ఆహ్వాన సంఘంలో 12 మంది సభ్యులు. వారిలో ఒక్క కార్మిక నాయకుడూ లేడు. డెమొక్రటిక్‌పార్టీ అధ్యక్షుడిపట్ల ఈ శ్రద్ధ ఆశ్చర్యకరం. స్థానిక యూనియన్ల నాయకులు కొందరు వద్దామనుకున్నారు కాని అక్కడి రాజకీయవర్గాల కొట్లాటలని చూసి ఆహ్వాన సంఘానికి దూరంగా ఉండటమే మంచిదనుకున్నారు. ఆహ్వానసంఘంలో చివరికి తొమ్మిదిమంది రిపబ్లికన్‌పార్టీ వారు, ఇద్దరు తీవ్రవాదపక్ష రాజకీయవాదులు, ఒక మితవాది (బేర్‌ఫుట్

పిండర్స్) ఉన్నారు.

ప్రకమంగా రాజకీయ మర్యాదలని పాటించాలంటే అధ్యక్షుడు వెళ్ళిన తర్వాత కొన్నల్లీ వెళ్ళాలి. కాని, అది గవర్నర్ కొన్నల్లీ స్వంత రాష్ట్రం. అక్కడ, అంటే డల్లాస్‌లో, అధ్యక్షుడి పలుకుబడి, అతని పలుకుబడిని మించినది కాదు.

కెన్నెడీ విమానంలో నుంచి బయటికి వచ్చాడు. తర్వాత జాక్వలీన్ కెన్నెడీ వచ్చింది. విచ్చెన మొదటి మెట్టుమీద కాలుపెట్టగానే కింద గుంపులోనివారు హర్షధ్వనులు చేశారు. అయిదు నిముషాల క్రితమే జాన్సన్ దంపతులు కింద నుంచుని ఉన్నారు. ఇలావారు తక్కిన ఇద్దరికీ స్వాగతం చెప్పటం పలుగురికీ నవ్వు పుట్టించేట్లుగానే ఉంది. లిండన్ జాన్సన్ జాక్వలీన్ వంక చూసి, 'ఏం చేస్తాం?' అన్నట్లు భుజాలు పైఎగరేశాడు: ఆమె కూడా నవ్వింది.

అందరూ కార్లు ఎక్కారు. ఉపాధ్యక్షుడు భార్యతో ఒక బూడిద రంగు కారులో వచ్చాడు. అధ్యక్షుడిని ఆహ్వానించే హర్షధ్వనులు స్థానిక పార్టీ అంతర్యుద్ధాలని జ్ఞాపకం తెప్పించటంతో అతనికి దిగులు వేసింది. అందుచేత, డ్రయివరుతో చెప్పి కారు రేడియో గట్టిగా పెట్టించాడు.

ఎయిర్‌ఫోర్స్ 1 విమానంలో జార్జి థామస్ బట్టలు సర్దుతున్నాడు. తర్వాతి మజిలీ ఆస్టిన్‌కోసం ఒకకట్టు బట్టలు తీసి పెట్టాడు: షర్టు, బూట్లు, సన్నటి నీలం సూటు. ఇంతలో అతనికొక ఆలోచన కలిగింది. అధ్యక్షుడు తిరిగివచ్చేసరికి అలిసిపోయి ఉంటాడు. రాత్రి 'రాంచ్'లో కార్యక్రమం ఏదీలేదు. విశ్రాంతికి అవకాశం ఉంది. ఈ సంగతి అధ్యక్షుడికి ఈవిధంగా గుర్తు చెయ్యవచ్చు — ఒక ఖాకీలాగు, స్వెటర్, పొట్టిచేతులచొక్కా తీసిపెడితే సరి.

విమానాశ్రయం కంచెదగ్గిర రాయి కెల్లర్మాన్ ఎప్పుడూ అధ్యక్షుడిని అంటిపెట్టుకునే ఉన్నాడు. అని స్థానిక పత్రికా విలేఖరి ఒకతను అన్నాడు. వాషింగ్టన్ పత్రికావిలేఖరి మరొకడితో, 'డల్లాస్ పోలీసుకి బాగా తెలిసివచ్చింది. కెన్నెడీ ఈ చోటు వదిలిన తర్వాత ఎవరినీ అతని దగ్గిరికి రానివ్వరు?' అన్నాడు. అధ్యక్షుడు ముందుకి సాగిపోతూనే ఉన్నాడు. 'కెన్నెడీ

అధ్యక్షుని మరణం

భయం లేనివాడినని నిరూపించుకుంటున్నాడు,' అని రాశాడు 'టెక్సాస్ అబ్జర్వర్' విలేఖరి లారీ ఉగ్గర్.

మోటారుకారు ఊరేగింపు బయలుదేరే సమయం అయింది. సీట్లకోసం చాలామంది ఎగబడ్డారు. అధ్యక్షుడి డాక్టరు జార్జి

అధ్యక్షుని మరణం

టర్క్లీ బస్సులో కూర్చోవలసి వచ్చింది. డాక్టరుకి ఇది విస్మయంగా తోచలేదు కాని వైద్యుడుగా తను అధ్యక్షుడి దగ్గర ఉండటం మంచిదనుకున్నాడు. అధ్యక్షుడికి అతని అవసరం రాకపోవచ్చు, రావచ్చుకూడా. ఈ అవసరం రావచ్చుననేకదా అతన్ని వెంట తీసుకువచ్చింది!

ఓ'బ్రియన్ 'యార్బరో సమస్య తీరిపోయిందిలే' అనుకున్నాడు. హఠాత్తుగా సెనెటర్ యార్బరో 'ఈ' పోటాటారు ఊరేగింపులో వస్తానని మాట ఇవ్వలేదని అతనికి తోచింది. అదే సమయంలో కన్నెడీ ఓ'బ్రియన్ వంక చూశాడు, నా మాట మరిచిపోవద్దన్నట్లు. యార్బరో ఇంకొక కారు కోసం వెతుకుతున్నట్లు కనిపించాడు. లారీ ఓ'బ్రియన్ వెంటనే అతని రెక్కపట్టుకుని కారులో లేడీబర్డ్ పక్కన కూర్చోపెట్టి తలుపువేశాడు. కార్లు బయల్దేరాయి.

(ఇంకా వుంది)

అభియోగాలలో వింతలు

ప్రేమిస్తే ఇల్లు ఇస్తానని ఆశపెట్టిన ప్రియుడు

ప్రేమభిక్ష పెడితే పురపాలక సంఘం కట్టించే నివాసగృహాలలో ఒక యిల్లు ఇప్పిస్తానని పీటర్ బరో పురపాలక సంఘం సభ్యుడు శ్రీ ఆక్లెండ్ ఆశపెట్టాడని శ్రీమతి క్రిస్టిన్ గిల్బర్ట్ న్యాయస్థానంలో సాక్ష్యం చెప్పినది. ఈమె గృహిణి. అందంగా ఉంటుంది. వయస్సు 26 సంవత్సరాలు. బలవంతంగా, అక్రమంగా ఒక స్త్రీ శీలాన్ని చెడగొట్టడానికి యత్నించాడన్నది శ్రీ ఆక్లెండ్ మీద జరిగిన ఆరోపణ. వయస్సు 48 సంవత్సరాలు. పూర్తి పేరు విలియమ్ ఆక్లెండ్. రైలు డ్రైవర్గా పనిచేస్తున్నాడు. పీటర్ బరో పురపాలక సంఘంలో ఆరు సంవత్సరాలుగా సభ్యుడు.

శ్రీమతి గిల్బర్ట్ న్యాయస్థానంలో ఇట్లా చెప్పినది: 'శ్రీ ఆక్లెండ్ను నాలుగు సంవత్సరాలకిందట మొదట నేను కలుసుకున్నాను. ఆ తరువాత క్రీవ్ స్ట్రీట్లోని అతని ఇంట్లో పని చెయ్యడానికి రోజూ వెళ్ళేదాన్ని. మా యింటి ఎదురుగానే ఆక్లెండ్ ఇల్లున్నది. అతని భార్య ఉద్యోగానికి వెళ్ళినప్పుడు నేను అతని ఇంటికి వెళ్ళేదాన్ని.

'ఎందుకైనా మంచిదని నా వెంట నా బిడ్డలలో ఒకరిద్దరిని వెంటపెట్టుకు వెళ్ళేదాన్ని. అనవసరంగా నన్ను తాకేవాడు. నాపాటికి నన్ను పనిచేసుకోనిచ్చేవాడు కాదు. నా ప్రేమను పొందడమే తన జీవిత ధ్యేయమనేవాడు.

'నేను ఎన్నడూ అంగీకరించలేదు. ఆ వయస్సులో అతను అట్లా మాట్లాడడం నాకు తమాషాగా ఉండేది.

'అతని ఇంట్లో పని మానుకున్నాను. కాని, అతను వదిలిపెట్టలేదు నన్ను. వీధులలో నా యెదుటపడేవాడు. వారానికి నాలుగైదుసార్లు మాయింటికి వచ్చేవాడు. ఆ తరువాత ఆకాశరామన్న ప్రేమలేఖలు వ్రాసేవాడు.


'పెండ్లి కాకముందు ఒక యువకుడితో నేను స్నేహంచేసిన సంగతి ఆక్లెండ్కు తెలుసు. ఆ కారణాన అతనుచేసే అల్లరి సంగతి నా భర్తకు చెప్పడానికి వీలు పడలేదు.

'ఒకరోజు ఆక్లెండ్ మాయింటికి వచ్చాడు. ఉత్తరాలను గురించి తగాదా పడ్డాము. మా యింట్లోనుంచి తక్షణం బయటికి పొమ్మన్నాను.

'నన్ను బెదరించాడు. బంగాళాదుంపలున్న పళ్ళెం ఒకదానిని అతనిమీదికి విసిరాను. అప్పుడు ఆక్లెండ్ నాదగ్గరకు వచ్చి నా గొంతునులిమి చంపేస్తానన్నాడు.'

శ్రీ ఆక్లెండ్ ప్రతివాదన చెయ్యలేదు. వాటింగ్ అస్సైజెస్ విచారణకు అభియోగాన్ని పంపించారు.

—వి. ఎస్. అవధాని.



గత ప్రాచీనకాలపు విశిష్టతను
మారుమ్రోయించుచున్నవి.
ప్రశస్తమైన సుందరమగు
మఫత్‌లాల్ గ్రూప్ వాయిల్స్.
సాంప్రదాయ విరమణ
సాంప్రదాయ పునరోద్ధరం
MAFATLAL GROUP
మఫత్‌లాల్ గ్రూప్
2 2 వోయిల్స్
మరియు లినెన్
'టెరిన్'/కాటన్, 'టెరిలైన్' మరియు
'మనిమైట్' క్వాలిటి
న్యూ శొరక్ (శొరక్) అహమదాబాద్ . న్యూ శొరక్ నదియాడ్ . స్టాండర్డ్, బొంబాయి
స్టాండర్డ్ (న్యూచైనా) బొంబాయి . స్టాండర్డ్, దేవాస్ . సాసూన్ బొంబాయి . సాసూన్
(న్యూ యూనియన్) బొంబాయి — సూరత్ కాటన్, సూరత్ — మఫత్‌లాల్ ఫైన్, నవసారి

లివ్ అండ్ లెట్ డయ్ - 2

జేమ్స్‌బాండ్ బొమ్మల సీరియల్



'న్యూయార్క్, సెయింట్ రెజిస్ హోటల్‌లోని 2100 రూంలో ఫెలిక్స్ ఇచ్చిన అమెరికన్ దుస్తుల్ని వేసుకున్నాను.......

'మిస్టర్ బిగ్‌కి అండగా ఉన్న శక్తి 'ఊడూ'ని చదవటానికి కూర్చున్నాను.

'మరొక పార్సెల్ సార్'

'హమ్? ఓహో, మంచిది, మిగతా వాటితో పాటు అక్కడ పెట్టు

టిక్—టాక్............టిక్—టాక్



టిక్—టాక్... టిక్—టాక్

'నా రూంలోకి పంపిన పార్సెల్ నుంచి వస్తున్న చిన్న శబ్దాన్ని మొదట గమనించనంతగా ఊడూ చదవటంలో లీనమై పోయాను.'

'ఏమిటి వింత. ఈ రూంలో ఉన్న గడియారం కరెంట్‌తో నడిచేది!........

'అప్రయత్నంగా పేలేలోపే మెరుపులా తప్పుకున్నాను.'



'అదృష్టవశాత్తూ, ఆ పేలుడు వల్ల నేనేమీ గాయపడలేదు!

'ఫెలిక్స్? చిన్న బాంబ్ ఇప్పుడే పేలిపోయింది.

'4—బోర్ ఎలిఫెంట్ గన్ తూటా. అదృష్టవంతుడివి. అది గ్రెనేడ్ కాదు. కాని ఇదేమిటి?

ఈ గడియారం గుండె టిక్ టిక్ మని మోగటం ఆగి పోయింది. నీ గుండె కొట్టుకోడాన్ని లెక్కించాల్సి లెక్కించటం నే మొదలు పెట్టాను.



'హూఁ, పోతగాని కబుర్లు.'

పార్సెల్ బాంబ్‌తో పాటు వచ్చిన ఆ బెదిరింపు ఉత్తరాన్ని బాండ్, లీటర్‌లు చదువుకున్నారు.

'ఇప్పుడేమిటి జేమ్స్?'

'ఆ బాంబు ఓ విజిటింగ్ కార్డులాంటిదే. తిరిగి అభినందనను నేను తప్పక పంపాలి.'

'మంచిది ఈ రాత్రికి మనం హార్లెమ్‌లో చూద్దాం.'

'నేను మిస్టర్ బిగ్‌ని కలవటానికి సిద్ధం అయ్యాను. అది తగిన సమయం. ఎనిమిది రవుండ్ల బెరెట్టా తీసుకుని, ముందు ఉక్కు అంచులున్న బూట్లు వేసుకున్నాను.



'మనం బస్‌లో హార్లెమ్ వెళ్దాము. ఈరోజుల్లో అక్కడ కాస్త అడివి ఉంటుంది. చీకటి పడ్డాక అక్కడికి వెళ్లాలంటే గుర్రపుబళ్లు కూడా ఎక్కువగా కనిపించవు.'

ఇద్దరు మనుషుల కోసం అన్నికళ్లనూ జాగ్రత్తగా కనిపెట్టి ఉండమని చెప్పు. పేర్లు: బాండ్, లీటర్‌లు. అందులో ఒకతను బ్రిటిష్ వ్యక్తి. వాళ్లు ఈరాత్రికే యిక్కడికి వస్తున్నారు. నే చెప్పేంతవరకూ వాళ్లని తాకొద్దు.

'అలాగే మిస్టర్ బిగ్'

'మాకప్పుడు తెలిక పోయినప్పటికీ మిస్టర్ బిగ్ 'కళ్ల'లో ఒకటి మమ్మల్ని కనిపెడ్తూనే ఉంది.'



హార్లెమ్‌లో మేంవేసిన ప్రతి అడుగూ మిస్టర్ బిగ్‌కి తెలుస్తూనే ఉంది.

భయం అతన్ని కాపాడింది.

'ఆ పెద్దమనిషి ఈరాత్రి ఎక్కడుంటాడో తెల్సా?'

'నాకు పెళ్లాం బిడ్డలున్నారు బాస్. అది నన్ను చెవిటివాణ్ని చేస్తున్నది.

(ఇంకా వుంది)

ముద్రా చిట్టిబాబు

యశస్చంద్రికలు

ఉన్నట్టుండి గుభేమంది!

ఏమిటి? — పేరు, ఉత్త పేరుకాదు. కీర్తి!—

ఎవరిది? — ఎవరిదో అయితే నాకేం కావాలి?—నాదే.

నా పేరే—నా నామమే— నా యశస్సే— నా కీర్తే!—

ఉన్నట్టుండి కీర్తికాంత నన్ను అమాంతం వలచిందంటే—

యశస్చంద్రికలు నన్ను ఉక్కిరిబిక్కిరి చేశాయంటే—

ఊరు వూరంతటా నాపేరు పాక్కిపోయిందంటే—

అబ్బ!—ఎంత గొప్ప!!

అసలు —

పేరు రావాలంటే అంత తేలిగ్గాదు. ఏదేనా మంచిపనో లేదా ఏదేనా వెధవపనో చెయ్యాలి. చేసేతీరాలి, అయినా—వెధవపని చేస్తే వచ్చేది కీర్తి కాదుగా?—అపకీర్తి—చెడ్డపేరు—బద్‌నామ్—నామోషీ.

ఇప్పుడు — నాకువచ్చింది మంచిపేరే. మీకా సందేహమేం అక్కర్లేం, అంటే— నే చేసింది ఏవిధమయినటువంటి వెధవపనీ కాదు. మరోకలా చెప్పాలంటే ఎలాంటి వెధవపనీ నే చెయ్యలేదు.

నేను వెధవపని చెయ్యలేదనటానికి కారణం?—నాకువచ్చింది చెడ్డపేరూ— అపకీర్తీ కాకపోవటం, పైగా నాకు మంచి పేరు—కీర్తి—యశస్సు రావటం.

అందుకనే — నాపేరు తారాపథాన్నందుకుంది.

మరోక సంగతి — మళ్లీ చెప్పలేదనకునేరు! నాకేం పద్మశ్రీలాంటి బిరుదులు లేవు. ఎలక్షన్‌లో నేను నిలబడలేదు, కూచోలేదు, సినిమాల్లో ఆడలేదు, పాడలేదు.

మరి — నాపేరు ఎలా గుభేమంది అని మీ వుద్దేశం?— నాకు కీర్తి — పేరూ— యశస్సు ఎలావచ్చిందీ అని అడుగుతారా?— నే చేసిన ఆ ఘనకార్యం ఏమిటీ అని తెలుసుకుందుకి ఆత్రంగావుందా మీకు?— చెప్పమంటారా?—చెప్పేసెయ్యమంటారా?—

సరే, అయితే చెప్తున్నా — చెప్పేసేస్తున్నా—

అలవాటు ప్రకారం — సాయంత్రం షికారుకి బయల్దేరా. ప్రకాశం గ్రౌండ్స్‌లో 'కవిసమ్మేళన్'కు వెళదామనుకుని, ఎవరెవరొస్తారా అని అంచనా వేసుకుంటూ— నేలమీదని చేతికర్ర టక్కుటక్కుకొడుతూ బ్లాక్‌కాలితో టిక్కుటిక్కుమని అడుగులు వేసుకుంటూ నడుస్తున్నా.

అబ్బా!—సాయంకాలమయినా, దీని దుంప తెగా— ఎండ ప్రకాశిస్తూనేవుంది!—నా గాంధిటోపీ తీసేసి, స్వదేశీ జేబు రుమాలుతో చెమటతుడుచుకున్నా. హమ్మ్!!

మా వూళ్లో తెరవబడనున్న కొత్త గ్రంథాలయ ప్రాంతానికి వచ్చేసరికి—ఏదో చాలా గడబిడగా—హడావుడిగా వుంది. చుట్టుపక్కలంతా జెండాలు, తోరణాలు, మైకులు, పాటలు—

చేరేసరికి వెళ్లా. పాట ఆగిపోయింది!—

'సోదరులారా, మనవి!— సోదరీమణులారా, నిశ్శబ్దంగా ఉండాలని మా ప్రార్థన. కొన్ని అనివార్య కారణాలవల్ల—దోవలో కారుకి పేరుకు రావటంవల్ల మన మంత్రిగారు రావటం కొద్దిగా ఆలస్యమయింది. ఇందుకుగాను క్షమించగోరుతున్నాము. కొద్ది క్షణాల్లో మంత్రిగారు రాగలరు. అందరూ శాంతి ఉండాల్సిందని ప్రార్థన....'

ఈ మాటలు వినబడటమూ, నే నటుగా వెళ్లటం ఒకేసారి జరిగాయి.



"మంత్రిగారు...మంత్రిగారు..." అన్నా రెవరో.

జనం—కోలాహలం!—

పరుగెట్టుకొచ్చాడు కార్యదర్శి.

నమస్కారం పెట్టాడు—నాకు.

నిర్వాహక వర్గంవారు వచ్చి, నన్ను లోపలికి తీసుకెళ్ళారు. వెళ్ళాను.

లైబ్రరీ గుమ్మంలో ఒకపెద్ద నీలం రంగు రిబ్బన్ కట్టివుంది. అది చూపించి, తళతళ మెరిసే కత్తెరొకటిచ్చారు.

కట్!—

అంతా చప్పట్లు కొట్టారు.

మళ్ళీ మైక్‌లో ప్రకటన: 'సోదరీమణులారా, సోదరులారా!— సైలెన్స్, మంత్రిగారు వచ్చేశారు. నిరాడంబరులైన శ్రీ మంత్రిగారు మన గ్రంథాలయానికి కేవలం పాదచారులయ్యే వచ్చారంటే ఆశ్చర్యకరమైన విషయంకదూ!— గ్రంథాలయ ప్రారంభోత్సవం జరిగింది. కొద్దిక్షణాల్లో వారు వేదికమీదికి వస్తున్నారు. కనుక నిశ్శబ్దంగా ఉండమని ప్రార్థన...'

నిర్వాహక వర్గంవారు నన్ను వేదిక మీదికి తీసుకు వెళుతూవుండగా—

ఒకటాక్సీ వచ్చింది.

ఆగింది.

'మంత్రిగారు...మంత్రిగారు...' జనంలో కోలాహలం!—

నిజమే!— నిజంగా మంత్రిగారే!!—

అందరమూ వేదికమీదికి వెళ్ళాం.

సభలో ఫెళ్ళున నవ్వులు!—


'సైలెన్స్—సైలెన్స్!—' అంటూనే వున్నారుగాని, వేదికపైనా, సభలోనూ నవ్వులు ఆగలే.

నేనూ — నవ్వుకుంటూనే మంత్రిగారి ముఖారవిందం చూశాను.

నవ్వుతున్న మంత్రిగారు అద్దంలో నా ప్రతిబింబంలా ఉన్నారు.

అయితే, ఒక్కటే తేడా!

నేను కాస్త ముందూ—ఆయన కాస్త వెనకా. ●



జ రి గి న క థ

వెంకట్రామయ్యగారు ఓ హైస్కూలు సంస్థాపకులు. ఆయన కుమారుడు మధు. వారింట్లో పెరిగిన అనాథ ప్రసాద్. ఆ స్కూల్లో పనిచేసే హెడ్మాష్టరు కామయ్య ఆయనకు ఆప్తమిత్రులు. వెంకట్రామయ్యగారికి జబ్బుచేసి మరణిస్తారు. మద్రాసులో చదువుకుంటున్న మధు సెలవులకని ఇంటికివచ్చి ఉత్సవాల్లో కామయ్య మాస్టారి కూతురు శారదను ప్రేమిస్తాడు. శారద అంగీకరించదు. అన్నపూర్ణమ్మగారు వెంటనే మధుచేత మద్రాసు ప్రయాణం కట్టిస్తుంది. కొత్తగా తయారయిన స్కూలు భవనం ప్రారంభోత్సవాల్లో చాలా శ్రద్ధాసక్తులు చూపించారు శారద, ప్రసాద్‌లు. ప్రసాద్‌మీద శారదకు ఎంతో అభిమానం. తప్పించుకు తిరుగుతుంటాడు ప్రసాద్. తర్వాత అతనంటే ఆమెకు అశాంతి ఎక్కువయింది.

13

ఆవేళ జరిగిన సంఘటనలన్నీ ఆమె చుట్టూ పరిభ్రమించసాగాయి. ప్రయత్నపూర్వకంగా వాటిని దూరం చేసుకోటానికి కళ్ళుమూసికొంది. గడచినరాత్రి గ్రీన్ రూమ్‌లో మనసును చికాకుపరచిన కొన్ని సంఘటనలమూలంగా రాత్రంతా నిద్ర లేదు— పగలు భోజనాలయ్యాక ఎండలో ఊర్మిళ వాళ్ళఇంటికెళ్ళిన కారణంగా అలసి ఉన్న తనకు వెంటనే నిద్రపట్టేసింది. వాలుకుర్చీలో అలాగే పడుకొని నిద్రపోయింది.

* * *

సాయంత్రం మూడుగంటలు దాటింది. వీధుల్లో మళ్ళీ జనసంచారం మొదలైంది. కావిడిలో కడవలువేసుకొని మంచి నీళ్ళకుపోతూన్న కోటయ్య బజార్లోఉండే 'చిన్నమ్మాయి' అని కేకవేసి కావిడితాళ్ళు సరిచేసుకోసాగాడు.

'భాను' బయటికొచ్చింది.

'చిన్నమ్మాయ్ ... అక్కయ్య — మస్వో మిరపతోట కొస్తానన్నారంటగా ... మరి తొందరగా బయల్దేరమను ... మళ్ళీ పొద్దు గూకుతుంది...నేను కావిడి తెచ్చేసరికి 'లక్షీ—లక్షీ'గా ఉండాలి' అంటూ వెళ్ళిపొయ్యాడు సమాధానంకోసం ఎదురుచూడకుండ.

'అక్కయ్యా'...భానూ పిలిచింది.

'అక్కాయ్.'

శారద తృళ్ళిపడిలేచింది. కళ్ళు ఎర్రగా మెరుస్తున్నాయి. ప్రక్కగా ఒత్తిగిలి పడుకోవటాన మడతకుర్చీ అచ్చు ఒక చెంపపై బడి ఎర్రగా కందింది. మెడ, ముఖమంతా చెమటపట్టింది. పమిట చెరగుతో ముఖం తుడుచుకుంటూ 'పొడునిద్ర... ఎంతసేపు నిద్రపొయ్యానుభానూ '...అంటూ సిగ్గుపడుతూ కుర్చీనుండి లేచింది. కళ్ళు ప్రశాంతంగా నిర్మలంగా ఉన్నాయ్— ఆలోచనలన్నీ అదృశ్యమైపోయి కాంతివంతంగా మెరుస్తున్నాయి.

'ఒకటిన్నరకు పడుకొన్నావ్' అంటూ గడియారంకేసి చూపెట్టింది భాను.

'అమ్మ...బాబోయ్...ఇంతసేపూ ఇలానే కుర్చీలో పడుకొన్నానా?...కొంపదీసి ఎవరైనా చూశారా' ... సిగ్గుముంచుకొచ్చి ఎర్రని పెదవులు బిగపట్టుకొని చిరునవ్వు చిందించింది.

'లేపి మంచంపై పడుకోమని చెబుదామనుకొన్నానుకానీ లేపితే మళ్ళీ నిద్రబట్టదని లేపలేదు...ఎవరూ రాలేదులే?'...

'బంతిపూలు తెచ్చుకోటానికి వెళ్దామన్నావ్‌గా...త్వరగా ముఖం కడుక్కో పిన్ని కబురుపెట్టింది' ... అలస్యాన్ని సహించలేనట్లుగా భానూ పలికింది.

'మరి వాన్నను రానివ్వు...!చెప్పకుండా ఎలా కెళ్తాం?'

'పిన్నిగారిపొలమంటే వాన్న ఏమనడులే... అయినా నీవు ముఖం కనుక్కొనేలోగా వాన్న రావచ్చు...ఆయనకు కావల్సింది కాఫీయేగా... కాఫీ ప్లాస్కులోపోసి రెడీగా ఉంచేశా'... వెళ్లటానికి ఆటంకాలేమీ లేనట్లు మహా ధ్యానంగా చెప్పింది.

శారద సబ్బుతో శుభ్రంగా ముఖం కడుక్కొంది. ముఖంలో మళ్ళీ తేటతనం కనిపించింది. చెక్కిళ్లపై అందంగా మొటిమలు నిగనిగలాడుతున్నాయి. టవలుతో ముఖం తుడుచుకొంటూ అద్దముందుకెళ్ళి ఒక మొటిమను సున్నితంగా ఒత్తసాగింది.

'అక్కాయ్...పిన్ని...రానేవచ్చింది...త్వరగా కానియ్' శారద దువ్వెన తలలో గుచ్చుకొని బయటికి తొంగిచూసింది. భాస్కర్ తల్లి కొడవలిక్కి ఒకగుడ్డ చేతో పట్టుకొని లోనికి రాసాగింది.

'వస్తున్నాపిన్నీ...ఒక్కనిముషం' అంటూ త్వరత్వరగా తల దువ్వుకోసాగింది.

'తొందరగా తెములుకోతల్లీ ... గడ్డికొయ్యాలి...నాల్గువంచెలు గడ్డి కోసేప్పటికి పొద్దు జారిపోతది ... పచ్చిగడ్డి మేపకపోతే పాడుబర్రె...తన్నిందన్నమాటే...రేపు మీకూ మాకూ తెల్లనీళ్లు దొరకవ్'...అని కొద్దిగా పరీక్షగాచూసి ... 'ఇయ్యాల వాన్న ఇంటికొచ్చినజాడలేదే? ... ఇంకా ఏంపనులు?... విన్నటితోనే అయిపొయ్యాయిగా అవీ'...

'అదేపిన్నీ...రాత్రి మీటింగులో మాట్లాడారు చూడు...ఆ పొడుగాటికోటు వేసికొన్న పడివయస్సుమనిషి'...శారద అంది.

'పడికారే ... ముసలాడే ... చూపులకి అట్టనిపిస్తాడుగానీ ... అయితే'... సందేహంతో కూడినచూపులతో అడిగింది ఆమె...

'ఆఁ...వారు ఇప్పుడు మన స్కూలు

పొడిచ్చారు. వారికి మార్కులు లెక్కలు—బాధ్యతంతా అప్పగిస్తున్నారు...ఇంకా పూర్తి కావట్లేదు'...

'అంటే నాన్న ఇదివరకులా పెద్దవంతులు కాదన్నమాట...' కళ్ళుప్పగించి కిటికీవద్ద వున్న శారదకేసి చూసింది. అంతలోనే తేరుకొని,

'సరిపోయె...చందాలు పోగుజేసి ... పది మందికీ నచ్చచెప్పి రెండుమూడేళ్ళు కష్టపడి ఆ గదులన్నీ కట్టించి ఇంతాసేస్తే... అంతా ఊడేరినాక ఈయనెందుకు'...

'అదంతేలే పిన్నీ...ఈ సంవత్సరం పదో తరగతి...యస్.యస్.యల్.సి. వచ్చిందికదా! అందువలన పెద్ద చదువు చదివినవాళ్ళు కావాలని గవర్నమెంటు 'రూల్స్' ఉన్నాయి అందువలన నాన్నగారు అప్పగించెయ్యాలి...' చీర మార్చుకొని బయటకొచ్చింది.

'ఏందో...రూల్సు...మన్ను...మశానం... ఆయన ఎనుమంటి మడిసో...తెలియాపెట్టకుండ బుడిగి బుడిగిన అప్పజెబితే రేపు ఏకు మేకవుతాడు' అంటూ కొలుసాగించింది

'భానూ...అన్ని సామాన్లు లోపల పెట్టావా?...ఇక తాళం వేసెయ్యి పోదాం' అంటూనే శారద ఆమెను అనుసరించసాగింది. భాను...తాళంవేసి తాళపు చెవి ఫోటోలున్న గోడపై గుర్తుగా పెట్టి పరుగెత్తి వెళ్ళి వాళ్ళిద్దరిలో కలిసింది.

శారద వాల్గడుగులు వేసి హుషారుగా నడవబోయింది. కానీ దెబ్బతగిలిన వేలు తొందరగా నడవనిచ్చిందికాదు. జాగ్రత్తగా ఆ వేలు భూమికి తగలకుండ అడుగు వేసికొంటూ ముందుకు సాగింది. వాళ్ళు చింతచెట్ల ప్రక్కగా నడిచి పైనూర్లు పిచ్చితుమ్మచెట్ల మధ్యగా నడిచివచ్చి పెద్ద చెరువుకట్ట పైకెక్కారు మాట్లాడు కొంటూ.

విశాలమైన చెరువు...అవతల గట్టున ఉన్న కొండవరకూ తెల్లగా వ్యాపించింది. ఎండకు మిలమిలా మెరుస్తోంది. వాలు గాలికి కెరటాలు పరుగు పరుగునా వచ్చి ఒడ్డుకు 'ఢీ' కొట్టుకొంటున్నాయి. వయసులో కోరికలు మనసును ఒరుసుకొంటు న్నట్లు అలలు ఒడ్డును కోస్తున్నాయి.

వాళ్ళు ముగ్గురూ కట్టపైన కాలి బాటపై ఒకరి వెనుక ఒకరు నడువసాగారు. భాను మధ్య మధ్యలో కట్ట క్రిందకు పరుగెత్తి అల్లిపూలు...అందమైన తెల్లని గవ్వలు ...అచ్చనగిల్లాలకు పనికొచ్చే కొవ్వరాళ్ళు ఏరి తెచ్చుకొంటోంది. భాస్కర్ తల్లి ఏదో చెప్పుకొంటూ ముందు నడుస్తోంది. శారద 'ఊఁ' కొడుతూ దూరాన కొండలకేసి, మేఘాలకేసి గడ్డిదుబ్బుల్లో జపంచేస్తున్న గుడ్డి కొంగలకేసి చూస్తూ నడుస్తోంది.


'అబ్బ'...అంటూ ముందుకు వంగింది శారద.

'నే చెప్పలేదమ్మా...పొడు మట్టిపెల్లలు ...సూదుల్లా గుచ్చుకొంటాయి... అసలే మెత్తటి పాదాలు..'

వేలికి అంటుకొన్న మట్టి పెల్లలను దులుపుకొని ముందుకు సాగింది శారద మళ్ళీ దిక్కులు చూసికొంటూ.

ఎవరో నల్లని మనిషి. గోచీపెట్టుకుని బండమీద నిలబడ్డాడు. ఉతికిన పంచెను గాలికివాలుగా పట్టుకొని ఆరబెట్టుకొంటు న్నాడు. చెరువు కట్టక్రింద రెండెడ్లబళ్ళు కిర కిర లాడుతూ వరి చెత్త మోసుకు పోతున్నాయి. ఆ ఎద్దుల కాలిగిట్టలవలన రేగిన దుమ్ము వాలుగాలికి తమ వైపు





గ్యారంటీ

ఈ బ్యాటరీలతో మీ పరికరములు చిన్న ముక్కలుగా ఊడి, శక్తి వ్యర్థమై, లేక బ్యాటరీ ఉబ్బి పాడయిపోతే వాటిని మాకు బ్యాటరీలతో సహా పంపండి. కంపెనీ ఉచితముగా మార్చి యిస్తుంది.

ట్యూడర్ ట్రాన్సిస్టర్ బ్యాటరీలు ప్రత్యేకముగా డిజైనుచేయబడినవి. కనుక యివి:

ఎడతెగని శక్తిని యిస్తాయి
అన్ని శీతోష్ణస్థితులను తట్టుకొంటాయి
ఎక్కువ కాలము మన్నుతాయి
100% లీక్ ప్రూఫ్

TUDOR® ఒక నూతన దేదీప్యమాన ప్రపంచమునకు-ట్యూడర్

ట్రోపెక్స్ బ్యాటరీస్ వారి
తయారు

(హాపెరో ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్, ఇండస్ట్రియల్ ఎస్టేట్, లాల్ బాగ్, బొంబాయి-12 డిడి

Criterion-TL-1100 Te

చిలిపిగాచూసే ఆతని అందమైనకళ్ళు... తృప్తితోకూడిన దీనత్వం ఆ కన్నుల్లో ఆమెకు కనిపించింది. కానీ ఈరోజు ఆ కళ్ళల్లో నీలినీడలు కమ్మి ఉన్నాయి. నిరాశ నల్లగా గూడు కట్టుకొంది.

'పాపం—మధు...ఎంత సున్నితహృదయం ...తను ప్రసాద్‌ను ప్రేమిస్తున్నానని తాను ప్రసాద్ సొత్తునని మనను వికలం చేసి కొన్నాడు — తాను అందని ఆనందమని పొందలేని అందమని వ్యథ పడిపోయి జ్వరం తెచ్చుకొన్నాడు ... అతనన్నట్లు ఆకర్షణ—వాంఛా రెండూ సహజాలే... ఆత నితప్పులేదు...పాపం రేపటినుండి తనకు దూరంగా తిరుగుతాడు. తనను మరచి పోటానికి ప్రయత్నిస్తాడుకాబోలు ... కన్న తల్లిలా అతనిని ఒడిలోకితీసికొని ఊర డించాలనేభావన కల్గింది.

'తనెందుకు ఊరడించాలి' — మళ్లీ ప్రశ్నించుకొంది.

అతని ఊర్మిళచేస్తుంది... అమాయకపు పిల్ల — ఎంతచనువుగా అతని నుదుటని స్పృశించింది మధ్యాహ్నం — రెండవవ్యక్తి మరొకరున్నారనే సంకోచమే తనకులేదు— ఎంతప్రేమ! ఆతనంటే...ఆతను తన సొత్తు. వాళ్ళిద్దరూ చేతులు చేతులూ పట్టుకొని నడుస్తున్నట్లు కనిపించింది—ఆకాశవీధిలో.

'పెద్దమ్మాయి — ఏమిటీలా దిగాలుపడి పోయి చూస్తున్నావ్. ఇంటికొచ్చేది లేదా! బంతిపూలుకూడకోసి కొన్నట్లులేదే'...గడ్డి మూటి కట్టుకొంటూ ఆమె అంది.

ఆ పిలుపుతో ఆ సంజెవేళ అప్పుడప్పుడే అల్లుకుపస్తున్న మంచుతెరలలో ఆమె భావనలుఅంతర్ధానమయిపోయ్యాయి. సిగ్గుతో కుంచించుకుపోయింది — 'భానూకోసిన పూలు చాల్లేపిన్నీ' అంటూ ముందుకు కదిలింది. గడ్డిమూట నెత్తినపెట్టుకొని కోటయ్య ముందు నడిచాడు. అతనివెనుక భానూ భాస్కర్‌లు అల్లరిగా పెద్దపెద్దగా మాట్లాడుతూ నడవసాగారు — అందరికన్నా వెనగ్గా వాళ్ళిద్దరూ ఆ సంధ్యాకాంతుల్లో ఇంటిదారి పట్టారు.

(ఇంకా వుంది)

మనమూ మన కార్టూనులు


ఈ మధ్య వారపత్రికలలో కానివ్వండి, మాసపత్రికలలో కానివ్వండి కార్టూనులకు ఓ ప్రత్యేకమైన స్థానాన్ని ఇస్తున్నారనే చెప్పవచ్చు. నిజానికి అది అవసరం కూడా. సున్నితమైన హాస్యంతో నవ్వించే కార్టూన్లు మనసును ఆహ్లాద పరుస్తాయి; కాని మనిషి విలువలను (స్త్రీ), చరిత్రను తారుమారు చేసే కార్టూనులు మోరటుగా వుండి వెగటును కలిగిస్తాయేకాని, ఇంకేమి అందివ్వలేవు. అసలు 'కార్టూన్లు' అంటే ఏమిటి? వాటి ప్రయోగం ఏమిటి? అని ప్రశ్నించుకొంటే, సున్నితంగా, మెత్తగా ఇతరుల లోపాలను ఎత్తిచూపటం కావచ్చు, ఓ నవ్వు పుట్టించే సంఘటన కావచ్చు; ఓ ఛలోక్తి, ఓ విసురు, ఓ వ్యంగ్యం ఏదైనా కావచ్చు. కాని ఇప్పుడు ధారాళంగ ప్రచురింపబడే కార్టూనులు ఒకే ఒక పోకడలో మోరటుగావుండి విసుగు పుట్టించటయే కాకుండ (ముఖ్యంగా స్త్రీలను) బాధపెడుతున్నాయనే చెప్పవచ్చును. వీటిల్లో ముఖ్యంగా కనిపించేవి ఓ అప్పడాలకర్ర లేక రోకలి, ఓ పీపాలాంటి భార్య, ఓ వెదురుబద్దలాంటి భర్త. నేడు కార్టూన్లు వేసేవారికి ముఖ్యమైన మూల విషయాలు ఈ మూడే. అనేకమైన కార్టూనులు చూసి, ఎంతోమంది స్త్రీలు బాధపడటం స్వయంగా చూసిన తరువాతే ఈ వ్యాసం వ్రాయటమైనది.

ఈ కార్టూనులు వేసేవారికి ముఖ్యంగా స్త్రీ అంటే ఏమిటో! ఎవరో! తెలుసుకోవలసిన అవసరం ఎంతేనా వుంది. అసలు ఈ కార్టూనులను (అంటే నా ఉద్దేశ్యంలో, స్త్రీలను దుయ్యబడుతూ వేసేవి మాత్రమే!) విదేశీయులు గనుక చూస్తే హైందవ స్త్రీని ఓ దెయ్యంగానో ఓ భూతంగానో ఊహించుకొంటారనేది సత్యదూరం కాదు. లలితకళలు ఆయాదేశ స్వరూప సంస్కృతులకు ప్రతిబింబాలు కావని ఎవరనగలరు! కార్టూనులుకూడ చిత్రకళలో ఓ భాగం కాదా!

హైందవస్త్రీకి మన దేశంలోనేకాదు. యావత్ ప్రపంచంలోనే ఓ ప్రత్యేకమైన స్థానం వుంది. సతీ సావిత్రులు, సతీ సుమతులు ఇప్పుడు లేకపోవచ్చును. పతివ్రత అన్నా పాతివ్రత్యమన్నా ఓ విధంగా దాస్యమే అని అర్థం చెప్పుకొని హేళన చేయవచ్చును. కాని తరతరాలుగా భారత స్త్రీలో ప్రవహిస్తున్న రక్తములో, 'పతియే ప్రత్యక్ష దైవ'మన్న సూక్తి జీర్ణించుకొని పోయిందని చెప్పటం అతిశయోక్తి కాదు. ఆనాటి సుమతి భర్త త్రాగుబోతు, తిరుగుబోతు అయినా దైవమేనని ఎంచి పూజిస్తే, ఈనాటి కాలేజి అమ్మాయి భర్త పేకాడుతూ క్లబ్బులచుట్టూ తిరుగుతున్నా ఓరిమితో సంసారాన్ని గుట్టుగా చేసుకొంటుంది. వీలైతే భర్తను మార్చుకోవాలని చూస్తుంది. అంతేకాని ఏ స్త్రీ కూడా భర్తను రోకళ్లతో, అప్పడాల కర్రలతో సింగారించదు.

ఈమధ్య ప్రచురితమైన కార్టూనులు చూస్తే నిజంగా ఎంతో బాధ వేస్తుంది. ఓ స్త్రీ భర్తను అటకెక్కించి సినిమాకు వెడితే! ఓ స్త్రీ భర్తను గుంజగా నుంచో బెట్టి తాడుగట్టి గుడ్డలు ఆరవేసుకొంటుంది? నిజానికి ఎవరైనా గుండెలమీద చేయివేసుకొని చెప్పగలరా. ఇటువంటి సంఘటనలు స్వయంగా చూసామనికాని చేసామని కాని! చాలాకార్టూనులలో భర్త వంటచేస్తుంటే భార్య దర్జాగా కుర్చీలో కూర్చొని పుస్తకం చదవటమో లేకపోతే పక్కింటి పుల్లమ్మతో కబుర్లు చెప్పటమో చేస్తూ వుంటుంది. నిజానికి ఇటువంటి కార్టూనులు స్త్రీలను గయ్యాళిగా చూపటమే కాకుండా పురుషుల విలువలను కూడా తగ్గిస్తాయి! భార్యా విధేయుడై వంటచేసి దెబ్బలుతినే భర్తలకు వ్యక్తిత్వ మెక్కడిది? ఉత్తి చవట అన్నమాట! ఇటువంటి చవటలను సృష్టించి పురుషులు తమ వ్యక్తిత్వాలను ఎందుకు చిన్నబుచ్చుకుంటున్నారన్నది అనూహ్యం!

ఏది ఏమైనా ఒక్కటి మాత్రం నిజం. స్త్రీలమీద చేయి చేసుకొని భార్యను ఓ బానిసకింద జమకట్టి హీనంగా చూసే పురుష పుంగవులు సమాజంలో కోకొల్లలు. కాని భర్తలమీద చేయి చేసుకొనే భార్యలు మన సమాజంలో చాలా అరుదుగా కనిపిస్తారు. నిజానికి భారత స్త్రీకి ఓర్పు ప్రేమ సహనం ఉగ్గుతో నేర్పిన గుణాలు.



అందువల్ల మన భారతదేశంలో విడాకులు స్వైర విహారం చేయలేకపోయినాయి. అంటే స్త్రీలంతా సహనశీలురూ, మంచివారే అని నే చెప్పను. ఎంత గయ్యాళి స్త్రీ అయినా భర్త మీద జోరు పాతేసుకోవటానికి మించి ఏమి చేయలేదు.

ప్రతి స్త్రీ కూడ తన భర్త యొక్క వ్యక్తిత్వపు నీడలో విశ్రాంతిగా పయనించ కోరుతుంది. ఓ సంసారంలో భార్య తెలివిలేనిది, అమాయకురాలు అయితే, పనిమనిషికి ఇవ్వాల్సిన జీతందగ్గరనుంచి ఇంట్లోకి ఏమి సరుకులు కావాలో అన్నీ భర్తే చూసుకోవలసివస్తుంది. ఇటువంటి సంసారం ఏవిధంగాకూడ సంఘ దృష్టిలోకిరాదు. కాని దురదృష్టవశాత్తు ఆ భర్తకు వ్యక్తిత్వమనేది లేకపోతే! తన కుటుంబశ్రేయస్సుకొరకు భార్య ముందుకు రాకతప్పదు. జమాఖర్చుల దగ్గరనుంచి భర్తకు తినుకోవలసిన గుడ్డలవరకూ భార్యే చూడవలసి వస్తుంది. ఇటువంటి సంసారాలు త్వరగా నలుగురి నోళ్లలోకి వస్తాయి 'ఆడపెత్తనం' అన్నపేరుతో. బహుశ ఇటువంటి సంసారాలే కార్టూనులకు మూలవిషయాలు కావచ్చు!

అన్నివిధాల భర్త సమర్థుడైనప్పటికీ లెక్కచేయక తమనోటి దురుసుతో గయ్యాళిగావుండే స్త్రీలులేరని నే చెప్పలేను. కాని ఎక్కడో ఎవరో ఓ స్త్రీ భర్తను చులకన చేసిందని ఏకబిగిని కార్టూనులు వేయటం, నలుగురూ చదివే పత్రికలను ఖరాబు చేయటం అంత మంచిదికాదు. అన్నిటికన్నా శోచనీయమైన విషయం ఇటువంటి కార్టూనులు స్త్రీలనుంచికూడ రావటం! ఇతరుల నెత్తిన మొట్టేవారిని మందలించగలం కాని తమనెత్తిని తామే మొట్టుకొనే వాళ్ళను ఏమనాలి?

కార్టూనులు వేసేవారిని దుయ్యబడుతున్నానని కోపగించుకోవద్దు. నిజానికి ఈ వ్యాసం నేడు ప్రచురితమయ్యే కార్టూనులు చూడవలసిన ఖర్మపట్టిన అనేక స్త్రీల హృదయం ఘోష! అచ్చులో ఈ వ్యాసం రాకపోవచ్చు కాని ఇందులోని మూలవిషయం ప్రతిస్త్రీ మనసులో ముద్రవేసుకొన్నదే!

కె. లీలాశంకర్

ఆంధ్రసచిత్రవారపత్రిక

1967 దీపావళి కథల పోటీ

ఎప్పటిలాగనే ఈ సంవత్సరంకూడా "ఆంధ్రసచిత్రవారపత్రిక దీపావళి కథలపోటీ" నిర్వహించబోతున్నదని తెలపటానికి సంతోషిస్తున్నాము. రచయితలందరూ ఎప్పటివలె మాతో సహకరించి ఈ పోటీని జయప్రదం చేస్తారని ఆశిస్తున్నాము.

మొదటి బహుమతి రు. 1600

రెండవ బహుమతి రు. 900

మూడవ బహుమతి రు. 500

నిబంధనలు

1. కథలు స్వంత రచనలై ఉండాలి. ప్రతి కథతోనూ రచయిత అది తన స్వంతరచనేనని, దేనికీ అనువాదంకానీ, అనుసరణకానీ కాదనీ హామీ రాసి పంపాలి. ఈ హామీలు వేరే కాగితం మీద కాక కథ వ్రాతప్రతి మీదనే రాసి ఉండాలి.

2. కథలు తెలుగువారి జీవితానికి సంబంధించి ఉండాలి.

3. వ్రాతప్రతి మీద "దీపావళి కథల పోటీకి" అని స్పష్టంగా రాయాలి. కాగితానికి ఒక వైపు మాత్రమే సిరాతో రాయాలి. రచయిత పేరు, పూర్తి చిరునామా కూడా వ్రాతప్రతి మీద స్పష్టంగా రాయాలి. రచన 12 అరఠావు (ఎక్సర్సయిజు నోట్‌బుక్ పేజికి రెండు రెట్లు) పేజీలకు మించరాదు.

4. కవరు మీద "దీపావళి కథల పోటీకి" అని స్పష్టంగా రాయాలి. పోటీకి రచనలు 'సంపాదకుడు, ఆంధ్రసచిత్ర వారపత్రిక, 7, తంబుచెట్టి స్ట్రీట్, మద్రాసు—1' కి పంపాలి.


5. పోటీకి గడువు తేదీ 31—8—67. ఆ తర్వాత మా కార్యాలయం చేరిన కథలని మామూలుగా ప్రచురణకి పరిశీలిస్తాము.

6. పోటీలో బహుమతి పొందిన కథలని 'దీపావళి ప్రత్యేక సంచిక'గా 3—11—1967 తేదీకల ఆంధ్రసచిత్ర వారపత్రికలో ప్రచురిస్తాము.

7. పోటీ తుదినిర్ణయం ఆంధ్రసచిత్రవారపత్రిక సంపాదకుడిదే. ఈ విషయమై ఎటువంటి ఉత్తరప్రత్యుత్తరాలూ జరపడానికి వీలులేదు.

8. వ్రాత ప్రతులని ఎటువంటి సందర్భంలోనూ తిప్పి పంపడానికి సాధ్యంకాదు. పోటీలో పాల్గొనేవారు తమ రచనలతో తపాలాబిళ్ళలు అతికించిన స్వంత చిరునామా కల కవర్లు పంపనవసరం లేదు.

9. పోటీలో బహుమతి పొందక సామాన్యంగా ప్రచురణకి స్వీకరించే కథల రచయితలకి ఆ విషయం ప్రచురించే ముందు తెలుపుతాము



గదంతా పరిమళాలతో నిండిపోయింది.

రాజేశ్వరి కిల కిలా నవ్వింది.

సుబ్బయ్యనాయుడి దేహంలోని ప్రత్యణువు పులకించింది. మనస్సు తీయని అనుభూతితో కంపించిపోయింది. ఇటువంటి చోట్ల ఎంతో అనుభవం గడించాడు. కనుక యింతవరకు నిలద్రొక్కుకున్నాడు.

ఆమె అతని చేతిని మృదువుగా పట్టుకొని పట్టెమంచము వద్దకు తీసికెళ్లింది. మంచము మీద కూర్చొని నాయుడు, తన చేతిని పట్టుకొన్న ఆమె చేతిని రెండవ చేతితో స్పృశిస్తూ 'రాజీ!' అన్నాడు.

అతని మాటలు మత్తుగా వున్నాయి.

'నాయుడు బావా!' గోముగా చేయి విడిపించుకొంటూ నవ్వింది.

నాయుడు మత్తు తేరి చుట్టూ పరికించి చూశాడు.

నాలుగు గోడలకు రతిమన్మథుల శృంగార లీలా విలాసాల నిరూపించు చిత్తరువులే కనిపించాయి.

అర్ధనగ్నయై యున్న రతిదేవి చిత్తరువు మీదనుండి దృష్టిని రాజేశ్వరి మీదకు మరల్చాడు నాయుడు.

ఈసారి ఆమె కన్నులు నవ్వాయి. గులాబి బుగ్గలు పల్కరించాయి. చిరుగడ్డం వెక్కిరించింది.

నాయుడిలో తీవ్రమైన తపన బయలుదేరింది. గబాలున ఆమె రెండు చేతులు పట్టుకొన్నాడు.

'రాజీ! రాజీ! నువ్వే నా ప్రాణం' అని నాయుడు యింకేమి పలుకలేక ఆమెను పొదివి పట్టుకొన్నాడు.

అతన్ని విడిపించుకొంటూ 'తలుపు' అని తలుపు వైపు చూపింది రాజేశ్వరి.

అతను వెళ్లి తెరవెనుకగావున్న తలుపును మూసివచ్చి ఆమెను అనుకొనే ప్రక్కన కూర్చొన్నాడు.

సిల్కు లాల్చీగుండా అతను ధరించిన పులిగోరు కనిపిస్తోంది.

రాజేశ్వరి అతని వైపు కొంటెగా చూసి లాల్చీ గుండీని విప్పింది. పులిగోరు పతకాన్ని కొన వ్రేళ్లతో తీసుకొని ముద్దు పెట్టింది.

నాయుడు ఆమెను హృదయానికి హత్తుకొన్నాడు.

అంతలోనే తలుపు చప్పుడయింది.

'రాజక్కా! రాజక్కా!' అని పిలుస్తున్నారెవరో.

రాజేశ్వరి మంచంమీదనుండి లేచివచ్చి తలుపు తీసింది.

ఎదురుగా శేషయ్య. గది బయటకు వచ్చింది రాజేశ్వరి.

'ఏం శేషయ్యా, పిలిచావు?' నెమ్మదిగా అడిగింది.

'ప్రసాద్ వచ్చాడు. నీతో మాట్లాడాలట. క్రిందనుంచొని వున్నాడు. పైకి పిలవనా?'

'పైకి రమ్మను చెప్పు.'

శేషయ్య వెళ్లి ప్రసాదును పిలుచుకొని వచ్చాడు.

'ఏం బాబూ! ఏం కావాలి?' ఆప్యాయత ఆమె కంఠంలో ధ్వనించింది.

'రాజక్కా! రేపు కాలేజీఫీజు కట్టడానికి ఆఖరురోజు. పరీక్షఫీజుకూడ కట్టాలి నీకు చెప్పిపోదామని వచ్చాను.

'సరేలే. ఎంతకావాలంటావు?'

'నూటఏభై అయితే సరిపోతుంది రాజక్కా.'

'శేషయ్యా! బాబుకు డబ్బిచ్చిపంపు.' తాళంచెవులు శేషయ్య చేతికిచ్చింది.

'నాయనా! ప్రసాద్! బాగా చదువుకొని వృద్ధిలోకి రావాలి బాబూ!' అనురాగంతో అంది రాజేశ్వరి.

'అంతా నీచలవే రాజక్కా!' కృతజ్ఞతతో బరువెక్కిపోయింది అతని కంఠం.

'వెళ్ళు బాబూ! వెళ్ళు.'

ప్రసాద్ వెళ్ళిపోయాడు.

రాజేశ్వరి తిరిగి గదిలో ప్రవేశించి తలుపు మూసింది.

నాయుడు పరుపుమీద పడుకొని ఏదో ఆలోచిస్తున్నాడు.

'క్షమించండి, కొద్దిసేపు ఆలస్యమయింది.' క్షమాపణ చెప్పుకొన్నది రాజేశ్వరి.

'రాజీ! యిలా వచ్చికూర్చో.' అని తన ప్రక్కలో చోటిచ్చాడు నాయుడు.

రాజేశ్వరి కూర్చొని, పులిగోరు పతకాన్ని చూపుడువ్రేలితో మృదువుగా కొట్టసాగింది.

'రాజీ! నాకు కొన్ని సందేహాలున్నాయి తీరుస్తావా?'

తీరుస్తానన్నట్టు ఆమె చిరునవ్వు నవ్వింది.

'రాజీ! నీకు తోబుట్టువు లెవరులేరని క్రితంసారి వచ్చినపుడు చెప్పినట్టు గుర్తు. కాని నిన్ను ఆ అబ్బాయి 'అక్కా' అని...' మధ్యలోనే మాటనాపి ఆమె ముఖంవైపు చూశాడు,

'నిజమే! నాకు 'నా' అన్నవారెవరు లేని అనాధనే ఒకప్పుడు. తల్లిదండ్రి తోబుట్టువులు ఎవరూలేరు. కానీ, ఈనాడు అనాధు లంతా నావారే—నావాళ్ళు, తోడునీడలే.' నిశ్చలంగా జవాబిచ్చిన ఆమె కంఠంలో వ్యధ లేక పోలేదు.

ఆమె మాటలు నాయుడికేమి అర్థం కాలేదు. ఆ మధురసమయం వృధాచేయ దలచుకోలేదు.

* * *

'రాజేశ్వరమ్మా!'

'నమస్కారము. లోపలకు దయచేయండి శాస్త్రులవారూ!' వినయంగా ఆహ్వానించింది బసవయ్యశాస్త్రిని.

'ఆయుష్మాన్భవ!' అంటూ దగ్గరున్న కుర్చీలో కూర్చొన్నాడు.

'అంతకన్న మరేమి ఆశీర్వదించలేక పోయారా? స్వామీ!'

'వృత్తి ఏదయినా, దానవ్రతం చేపట్టిన దానవమ్మా! దానవ్రతులు ఆయుష్మంతులే కావాలి.'

'ఎందుకు తమరావిధంగా సెలవిచ్చారు. స్వామీ?'

రాజేస్వరమ్మా! అట్టివారివలన సంఘానికి ఎన్నో వుపకారాలు జరుగగలవు.'

'అయితే...సంఘంలో నాకంతటి స్థానముందంటారా?' వుత్సాహంగా అడిగింది జేరాశ్వరి.

'తప్పకుండావుంది. అది వుండబట్టే నేనివాళ యీ విధంగా రావలసి వచ్చింది.'

బసవయ్యశాస్త్రికీ తన వుపోద్ఘాతానికి అదను దొరికినట్లయింది.

'ప్రతిగ్రామానికి దేవాలయం హృదయం వంటిది. దేవుడు మనకు కనిపించకపోయినా, మనకీజన్మ నిచ్చినందులకు మనం కృతజ్ఞత తెలుపుకోవలసివుంది. మన గ్రామానికి సరియైన దేవాలయమేలేదు. వున్న వేణుగోపాలస్వామి ఆలయము జీర్ణమైపోతోంది. దాన్నే పునరుద్ధరణచేస్తే మన గ్రామానికి ఆలయం దక్కుతుందని ఆ భారాన్నంతా నామీద వేశారు. నీ సలహా ఏమిటమ్మా!'

రాజేశ్వరి చిరునవ్వు నవ్వి, 'మీరు పెద్దలు, అనుభవజ్ఞులు నేనేమి సలహా యివ్వగలను.' అంది.

'అందుకు ఏభయివేలదాకా ఖర్చవుతుందని అంచనా వేశారు. గ్రామంలోని దాతలు తలా యింత వేస్తున్నారు దైవ కార్యానికి. మరి నీ వంతు కూడ పదివేలు వేశాము.'

'శాస్త్రులవారూ! మీకు తెలియనిదేముంది. దైవకార్యానికి యివ్వడానికి నేను వెనుకాడడములేదు. కాని నా కంత శక్తి ఎక్కడుంది.'

'నీవే యీలాగంటే ఏలాగమ్మా! నీశక్తి, నీ పలుకుబడి నాకు తెలియనిది కాదు. నీవు చేస్తున్న ధర్మ కార్యాలు దాగేవి కావు. ఇప్పుడిది దైవ కార్యము. కాదనకు రాజేశ్వరమ్మా! వేళయింది. యిక వస్తాను.'

రాజేశ్వరికి మాట్లాడేందుకు వీల్లేకుండా వెళ్ళిపోయాడు బసవయ్య శాస్త్రి.

* * *

రంగనాయకి ఆ వూరు వచ్చినపుడు మట్టిగాజుల చేతులతోనే వచ్చింది. ఆమె దారిద్ర్యం ఆమె అందాన్ని ఏ మాత్రం దాయలేకపోయింది. ఆ వూరిలోని రసికుల నెందర్నో ఆకర్షించింది.

అంతే! సంవత్సరం తిరగకుండానే రంగనాయకి మట్టిగాజుల స్థానే మోచేతి వరకు బంగారు గాజులు ధరించగలిగింది. ఆమె అంతస్తు హస్తిమశకాంతరంగా పెరిగిపోయింది.

శరభయ్య నాయుడికి మున్సిపల్ చెయిర్మెన్ అయిన రోజుల్లోనే భార్యావియోగం కలిగింది.

ఆ వియోగంలో బాధపడుతుండగానే ఒక కౌన్సిలర్ ఆపద్బాంధవుడై ఆదుకున్నాడు. అతని మూలంగానే రంగనాయకితో శరభయ్య నాయుడికి సఖ్యం కుదిరింది.

ఆ నాటినుండి రంగనాయకికి పలుకుబడితోపాటు, ఆస్తికూడ పెరిగిపోయింది.

ఆమె కులం, గోత్రం ఎవరికీ అవసరం కాలేదు. ఆమె మాత్రమే కావాలనుకునే వారు ఎవరికి వారు.

రంగనాయకి వృత్తి ఏదయినా కానీ, దేవుడంటే అమితమైన నమ్మకం, అంతులేని భక్తి.

ప్రతినిత్యం సంధ్యాసమయంలో వేణుగోపాలుని గుడికి వెళ్తుంది. భగవంతుడికి మనసారా నమస్కరిస్తుంది.

పూజారి బసవయ్యశాస్త్రి చేతిలో ప్రసాదం పెడుతూ 'నాయకీ' అంటాడు.

రంగనాయకి కొంటెగా నవ్వుతుంది.

ఆమెకు ఆ గ్రామంలో అందరితోను పరిచయముంది. అలాగే బసవయ్యశాస్త్రి తోను.

ఒకనాడు తెల్లవారకముందే రంగనాయకి యింటికి వచ్చాడు బసవయ్యశాస్త్రి— అతని చేతిలో పసికందు.

'ఈ బిడ్డను నువ్వే కాపాడుకోవాలి.'

'ఎవరి బిడ్డ స్వామీ!'

'ఏమో నాకు మాత్రమేమితెలుసు. ఆ వేణుగోపాలునికే తెలియాలి. ఆలయంలో ఏడుపు వినిపించింది. దగ్గర ఎవరూలేరు. నేను దేవాలయ ప్రాంతమంతా చూశాను.

ఎవరూ కనిపించలేదు. కావాలనే ఎవరో వదిలి పోయారని నిశ్చయించుకొని బిడ్డను యిక్కడకు తీసుకొనివచ్చాను. దీని సంరక్షణ నీకే అప్పగిస్తున్నా.'

తప్పదన్నట్టుగ రంగనాయకి ఆ బిడ్డ సంరక్షణ ఒప్పుకొన్నది.

బసవయ్యశాస్త్రి రహస్యంగా ఆ బిడ్డకు 'రాజేశ్వరి' అని నామకరణం చేశాడు.

రాజేశ్వరికి రంగనాయకే తల్లి అయింది.

* * *

'శేషయ్యా!'

'రాజక్కా!'

'హఠాత్తుగా అనుకోకుండానే పెద్ద బరువు పడింది.' దిగులుపడుతూ అంది రాజేశ్వరి శేషయ్యతో.

'ఏమిటది రాజక్కా! అంతగా దిగులుపడి పోయావు ?'

'దేవాలయ పునరుద్ధరణకు నేను పది వేలు యివ్వాలని శాస్త్రిగారన్నారు.'

'నువ్వు ఒప్పుకున్నావా ?'

'తప్పలేదు. దేవుడే రక్షించాలి.— ఆఁ. పరంధామరెడ్డిగారు అయిదువందలు పంపుతామన్నారు. ఒకసారి వెళ్ళిరా.'

'సరే. రాజక్కా ! మధ్యాహ్నం నీకోసం అనాథశరణాలయంవారు వచ్చారు. వారికి మనమీనెల డబ్బు పంపలేదు.'

'అలాగా...అయితే రెడ్డిగారిదగ్గర డబ్బు తీసుకొని 'శరణాలయం' వారికి యిచ్చిరా!'

రాజేశ్వరి

శేషయ్య వెళ్ళిపోయాడు.

కొంతసేపటికి కొందరు పల్లెవారు ఆడ, మగ వచ్చారు. వారి ముఖాలంతా దుఃఖంతో పీక్కుపోయి వున్నాయి.

'ఏమయ్యా విషయమంతా?' ప్రశాంతంగా అడిగింది రాజేశ్వరి.

పల్లెవాండ్లలో పెద్దవాడయిన నరసయ్య ముందుకొచ్చాడు.


'మాది యీ ప్రక్కపల్లె తల్లీ! మహా దురదృష్టం పల్లెపల్లెంతా కాలిపోయింది. తిండీతిప్పలులేక మలమల మాడిపోతున్నాం తల్లీ! మాకింత సాయంచేయమ్మా!'

రాజేశ్వరికి అందాన్ని మించిన మనస్సుంది. అది వెన్నకంటే మృదువైనది. ఎదుటివారివేడి నిట్టూర్పునుకూడ భరించలేనంతటి కోమలమైనది.

రాజేశ్వరికి పల్లెజనం బాధను చూచి కన్నీళ్ళుతిరిగాయి.

లోపలికివెళ్ళి ముప్పయిరూపాయిలు తీసుకొని నరసయ్యకిచ్చి, 'యివి తీసుకొని యీపూట గడుపుకోండి. మున్సిపల్ చెయిర్మేన్ సుబ్బయ్యనాయుడి వద్దకువెళ్ళి నేను పంపించినానని చెప్పండి. వారు మీకు సహాయం చేస్తారు.' అంది.

పల్లెజనం తమ కృతజ్ఞత వెలిబుచ్చి వెళ్ళిపోయారు.



'రామమ్మా! రామమ్మా!' అని వంట మనిషిని పిలిచింది.

'పిలిచావా రాజమ్మా?' చేతులు తుడుచుకొంటూ వచ్చింది రామమ్మ.

'నాకు ఒంట్లో బాగాలేదు. డాక్టరమ్మను పిలుచుకొని వస్తావా ?' అంది రాజేశ్వరి.

డాక్టరమ్మను పిలుచుకొని రావడానికి వెళ్ళింది రామమ్మ.

* * *

'రాజక్కా! రాజక్కా!' శేషయ్య పిలిచాడు.

రాజేశ్వరి గదిలోనుండి బయటకు వచ్చింది.

'శ్రీరాములు శాస్త్రిగారు వస్తామన్నారు.' అన్నాడు శేషయ్య.

'సరే' సాధారణంగానే అని, 'ప్రసాద్‌కు పరీక్షలయిపోయాయటనా ?' ప్రసాద్ చదువుని గురించి అడిగింది.

'అయిపోయాయి. బాగానే వ్రాశానన్నాడు.'

'దేవాలయం పని జరుగుతోందా?'

'పని పూర్తి కావస్తున్నది. ఏభయి మంది కూలీలు పని చేస్తున్నారు. శాస్త్రిగారిదే అజమాయిషీ అంతా.'

'సాయంకాలం దేవాలయం చూచి రావాలనుకొంటున్నాను. శేషయ్యా!'

'రామమ్మను కూడ వెంట తీసుకెళ్ళు. రాజక్కా!'

అంతలోనే రామమ్మ కాఫీ కప్పులతో ప్రవేశించింది.

'రామమ్మా! మనం సాయంకాలం దేవాలయం వెళ్ళాలి. సిద్ధంగా వుండు.'

రాజేశ్వరి, శేషయ్య కాఫీ త్రాగేశారు.

'సరేనమ్మా !' అని కాఫీ కప్పులతో లోపలికి పోయింది రామమ్మ.

'శేషయ్యా ! యింకా ఎంత డబ్బుంది బ్యాంకులో.' అడిగింది రాజేశ్వరి.

'రెండు వేలకు తక్కువగానే వుంది రాజక్కా !'

'అంతేనా! దేవాలయానికే నాలుగువేలింకా యివ్వాలి.' దిగులు పడిపోయింది రాజేశ్వరి.

'ఉన్నదంతా దాన ధర్మాలకే యిచ్చేస్తుంటే కొండలయినా కరగిపోతాయి.'

'కాని ఏం చేసేది శేషయ్యా! సంఘంలో నేను ఒక జీవిని. నేను సంఘానికి అక్కర


ఒక్కొక్క కణంలో అమితోత్సాహం
ఓవల్‌టీనులో శక్తినిచ్చే మాల్టు అధికంగా ఉంది
ఓవల్‌టీనులో ఉన్నంత మాల్టు ఇతర ఆహారపానీయాలలో దేనిలో కూడా లేదు. ప్రకృతిలో శక్తిపుట్టించే వస్తువులలో మాల్టు సుప్రసిద్ధమైనది. అందుచేత, 1932 సంవత్సరంనుండి, ఓవల్‌టీను ఒలింపిక్ ఆటల అధికారుల సమ్మతం పొందిన ఒకేయొక ఆహారపానీయమంటే అందులో ఆశ్చర్యమేమీ లేదు.
ఓవల్‌టీనులో అదనపు మాల్టు మాత్రమే కాదు; ఇంకా పాలు, విటమినులు, శక్తినిచ్చే యితర పదార్థాలు కూడా చేరియున్నాయి. ఆకారణముచేత, సర్వోత్కృష్టమైన ఓవల్‌టీను పెరిగేపిల్లలకు, కష్టపడి పనిచేసే పెద్దలకు పనికివచ్చే ఆదర్శమైన ఆహారపానీయము.
ప్రతిరోజు ఓవల్‌టీను సేవించండి. ఓవల్‌టీను ఒక్కొక్క కణంలో అమితోత్సాహమిస్తుంది
OVALTINE
The Supreme Food Beverage
A scientifically prepared concentration combining the vitalising and energy giving properties of ripe Barley Malt, pure Creamy Milk together with valuable Natural Phosphatides and Vitamins.
EXTRA VITAMIN FORTIFIED
ఓవల్‌టీను త్రాగండి
ఇండియాలో జగత్‌జిత్ డిస్టిల్లింగ్ అండ్ అల్లైడ్ ఇండస్ట్రీస్ లిమిటెడ్, ఏ. వాండర్ లిమిటెడ్, లండన్ వారి

లేకపోయినా, సంఘం కావాలి. శక్తి వున్నప్పుడే ఒక పని చేయగలము. ఆపనే నలుగురి వుప యోగానికి వెందేలా చేయడములోనే జీవితం సార్థకమవుతుందని మా అమ్మ చెబుతుం డేది. నా ఆశయము అదే. నా కంతకన్న మహోగమ్యం లేదు.'

'తన్నుమాలిన ధర్మం అంత మంచిది కాదు.' శేషయ్య, రాజేశ్వరికి అన్యాయం జరుగుతోందన్న బాధతోనే అన్నాడు.

'నిజమే. కానీ అది అందరిపట్ల సత్యం కాదు. శేషయ్యా! సంఘపు కట్టుబాట్లు వేయివిధాలుగా వుండవచ్చు. కాని స్త్రీ అంద రికీ ఒక్కటే ఆశ, ఆశయముంటుంది. తన కొక తోడు వుండాలి. ఆ నీడలో తాను తల్లిగా వుండాలి. తన సుఖానికి కారకులైన వారి సంతోషానికి తాను త్యాగంచేయాలి. తనకలిగే సంతానం కోసం దాచిపెట్టాలి. ఇంకా ఎన్నెన్నో ఆశ లుంటాయి ఇవన్నీ స్త్రీకి ప్రకృతి ప్రసా దించినవరాలే. నాకూ అటువంటి ఆశ లున్నాయి. నాకు తల్లెవరో, తండ్రెవరో తెలీదు. రంగానాయకమ్మే తల్లిగా నన్ను పెంచి, మధ్యలోనే తన ధర్మాన్ని నిర్వర్తించు కొని వెళ్ళిపోయింది. ఆమె తరువాత నా కొవరు లోమనీడనే సంఘమే. దాని నీడ లోనే కాలం గడుపుతున్నాను. నాన్న నమ్ముకుని వున్నదానను. దాని పురోభివృద్ధి నాకు అవసరమే, కాదంటావా? నా తరు వాత అనుభవించటానికి భర్తా? బిడ్డలా

రాజేశ్వరి

ఎవరున్నారు? శేషయ్యా!' రాజేశ్వరి ఏడవ సాగింది.

'రాజక్కా! నీకావేశం కలిగించాను క్షమించు.' తన బాధను వ్యక్తపరిచాడు శేషయ్య.

'మరేం ఫరవాలేదు. మనస్సు తేలిక పరచుకొన్నాను.'

*　　*　　*

'నీతో ఒక్కవిషయం చెప్పాలి. వీరిని అవతలకు పంపించు.' డాక్టరమ్మ రాజేశ్వరిని పరీక్షించిన తరువాత అంది.

రాజేశ్వరి అక్కడవున్న రామమ్మ, శేషయ్యవైపు చూచింది. వారిద్దరు గది అవతలకు వెళ్ళిపోయారు.

డాక్టరమ్మ రాజేశ్వరితో అంది, 'నీ రక్తం చెడిపోయింది. కొంతకాలం విశ్రాంతి అవసరం.'

ఆ మాటలు వినగానే రాజేశ్వరి ముఖము వాడిపోయింది.

'ఈ మందులు తీసుకొంటూవుండు.' అని చీటీ వ్రాసి యిచ్చివెళ్ళిపోయింది డాక్టరమ్మ.

డాక్టరమ్మవెళ్ళిన తరువాత రామమ్మ, శేషయ్య ఆత్రుతగా గదిలోనికి వచ్చారు.

'రాజక్కా! డాక్టరమ్మ ఏమంది.' శేషయ్య అడిగాడు.

'భయపడవలసినదేమీలేదు. విశ్రాంతి అవ సరం. అందుకు వాతావరణం మార్పుకూడ వుంటే మంచిదని చెప్పింది.' మాటలు ధైర్యంగానే అంటున్నా, ఆమెలోనున్న విషాదం ఆమెకే తెలుసు.

ఆ మాటలకు శేషయ్య రామమ్మకుదుట పడ్డారు.

'రామమ్మా! అలసటగావుంది. కొంతసేపు విశ్రాంతి తీసుకుంటాను.' అని తన గది లోని కెళ్ళిపోయింది.

*　　*　　*

'రాజేశ్వరమ్మా! నువ్వు పిలిచావని శేషయ్య వచ్చి ప్రొద్దున్నే చెప్పాడు.' ఇల్లు ప్రవే శిస్తూ అన్నాడు బసవయ్యశాస్త్రి.

'అవును. శాస్త్రులవారూ! రండి. కూర్చోండి.' ఎదుటనున్న కుర్చీ చూపిం చింది. కూర్చొని, 'విషయమేమిటో చెప్పమ్మా!' అడిగాడు బసవయ్యశాస్త్రి.

'నేను యీవూరు వదలి పోవాలనుకుంటు న్నాను. దేవాలయ పునరుద్ధరణకు నేనింకా బాకీ వున్నాను. నన్ను నమ్మిన రామమ్మ, శేషయ్యలకు కూడ వుపాధి కలిగించవలసిన బాధ్యత కూడ నాకుంది. అందుకని ఒకటి నిర్ణయించుకొన్నాను.' నిశ్చలంగా అయన ముఖంలోనికి చూచింది.

'ఏమిటమ్మా! అది.'

'శాస్త్రులవారు! యీ యింటిని ఎవరి కైనా అమ్మివేయాలని నిశ్చయించుకొన్నాను. మీరే ఎవరితోనైనా మాట్లాడండి.' ప్రార్థనా పూర్వకముగా అంది.

'ఊరు విడచి వెళ్ళవలసిన అగత్యమేమొం దమ్మా?' ఆశ్చర్యపోయాడు శాస్త్రి.

'క్షమించండి శాస్త్రులవారు! మిమ్మల్ని మెప్పించగల జవాబు చెప్పలేను. కానీ ఈ వుప కారం చేయండి. ఆజన్మాంతం కృతజ్ఞురాలి నిగా వుంటాను. విధిలేక 'సరే'యన్నట్లు తలపంకించాడు శాస్త్రి.

'మరల యీ వూరికి రావామ్మా!'

'తప్పకుండా వస్తాను. ఎప్పుడో చెప్ప లేను.' రాజేశ్వరి కన్నులు చెమర్చాయి. బసవయ్యశాస్త్రి వెళ్ళిపోయాడు.

శేషయ్యను పిలిచింది రాజేశ్వరి.

'రాజక్కా! పిలిచావా?' అంటూవచ్చాడు శేషయ్యా.

'అవును. శేషయ్యా! రామమ్మను కూడ ఒక్కమాటుపిలు.'

రామమ్మను పిలుచుకొని వచ్చాడు శేషయ్య.

'నేను త్వరలో యీ వూరు విడిచిపోవా



లను కుంటున్నారు. కారణాలు అడక్కండి.'

'ఏమిటిది రాజక్కా!' పిడుగు పడ్డట్టుగా అదిరిపడ్డాడు శేషయ్య.

'సాధారణ విషయమే. మీకిద్దరికీ ఒక ప్రతుకు తెరువు కలిగించి వెళ్ళాలనే నా కోరిక. మీకిద్దరికీ చెరో వెయ్యిరూపాయిలిస్తాను. మీ జీవన మార్గాలు చూసుకోండి. నేనింతకంటే మరేమీ చెప్పలేను. వెళ్ళండి.' అని ఆయాసంగా సోఫాలో పడుకొంది.

రామమ్మ, శేషయ్యలకు రాజేశ్వరి వైఖరేమీ అర్థం కాలేదు.

* * *

సూర్య, చంద్రులు దోబూచులాడుకొంటూనే ఉంటే అయిదేళ్ళు పెద్దవాళ్ళయిపోయారు.

శేషయ్య పదివేలరూపాయల ఆస్తిపరుడయ్యాడు. వేణుగోపాలస్వామి దేవాలయము ఎదుటనున్న ఫాన్సీషాపుకు యజమాని అయ్యాడు.

బసవయ్యశాస్త్రి తన అర్చకత్వాన్ని కుమారుడు శ్రీ కంఠశాస్త్రికి వొప్పగించి తను విశ్రాంతి తీసుకొంటున్నాడు.

ఏమీ తోచనప్పుడు శాస్త్రి, శేషయ్య కలిసి రాజేశ్వరిని గురించే మాట్లాడుకొంటుంటారు.

ఒకరోజు రాత్రి ప్రొద్దుపోయింది. దేవాలయానికి భక్తులంతావచ్చి వెళ్ళిపోయారు.

బసవయ్యశాస్త్రివద్దకు శ్రీ కంఠశాస్త్రి పరుగు పరుగున వచ్చాడు.

'దేవాలయంలో ఒకావిడ మూలుగుతూ పడివుంది. ఎంతపిలిచినా పలకడంలేదు చూద్దువుగాని రా నాన్నా!' అని తండ్రిని పిలిచాడు.

బసవయ్యశాస్త్రి కుమారునితో వెళ్ళి చూశాడామెను.

పోషణలేక శుష్కించిన శరీరం. తైల సంస్కారహీనమైన జుత్తు. లోపలకు పీక్కుపోయిన కళ్ళు ... అయినా ఆ 'ముక్కు!' శాస్త్రి ఆలోచనలను అయిదేళ్ళ వెనక్కు నెట్టింది ఆ ముక్కు! అతడు కలవరపడి పోయాడు. ఆమె తనకు తెలుసునని ఏవిధంగా చెప్పగలడు తనకొడుకుతో.

'వేణుగోపాలా ! ఎంత పరీక్ష పెట్టావు తండ్రీ!' మనస్సులోనే బాధపడ్డాడు.

'ఇప్పుడేమి చేయాలి నాన్నా!' కొడుకు అడుగుతున్నాడు.

'తెల్లవారేవరకు యిక్కడేవుండనీ. తరువాత ఆలోచిద్దాం.' అనలేక అనగలిగాడు బసవయ్యశాస్త్రి.

'ఈ పాపానికి తాను కారణం కాదుగదా'ని తనని తాను తిట్టుకొన్నాడు. అతని మనస్సు వికలమైపోయింది.

'వేణుగోపాలా! నన్నుకూడా శిక్షించు.' మనస్సులోనే వేడుకొన్నాడు.

దేవాలయపు తలుపులన్నీ మూసి తమ వాటాలోకిపోయి పడుకొన్నారు తండ్రీ కొడుకులు.

తెల్లవారుజామున దేవాలయంలో గలభాగా వుంది. బసవయ్యశాస్త్రికి మెలకువచ్చింది. శ్రీ కంఠశాస్త్రి ఎప్పుడో లేచివెళ్ళాడు.

రాజేశ్వరి మనస్సులో మెదలుతుండగ పరధ్యానంగా పడుకొన్నాడు శాస్త్రి.

'ఎవరో ఆడమనిషి చనిపోయింది'ని కేకలు పెడుతున్నారు. శాస్త్రి గుండెలు పిసికినట్లయింది.

'తనువెళ్ళి రాజేశ్వరిని కడసారిగా చూడా'లని వుంది.

'రాజేశ్వరమ్మా! ఉండైన స్థితిలో చూచిన నిన్ను నికృష్ట స్థితిలో చూడలేకున్నానమ్మా! నీవలనే యీ వేణుగోపాలునికి పునర్జన్మ కలిగింది. ఆకారణంగానే సుజన్మ వెళ్ళిపోయింది. ఇక్కడే పుట్టావు. ఇక్కడే కన్నుమూశావు. ధన్యురాలవమ్మా!! అతని హృదయం పరిపరి విధాల పరితపిస్తోంది.

'వృత్తికి వేశ్యవయినా వున్నతమైన వ్యక్తిత్వం కలదానవమ్మా! లోకులు ఎంతగా నిన్ను గూర్చి అసహ్యించుకొన్నా వారికి ఉపకారం చేశావు. నువ్వు కళ్ళెదుట లేనప్పుడు నీ మంచితనం అర్థమయిందమ్మా. నీనుండి ఉపకారంపొంది నీకు మేమేమి చేయగలిగాం. అపకారం తప్ప. అదే సంఘలక్షణమేమో?' కన్నీరు ఏకధారగా ప్రవహిస్తోంది. అంతలోనే, 'మున్సిపాలిటీబండి లోనికి చేర్చమ'ని అంటున్నట్లుగ వినిపించింది.

'నేనుండికూడ నిన్ను మున్సిపాలిటీ బండికే అప్పగించవలసివచ్చింది. నేను స్వార్థపరుణ్ణి తల్లీ! క్షమించు.' కుమిలి పోతున్నాడు శాస్త్రి. కడసారిగనైన రాజేశ్వరిని చూడాలని మనస్సు ఘోష పెడుతోంది.


బసవయ్యశాస్త్రి లేచివెళ్ళాడు మనోవ్యధ భరించలేక. అతడక్కడికి చేరేసరికి మున్సిపాలిటీబండి బయలుదేరుతోంది. శాస్త్రి మెట్లమీదనే నిలబడిపోయాడు వెళ్తున్న బండివంక చూస్తూ.

'శాస్త్రులవారూ! ఒకసారి యిటురండి' శేషయ్యవచ్చి అవతలకు పిలిచాడు. శాస్త్రి వెళ్ళాడు. 'ఆమె రాజక్కలావుంది. రాజక్క కాదుగదా!' అనుమానంగా అడిగాడు శేషయ్య.

'రాజక్కే — శేషయ్యా!' శాస్త్రికి దుఃఖంతో కంఠం మూసుకుపోయింది. శేషయ్యకు ఏడుపువచ్చింది. అక్కడవుండలేక బండివెళ్ళినవైపు పరుగుతీశాడు.

'నేనూ వస్తున్నా, శేషయ్యా!' కన్నీళ్ళు తుడుచుకుంటూ శాస్త్రికూడ వెనుకనే వెళ్ళాడు.

మున్సిపాలిటీబండి శ్మశానంవైపు సాగింది. ●



డాక్టర్ మహీధరనళినీమోహన్‌రావు

కుజగ్రహంలో తెలివైన జీవాలున్నాయా?

కుజగ్రహంలో కృత్రిమమైన కాలువలు కనిపించాయనీ, అవి తెలివైన జీవుల పని తప్ప మరొకటి అవడానికి వీలులేదనీ లోవెల్ సిద్ధాంతీకరించాడు. ఈ విషయం క్రిందటివ్యాసంలో వివరంగా పరిశీలించాం. ఆ గ్రహంలో మిగిలి ఉన్న కొద్దిపాటి నీటినీ ఒక్క చుక్కకూడా వ్యర్థం కాకుండా వాడుకునే ప్రయత్నంలో ఆజీవులు ఆ కాలువలు తవ్వేయి. కాని ఆ జీవులు త్వరలోనే మూలనాశనం అయిపోకతప్పదు. ఏమంటే ఆ గ్రహంమీద మిగిలిఉన్న ఆ కాస్త నీరు బలహీనమైన కుజగ్రహ ఆకర్షణ శక్తిని విడిపించుకుని త్వరలోనే విశ్వావకాశంలోకి జారిపోకతప్పదు. దానిని ఆపే శక్తి ఎవ్వరికీ లేదు. కొన్ని కోట్ల సంవత్సరాలకు పూర్వం ఆ గ్రహంమీద ఇప్పటికన్న నీరు, గాలి చాలా పుష్కలంగా ఉండేవి. ఆ నల్లని మచ్చలన్నీ ఒకప్పుడు నీటితో నిండిన సముద్రాలే. కాని, ఇప్పుడు నీరు, గాలి అతి స్వల్పంగా మిగిలి ఉన్నాయి. మరికొన్ని వేల సంవత్సరాలలో అవి కూడ పూర్తిగా 'ఎగిరిపోతాయి.' ఇంతటి తెలివైనజీవాలు త్వరలోనే నశించిపోవడం తథ్యం. అటు తరువాత నిర్జీవమైన కుజగ్రహం సూర్యునిచుట్టూ అనంత ప్రదక్షిణాలు చేస్తూ ఉండిపోతుంది. ఈ సంగతి ఆ జీవులు గ్రహించే ఉంటాయి. తమ వినాశనాన్ని సాధ్యమైనంత ఎదరికి జరపడం కోసం పాపం ఆ జీవులుపడే తాపత్రయ ఫలితమే ఆ కాలువలు, ఆ వ్యవసాయం, ఆ మహాప్రయత్నం. ఈ సంగతి తలుచుకుంటే జాలివేస్తుంది. ఆ జీవులు బ్రతికి బయటపడే అవకాశం లేనేలేదా? ఏమైనా! అవి మనకన్న తెలివైనవే అయితే ఆ గ్రహం పూర్తిగా ఎండిపోయేలోగా అంతరిక్షయానం నేర్చుకుని, మరోగ్రహానికి వలసపోవచ్చు. అల్లా వలసపోవడమేచేతనైతే సౌరకుటుంబం అంతలోనూ వాళ్లకు అనువైనచోటు భూమితప్ప మరొకటిలేదు. వెళ్ళే గస్తే వాళ్లు తప్పకుండా మనగ్రహంమీదికే వస్తారు. ఈ పాటికే తమకున్న బహుశక్తివంతమైన టెలిస్కోపులతో సౌరకుటుంబాన్ని మూల మూలలా వెతికేసి, నీరు, ప్రాణవాయువు వృక్షాలు ఉన్న అనువైన గోళం భూగోళమేనని తేల్చుకుని ఉంటారు. కుజగ్రహంమీదనుంచి చూస్తే మన భూమి ఉజ్వలమైన నక్షత్రంలా కనిపిస్తుంది' రంగు నీలంకలిసిన తెలుపు. టెలిస్కోపులో చూస్తే వాతావరణం, మేఘాలూ, సముద్రాలు, ఖండాలు, నల్లగా అడవులు, ధ్రువములదగ్గర తెల్లగా మంచు దిబ్బలు తప్పక కనిపిస్తాయి. అడవుల రంగు ఋతువులతోబాటు మారుతూ స్థానచలనం పొందుతున్నట్లు కనిపిస్తుంది. భూమిమీద చెట్లు చేమలు ఉన్నాయని తెలుస్తుందేకాని, ఇక్కడ జంతువులు, పక్షులు మానవులు అదే 'తెలివైన' జీవులు ఉన్నాయనే సంగతి వాళ్లకు తెలియకపోవచ్చు.

ఈ కుజగ్రహవాసులు కొందరు అప్పుడే మనభూమిమీద వాలినట్లు కథలుకూడా బయలుదేరేయి. కొంతకాలం క్రిందట ప్రపంచం అంతటా వార్తాపత్రికలలో 'ఎగురుడుపళ్లెము' (ఫ్లయింగ్ సాసర్స్) లను గురించిన వార్తలు తరుచు వినిపించేవి. అవి కుజగ్రహవాసుల అంతరిక్ష నౌకలేనవి కొందరికి గట్టి నమ్మకం.

లోవెల్ సిద్ధాంతం నిజానికి చాలా అద్భుతమైనది. కుజగ్రహంలో తిన్నని సన్నని కాలువలు ఉండడం, అవి అప్పుడప్పుడు జంటలుగా మారిపోవడం, మచ్చల నల్లదనం ధ్రువాల దగ్గరనుంచి గ్రహమధ్య రేఖాప్రాంతందాకా పాకిరావడం, రంగులు మారడం మొదలైన విషయాలన్నీ లోవెల్ సిద్ధాంతంతో చక్కగా సద్దుకుపోయాయి. అక్కడ తెలివైనజీవులున్నాయనుకుంటే తప్ప వీటి నన్నింటినీ సమర్థించడం సాధ్యంకాదు. సౌరకుటుంబం అంతటిలోనూ భూమిమీద ఒక్కచోటనే కాక మరొకచోటకూడా — అందులోనూ మనప్రక్క ఇల్లులా ఉన్న కుజగ్రహంమీద-జీవం ఉందన్న విషయం చాలా ఆనందం కలిగిస్తుంది. పైగా అక్కడ మనవంటి లేక మనకన్న తెలివైనజీవులు నివసిస్తున్నాయంటే మరీనూ, అవి అనుక్షణమూ తమ మనుగడకోసం ప్రకృతి శక్తులతో హోరాహోరీ యుద్ధంచేస్తున్నాయంటే ఇకముందు ఏమవుతుందో అని ఆత్రం కలుగుతుంది.

చక్కని కథలాంటి, కలలాంటి లోవెల్ సిద్ధాంతాన్ని ప్రస్తుతం శాస్త్రజ్ఞులెవ్వరూ నమ్మడంలేదు. కుజగ్రహంలో తెలివైన జీవులు ఉన్నాయన్న ఊహకు ఋజువు ఒక్కటే ఒక్క విషయం.— వంకర టింకరలులేని సన్ననిరేఖలు ఆ గ్రహంమీద కనబడడమే! మిగిలినదంతా ఊహే, కాని, ఇబ్బంది ఎక్కడ ఉందంటే షియాపరెల్లీ, లోవెల్లు తమకు కనిపించాయన్న సరళరేఖలు మాకు కనిపించలేదని తరువాతి ఖగోళశాస్త్రజ్ఞులు చాలామంది అన్నారు. అసలు ఆ గీతలు అన్నీ ఊహాకల్పితమని (illusion) కొందరు తోసిపారేశారు. చాలాసేపు తీక్షణంగా చూడడంవల్ల కన్ను నెప్పిపుట్టి, లేనిగీతలు ఉన్నట్లు కనిపించి ఉండవచ్చునన్నారు. మరికొందరు ఆ గ్రహంమీద గీతలు కనిపించినమాట వాస్తవమేగాని, అవి లోవెల్ చెప్పినంత సన్నంగానూ, సరళంగానూ లేవు అన్నారు. కుజగ్రహంలోని కాలువల విషయం అంతా పెద్ద గందరగోళం అయిపోయింది.

లోవెల్ వాడిన టెలిస్కోపుకన్న చాలా శక్తివంతమైనది ఉపయోగించి 'బర్నార్డ్' అనేశాస్త్రజ్ఞుడు కుజగ్రహాన్నిగురించి పరిశోధనలు జరిపేడు. లోవెల్ చెప్పినచోట గీతలు ఉన్నాయికాని, అవి రూళ్ళ కర్రతో గీసినట్లున్న సరళరేఖలు కానేకావు అన్నాడాయన. అవి అయినా అవిచ్ఛిన్నరేఖలు

(Continuous lines) కావన్నీ, అక్కడక్కడ తెగిపోయినట్లున్న చిన్న చిన్న గీతల వరుసలా, పొడైపోయిన కుంచెతో చేతకాని చిత్రకారుడు గీసినట్లుగా ఉంద న్నాడు.


అయితే ఎవరిని నమ్మాలి? చిన్న చిన్న టెలిస్కోపులు వాడిన వారంతా లోవెల్ చెప్పినట్లు సన్నని ఏకరేఖలు కనిపించా యన్నారు. బహుశక్తివంతమైన పెద్ద పెద్ద టెలిస్కోపులకు బర్నార్డ్ చెప్పినట్లు కనబడ సాగింది. ప్రస్తుతం శాస్త్రజ్ఞులు చాలా భాగం బర్నార్డ్ వాదాన్నే సమర్థిస్తున్నారు. లోవెల్ పొరబడ్డాడు అంటున్నారు. ఇటు వంటి పొరబాటు ఎల్లా జరిగింది? - కాగితంమీద 5 మిల్లీమీటర్లు పొడవున్న గీతలుమధ్యని ఒక మిల్లీమీటరు ఖాళీ వదిలేస్తూ గీసి, ఆ కాగితాన్ని గోడకు అతికించి, దానికి 50 అడుగులదూరంలో కొందరు పిల్లలను కూర్చోబెట్టి, ఆ కాగి తంమీద మీకు ఏమి కనిపిస్తే అది గీయమని పరీక్షపెట్టేరు. ఇంచుమించు అందరూ అవిచ్ఛిన్న రేఖలనే గీశారు. మధ్య మధ్య ఖాళీలున్నట్లు వారికి తెలియనేలేదు. సరిగ్గా కనిపించీ కనిపించని స్థితిలో దగ్గర దగ్గరగా చీమల బారులా ఉన్న గీతలను చూచి మన కన్ను దానిని ఏకరేఖగానే భావిస్తుంది. కుజగ్రహపు కాలువల విష యంలోనూ ఇదే జరిగి ఉంటుంది.

అంత పలుచని వాతావరణంలో పెద్ద జంతువులేవీ బ్రతుకలేవనీ, నీరు బహుస్వ ల్పంగా ఉన్నకారణంచేత పెద్ద పెద్ద చెట్లు కూడా అక్కడ ఉండడం సాధ్యంకాదనీ శాస్త్రజ్ఞులు అభిప్రాయ పడుతున్నారు. అక్కడ ఉన్నవి బూజు, పాకుడువంటి అల్పవృక్ష జాతి జీవులు కావచ్చు. తక్కువ వేడిలో, చలిలో బ్రతుకగలిగినవి అటువంటివే. ఒయాసిస్సులలాగ నల్లగా కనిపించిన మచ్చ లలో కొన్ని 'చంద్రుడిమార్కు' గోతులు అయి ఉండవచ్చు. రెండు దగ్గర దగ్గర గోతులమధ్య నేల పగిలి, నెరియలుపడి ఉండవచ్చు. ఆ నెరియలచుట్టూ మొలి చిన చిన్న చిన్న మొక్కలే మనకు గీత లుగా కనబడుతూ ఉండవచ్చు.

ఈ కుజగ్రహ పరిశోధనల నిమిత్తం అమెరికన్ శాస్త్రజ్ఞులు మారినర్ -4 అనే అంతరిక్ష నౌకను (28-11-1964వ తేదీని) పంపించారు. అది 325 రోజులు ప్రయాణంచేసి 14-7-1965వ తేదీని కుజగ్రహానికి 6118 మైళ్ళదూరా నిక చేరి అక్కడినుంచి ఆ గ్రహానికి ఫొటోలుతీసి భూమిమీదికి టెలివిజన్ ద్వారా పంపించింది. కుజగ్రహోపరి తలంలో 1% ప్రదేశానికి మాత్రమే ఫొటో తీయగలిగింది. ఈ చిన్నభాగంలోనే 4 మైళ్ళ నుంచి 120 మైళ్ళవరకూ వ్యాసమున్న 70 గోతులు కనిపించాయి. దీనినిబట్టి మొత్తం గ్రహంమీద అనేక వేల గోతు లున్నట్లు కనబడుతోంది. ఆ ప్రదేశంలో నీటి సముద్రాలు, నదీ ప్రవాహాలు, చిన్న సరస్సులు, కాలువలు, లోయలు, నీటి మేఘాలు, నదులు కోసేసిన నేలలు, పర్వత పంక్తులు, ఖండములవంటి ప్రదేశాలూ ఏవీ కనబడలేదు. ఈ గ్రహానికి మన భూమికి ఉన్నట్లుగా అయస్కాంత క్షేత్రము లేదు. వాన్-ఎలెన్ బెల్టువంటి విద్యు త్ప్రాణవలయాలు లేవు. భూమిలోపలి భాగంలో ఇనుమువంటి ఖనిజాలు ద్రవ రూపంలో ఉండి భ్రమిస్తూ ఉండడంచేత భూమికి అయస్కాంతధర్మం కలిగిందని శాస్త్రజ్ఞుల ఊహ. ఇదే నిజమైతే కుజ గ్రహం లోపలిభాగం ద్రవరూపంలో కాక ఘనపదార్థంగానే ఉండి ఉండాలి. లోపల ద్రవపదార్థం లేకపోతే అక్కడ అగ్నిపర్వ తాలు ఉండే అవకాశంలేదు. ఈ పరిస్థితు లన్నింటిలోనూ కుజగ్రహం భూమినికన్న చంద్రుణ్ణీ, బుధుడిని ఎక్కువగా పోలి ఉంది.

ఈ గ్రహంమీద జీవం ఉందా అన్న ప్రశ్నకు ఈ మారినర్-4 ఇదమిత్థమైన సమాధానం ఇవ్వలేదు. ఎందుకంటే, ఈ గ్రహంమీద రెండు చదరపుమైళ్ళ స్థలాన్ని విశదంగా చూపించే ఫొటోలు తీస్తే తప్ప అక్కడ జీవులున్నదీ లేనిదీ తెలియదు. ఈ అంతరిక్ష నౌక కుజగ్రహా నికి అంత సమీపంలోకి వెళ్ళలేకపోయింది.

1970 లో అమెరికను శాస్త్రజ్ఞులు 'వాయేజ్' అనే అంతరిక్ష నౌకను కుజ గ్రహోపరితలంమీద దిగేటట్లు పంపి స్తారని తెలుస్తోంది. అంతవరకూ అక్కడి పరిస్థితులను గురించి ఊహాగానాలు చెయ్యడం తప్ప మరోమార్గం లేదు. ●



పథవిహీన

అత్తిలి వెంకటరత్నం

రైలు ఒక్క కుదుపుతో ఆగింది.

ఒక క్షణం కంపార్ట్‌మెంట్ అటూ యిటూ ఉయ్యాలూగి నిలిచిపోయింది కీచుమని శబ్దం చేసుకుంటూ. యింజన్ హెచ్చరికగా రెండుసార్లు కూసి విసుగెత్తి ఊరుకుంది.

చలపతి చదువుతున్న పేపరు మడిచి కిటికీలో నుంచి బయటకు చూసాడు. చూట్టూ పచ్చని పైరులు కనులకి ఆహ్లాదం కలిగిస్తున్నాయి. సూర్యుడు సరిగా పశ్చిమ కనుమల వెనుకకి జారిపోతున్నాడు ఎర్రబారిపోయి. ఆకాశం ఒక మహోన్నత చిత్రకారుడి ఊహా కల్పనలాగ వింత వింత రంగులు సంతరించుకుంటోంది.

చలపతి దృష్టి కంపార్ట్‌మెంటు లోపలికి మళ్లించాడు. అందరి ముఖాలలోను విసుగు చోటు చేసుకుంది. గమ్యం ఎప్పుడు చేరతామా అనే ఆత్రుత అందరి కనులలోను వ్యక్తం అవుతోంది.

అతని కనులు అకస్మాత్తుగా ఒకచోట నిలిచి పోయాయి.

'ఆమె నెప్పుడో చూసాను.' చలపతి మనసులో అనుకున్నాడు. 'ఎక్కడ? ఎప్పుడు?' మనసు ఊరికే గతం అంతా తడుముకుంటోంది. ఆమె కూడా ఒకసారి చలపతి వంక చూసి అతనూ సరిగా అప్పుడే చూస్తూ ఉండటం గమనించి చూపులు మరల్చుకుంది.

చలపతి సిగ్గుపడ్డాడు ఆమె యేమయినా అనుకుందేమోనని అంత తీక్షణంగా చూస్తూ ఉన్నందుకు. చేతిలో పేపరు తీసి చదువుతున్నట్లుగా ముఖానికి అడ్డుగా పెట్టుకున్నా— పేపరు పై అంచు మీదనుంచి ఆమె ముఖం స్పష్టంగా కనిపిస్తోంది.

చలపతి తనను చూడటంలేదని నిశ్చయించుకున్న తరువాత రెండు మూడు సార్లు ఆమె కనులు అతని వైపు చూసాయి. చలపతి గమనించాడు. 'తనకి తప్పకుండా తెలిసిన వ్యక్తే అయివుండాలి. అనుమానం లేదు. ఎవరామె?' గాలికి చెవుల ముందు రేగిన జుట్టు వెనక్కి త్రోసుకుందామె చేతులతో.

'సత్యవతి!' చలపతి పెదవులు అస్పష్టంగా మెదిలాయి.

'సందేహం లేదు. ఆమే! సుమారు యిరవయి సంవత్సరాల తరువాత మళ్ళా యీనాడు!' చలపతి యీసారి ధైర్యంగా ఆమె ముఖంలోకి చూసారు.

ఆమె సీటుమీద వెనక్కి వ్రాలి కూర్చుంది. కూడా ఎవరూ ఉన్నట్లు లేరు. సామాను కూడా ఏమీ ఉన్నట్లు తోచదు ఒడిలో ఒక సంచీతప్ప. ఆమె కనులలో ఏదో నిర్లిప్తత, నిర్లక్ష్యం దోబూచు లాడుతున్నాయి.

'ఏమని పలుకరించాలి? వివాహమయిందా మళ్లీ? జీవితంలో స్థిరపడగలిగిందా? ఏమో?' ఆమె గతం అంతా గుర్తుకివచ్చి చలపతి మనసులో ఒకేసారి అనేక సందేహాలు కలిగాయి. జీవితంలో మోసపోయింది. విధివంచిత!

'టికెట్ ప్లీజ్!' చలపతి ఆలోచనలకి మధ్యలో అంతరాయం కలిగింది. జేబులు తడుముకుని బయట కుతీసి చూపించాడు.

టికెట్ ఎగ్జామినర్ ముందుకి నడిచి ఆమె నడిగాడు.

ఒకక్షణం ఆమె చలపతివైపు చూసింది.

'లేదు. పోయింది.' ఆమె జవాబు విని చలపతి ఆశ్చర్యపోయాడు.

టికెట్ ఎగ్జామినర్ అనుమానంగా చూసాడు. 'డబ్బు కట్టవలసి ఉంటుంది.'

'నా దగ్గరలేదు.' ఆమె మళ్లీ చలపతి వంకచూసింది అంటూ.

కంపార్ట్‌మెంట్‌లో అందరిదృష్టిని ఆకర్షించింది విషయం. కొందరు సంభాషణ ఆపి ఆసక్తి చూపించారు.

'ఎక్సెస్ ఎంతవుతుందో చెప్పండి. నేను కడతాను.' చలపతి ముందుకివంగి అన్నాడు. టికెట్ ఎగ్జామినర్ ఆశ్చర్యంగా చూసాడు.

ఆమె పెదవులుసాగి చిన్నగా నవ్వాయి గుర్తుపట్టామంటూ. చలపతికూడా అప్రయత్నంగా నవ్వాడు.

ఇచ్చిన డబ్బుకి రసీదు చలపతి చేతిలో పెట్టి సాగిపోయాడు ఎగ్జామినరు.

'నువ్విపెట్టెలో ఎక్కినప్పుడే గుర్తుపట్టాను నేను.' ఆమె, సత్యవతి నవ్వుతూ అంది. ఆ నవ్వులో జీవంలేదనిపించింది చలపతికి.

'ఎక్కడినుంచి వస్తున్నావు?' చలపతి మామూలుగా అడిగినట్లుగా ఎంతో ప్రయత్నిస్తూ అన్నాడు.

'ఇప్పుడు ఆ మనిషికి చెప్పానుగా. అయినా ఆ రసీదుమీదే ఉంటుంది చూడు.' ఆమె అంది.

'నిజమే. ఇంతా అయినా ఆ సంగతి పట్టించుకోలేదు నేను.' చలపతి నవ్వుతూ అన్నాడు.

'చిన్నప్పుడు క్లాసులో పాఠాలు కూడా అలాగే వినేవాడివి.'

'అందుకే చివరకి యిలా అయ్యాను' చలపతి అన్నాడు.

సత్యవతి మళ్లీ ఏదో అడిగింది. చలపతికి వినపడలేదు. రైలు ప్లాట్‌ఫారం మీదకువచ్చి ఆగింది. చలపతి బయటకి చూసి కంగారుగా లేచాడు.

'ఎప్పుడయినా యీ ఊరులో దిగు యిటువైపువస్తే. ఇక్కడే ఉద్యోగం. హెడ్మాష్టరు యిల్లెక్కడ? అంటే ఎవరయినా చూపిస్తారు.' చలపతి క్రిందకి దిగబోతూ అన్నాడు.

'ఇప్పుడు రమ్మని అనడానికి ధైర్యం సరిపోయిందేమిటి?' ఆమె కనులు నవ్వాయి.

చలపతి ఒకక్షణం ఆశ్చర్యపోయాడు. 'దిగుమరి! ట్రైను కదులుతుంది.' మనస్ఫూర్తిగా నవ్వుతూ అన్నాడు.

సత్యవతి చిన్న సంచితో రైలుదిగింది.

ఉద్దరూ బయటకు నడుస్తూ ఉండగా అంది 'ఏదో మాటవరసకి అంటే యిలా చేసిందని ఆశ్చర్యపోతున్నావా? చలపతీ!'

'నీమాట కొంతమాత్రం మారలేదు సత్యా!' ఒకక్షణం తొట్రుపాటుపడి 'సత్యవతీ!' అని పూర్తిచేసాడు చలపతి.

'చిన్నప్పటిలాగే పిలు. అప్పటికన్న పతనానికి దిగజారాను కాని గౌరవమేమీ పెరుగలేదులే.' సత్యవతి అంది.

బయట బాగా చీకటిపడిపోయింది. మబ్బులు ఆకాశాన్ని ఆవరించాయి. చిన్న చిన్న చినుకులు అక్కడా అక్కడా పడుతున్నాయి.

చలపతి ఎద్దుబండి మాట్లాడి సత్యవతిని ఎక్కించి తను రెండడుగులు వెనుకగా నడిచాడు.

'నీ రైలు టికెట్ యిదిగో.' సత్యవతి చీకట్లో ఏదో విసిరేసింది.

'అదేమిటి?' చలపతి ఆశ్చర్యపోయాడు.

'పోలేదు. అబద్ధమాడాను నువ్వు నన్ను గుర్తుపడ్తావో లేదో చూద్దామని ఒకవేళ గుర్తించినా ఎరుగనట్లు నటిస్తావేమోనని పందెం నివృత్తికోసం. నువ్వే గెలిచావు.' విషాదంతో మిళితమయిన సత్యవతి నవ్వు బండి రొదలో కలిసిపోయింది.

'సామర్లకోట ఎందుకు?' చలపతి రెండునిముషాలు ఆగి అడిగాడు.

'ఎందుకంటే నాకే తెలియదు. అయినా ఎక్కడో అక్కడ బ్రతకాలి కదా!'

'అంటే అక్కడ ఎవరూ లేరా?'

'ఉన్నాడు. యీక్షణం నువ్వొక్కడివి యీమాత్రపు ఆప్యాయత నీ మనసులో నింపుకుని ఉన్నావు చలపతీ! మరెవ్వరూ లేరు. కాదు! నేనే మిగుల్చుకోలేకపోయాను.' ఆమె కంఠం విచారపుబరువుతో వణికింది.

చలపతి మాట్లాడలేకపోయాడు.

'వర్షం పెద్దదయింది. తడుస్తున్నావు. బండెక్కు.' సత్యవతి లోపలకి జరిగి కూర్చుంటూ అంది.


చలపతి చివరగా ఎక్కి సర్దుకుని కూర్చున్నాడు. చుట్టూ కటికచీకటి. బండికి కట్టిన గుడ్డిదీపం బ్రతుకలేని పేదవాడి జీవితంలా వెలుగుతోంది. బండి చక్రాల చప్పుడు మినహా అంతా నిశ్శబ్దంగా ఉంది.

'తరువాత ఏం జరిగింది? సత్యా!' చలపతి సందేహించి చివరకి అడిగేసాడు.

ఆమె వెంటనే మాట్లాడక పోయేసరికి అన్నాడు. 'నీకు బాధ కలిగేటట్లయితే వద్దు. నేను నిన్నేమీ అడగను.'

'లేదు చలపతీ! జరగడానికేముంది? నాకు తగిన శిక్ష లభించింది. సిగ్గు విడిచి మళ్ళీ యింటికి చేరాను. నాన్న చనిపోయారు అప్పటికే నా మీద బెంగతో. అమ్మ నా ముఖం కూడా చూడనంది. అన్నయ్య...' సత్యవతి కంఠం జీరవోయి వాక్యం పూర్తి చేయలేక పోయింది.

'వద్దులే సత్యా! యింకేమీ చెప్పనవసరం లేదు. నేనర్థం చేసికోగలను.' చలపతి బాధగా అన్నాడు.



పథవిహీన

'తరువాత ఎక్కడెక్కడో తిరిగాను నా ప్రాణం తీసుకునే ధైర్యంలేక. నీకు తెలిసి నదేగా నా చదువు కూడా అక్కడే ఆగి పోయింది. అన్నిరకాల వృత్తులు స్వీకరించాను. ఎప్పటికేది అవసరమయితే అది. కాని ఒకటే మాత్రం నిజం చలపతి! చెడిన ఆడదాన్ని యీ సంఘం తనలో చేర్చుకో లేదు...ఏకాకిగా జీవించనీయదు. నిలువనీడ లేకుండా విదిలించ బడ్డాను. ఒక్కటే ఆశ! మృత్యువు ఎంత త్వరలో తనలో చేర్చు కుంటుందా అని ఎదురు చూస్తున్నాను.' దీర్ఘంగా శ్వాసపీల్చి సత్యవతి ఆగింది.

చలపతికేమీ మాట్లాడటానికి తోచక ఊరుకున్నాడు. హృదయం జాలితో నిండి పోయింది.

బండి మలుపు తిరిగింది. దూరంగా ఊళ్లో లైట్లు వెలుగుతూ ఆరిపోతూ కనిపిస్తున్నాయి.

'చలపతీ! కనిపెంచిన కూతురు చనిపోతే యేడవని తల్లెక్కడయినా ఉంటుందా చెప్పు. నేనూ ఉన్నాను చూడు అది అమ్మా అమ్మా! అని చచ్చిపోతే నాకు యేడుపు రాలేదు చలపతీ! మనసులో యింకా సంతోషించాను. నా యీ పాప ఫలం త్వరగా వదలి పోయిందని.' ఆమె చెక్కిళ్ల మీదుగా జారిన కన్నీరు చీకట్లో మెరిసింది.

చలపతికి ఆమె కన్నీరు తుడిచి ఓదార్చాలని అనిపించింది ఆ క్షణంలో. కాని లేనమర్చుడు.. తను చేయలేడు.' దీర్ఘంగా నిట్టూర్చి ఊరుకున్నాడు.

బండి చక్రం ఒకవైపు గుంటలో దొర్లి పైకి లేచింది.

'ఎంతమంది పిల్లలు చలపతి?' ఆమె అడిగింది.

"ముగ్గురు. పెద్దవాడు యీ సంవత్సరం స్కూలుఫైనలు పరీక్ష వ్రాస్తాడు. రెండవది ఆడపిల్ల. మూడవవాడికి పదేళ్లు యిప్పుడు.'

'అదృష్టవంతుడివి.' ఆమె పెదవులు కంపించాయి.

అయిదు నిముషాలు గడిచిపోయాయి మౌనంగా. బండి మట్టిరోడ్డు వదలి కంకర రోడ్డు ప్రవేశించింది ఊళ్లోకి వస్తున్న సూచనగా.

'నీ భార్య కిప్పుడు నేనెవరినని చెప్తావు చలపతీ!'

'చెప్పడానికి భయపడవలసింది, సందేహపడవలసింది ఏముంది అంతగా.' చలపతి అన్నాడు కాని మనసులో కొంచెం సందేహించాడు...అతను ఆలోచనలో తేరుకునే లోగానే బండి పెద్ద పెంకుటింటి ముందు నిలచింది.

చలపతి వెనుకగా ఆమె బండి కమ్మి పట్టుకుని దిగింది.

'అమ్మా! నాన్న వచ్చారు.' వీధిలోకి వచ్చి తొంగిచూసిన పదేళ్లకుర్రాడు. యింట్లోకి అరిచాడు.

'మా ఆఖరివాడు. మా నాన్న పేరు పెట్టాను.'

సత్యవతి మాట్లాడకుండా కొంగు భుజాలచుట్టూ కప్పుకుంది.

'చీకటి! ఎంత ప్రయత్నించినా యింకా యీ ఊరికి ఎలక్ట్రిసిటీమాత్రం రాలేదు. యిక్కడ మెట్టుంది. జాగ్రత్తగా నడు.' చలపతి అంటూ వీధిగుమ్మంలో లాంతరు వత్తి పెద్దది చేసాడు.

ఇంతలో చలపతి భార్య గుమ్మంలోకి వచ్చింది.

'సీతా! మనింటికి బంధువుల్ని తీసుకు వచ్చాను.' చలపతి ఎంతో సహజంగా అన డానికి ప్రయత్నించాడు.

'ఎటువంటి బంధుత్వమో అడగండి చెప్తాడు.' సత్యవతి అంది.

చలపతి ఆశ్చర్యపోయాడు ఒక క్షణం. లాంతరువెలుగులో ఆమె కనులలో మెదిలింది హాస్యమా? లేక సీరియస్‌గానే అందో చూడటానికి ప్రయత్నించి విఫలుడయ్యాడు.

'లోపలికి రండి.' చలపతిభార్య నవ్వుతూ అంది.

చలపతి దారితీసాడు.

సత్యవతి గది అంతా కలయజూసింది.

'కూర్చో,' చలపతి అన్నాడు.

చలపతి భార్య సీత గుమ్మంనానుకుని నిలబడింది. చలపతి ఆఖరివాడు ఆమె వెనుకనుంచి క్రొత్తబంధువుని చూస్తున్నాడు. చలపతి సంచీలోనుంచి మాసిన బట్టలు బయటకి పడేస్తున్నాడు. 'అంతా గంభీరంగా క్రొత్తగా మారిపోయింది సత్యవతి రాకతో' చలపతి అనుకున్నాడు.

సరిగ్గా రెండు నిముషాలు మౌనం ఆక్రమించింది. సత్యవతి అలాగే బల్లమీద ఒక చేయిఉంచి నిలబడింది. ఈ నిశ్శబ్దాన్ని ఏవిధంగా భంగపరచాలో తెలియక తికమక పడ్డాడు చలపతి.

'మీరు స్నానం చేస్తారా?' సీత చివరకి సత్యవతి నడిగింది.

'ఊహుఁ!' ఆమె తల అడ్డంగా ఊపింది.

'మరి మీరు?' సీత భర్తవంక ప్రశ్నార్థకంగా చూసింది.

'చెయ్యాలి. నీళ్లు కాగిఉన్నాయా?' తడుముకుంటున్నట్లు అన్నాడు.

'ఊఁ' సీత లోనికి వెళ్లిపోయింది.

చలపతి తనపని యేదో చేసుకుంటూ మధ్యమధ్య ఆగి సత్యవతివంక చూస్తున్నాడు. ఆమె కంటినుండి ఒకేఒక బిందువు జారి బల్లమీద పడింది. ఆమె వ్రేలితో అటూ ఇటూ రాసుతోంది ఆ తడిని.

'సత్యా!' చలపతి మెల్లిగా పిలిచాడు.

'క్షమించు, ఈ వాతావరణంలో నేనుండ లేను. నన్ను పంపించివెయ్యి ఎలాగయినా యిక్కడినుంచి. నేను పొరపాటుచేసాను.' ఆమె స్వరం వణికింది.

చలపతికి ఆమె మనసులో బాధ సులువుగా అర్థమయింది.

'ఛ! అదేమిటి! కళ్లు తుడుచుకో ముందు. ఎవరయినా వస్తారు.' చలపతి అనునయంగా అన్నాడు.

ఆమె కనులు ఒత్తుకుంది.

'సీతా!' సత్యవతికి మళ్లీ మాట్లాడటానికి అవకాశం యివ్వకుండా పిలిచాడు.

'రాజా లోపల చదువుకుంటున్నాడా? ఒకసారిలా పిలు.' చలపతి భార్యతో అన్నాడు.

'కళ్యాణి కనపడదేం?' చలపతి ప్రశ్నకు సీత ఆగింది వెళ్లబోయినదల్లా

'పడుకుంది.'

'అప్పుడే!'


'ఊఁ. పడయింది.' సీత వెళ్లిపోయింది.

రెండునిముషాల తరువాత చలపతి పెద్దకొడుకు వచ్చి గుమ్మంలో నిల్చున్నాడు లోనికి రావడానికి సందేహిస్తూ.

'రాజా! నీ చదువుకునే గది ఖాళీ చెయ్యి. నువ్వు నాగదిలోకి వెళ్లి చదువుకో.' చలపతి కొడుకుతో అన్నాడు.

'వసారాలో మంచం ఒకటి అక్కడ వెయ్యి,' మళ్లా పిలిచి చెప్పాడు.

'ఆగది విడిగాఉంది వెనుకవైపు. వీధి



వాటర్‌బరీస్ కాంపౌండ్

ఉపశమనముతో సహా రోగనిరోధక శక్తిని కలిగిస్తుంది!

ఎఱ్ఱ లేబిలు



దగ్గు, జలుబులతో నీర్సముగా ఉండి రోగనిరోధక శక్తిని కోల్పోతారు. అటువంటప్పుడు మీకు యితర వ్యాధులు సోకే అవకాశముంది.

వాటర్‌బరీస్ కాంపౌండులో గల ఓషధులు ఆకలిని వృద్ధి చేస్తాయి, కోల్పోయిన శక్తిని తిరిగి చేకూరుస్తాయి, ఇతర వ్యాధులు కలగకుండా రోగనిరోధక శక్తిని యిస్తాయి. దీనిలో చేర్చబడిన 'క్రియొసోట్' మరియు 'గయొకోల్' దగ్గు, జలుబుల నుండి ఉపశమనమును కలిగిస్తాయి.

బలము మరియు ఆరోగ్యమునకు
వాటర్‌బరీస్ కాంపౌండ్ త్రాగండి!

వార్నర్-హిందూస్థాన్ లిమిటెడ్

లోక్కి గుమ్మంలకూడా ఉంది. నువ్వు మామధ్య తిరగక్కరలేదు. సరేనా?' చలపతి కొడుకు వెళ్ళిపోయాక అన్నాడు.

'చలపతీ!' ఆమె ఏదో చెప్పబోయింది.

'సత్యా! నాకేంకేం చెప్పకు. నేను చెప్పినట్లు విను ముందు' చలపతి అన్నాడు—సత్యవతి నీరు నిండిన కనులతో చలపతి వంక చూస్తూ ఉండిపోయింది. అలాగ ఎంత కాలం గడిచిందో వారికి తెలియదు.

'నాన్నా! అమ్మ స్నానానికి నీళ్ళు పెట్టానని చెప్పమంది. ఆగది ఖాళీ చేసాను.' రాజు మాటలకి చలపతి బాహ్యప్రపంచంలోకి వచ్చాడు.

'నీకు గది చూపిస్తాను. రా!' చలపతి సత్యవతితో అన్నాడు.

ఆమె అతనివెనుక నడిచింది.

నీకు భోజనంకూడా యిక్కడికే పంపించనా?' చలపతి లాంతరు ఎత్తుగా కిటికీలో ఉంచి అడిగాడు.

'వద్దు, వద్దు, బాగుండదు,' సత్యవతి కంగారుగా అంది.

'లేకపోతే ఎవరెవరు నిన్ను చూస్తున్నారో, ఏమని ఆలోచిస్తున్నారో అనే ధ్యాసలో భోజనం కూడా మరచిపోతావు.' చలపతి నవ్వాడు.

సత్యవతి మాట్లాడలేదు.

'నేను స్నానంచేసి వస్తాను,' చలపతి బయటకు వచ్చేసాడు.

'మీయిద్దరికీ భోజనం వడ్డించాను.' సీత స్నానంచేసి లోపలికి వస్తున్న భర్తతో అంది. 'ఆవిడని పిలవనా?'

'ఊహూ. నేను తరువాత తింటాడు. ఆవిడకి భోజనం పడమటి గదికి తీసుకువెళ్ళు. లేదులే. యిలాగియ్యి నేనే తీసుకుని వెళ్తాను.' చలపతి అన్నాడు.

'అదేమిటి?' సీత ఆశ్చర్యంగా అడిగింది.

'మన కులస్థురాలే' చలపతి తువాలుతో కందెం తడిపి తుడిచాడు.

'మరి!' సీత సంశయంగా ఆగిపోయింది.

చలపతి మౌనంగా వంటయింట్లోకి నడిచాడు.

'అహాహా! క్రింద ఉంచు.' కంచం స్టూలు మీద ఉంచబోతున్న చలపతిని వారిస్తూ అంది సత్యవతి.

'నువ్వేమిటి చేస్తున్నావు?' చలపతి అడిగాడు.

పథవిహీన

'నాకివన్నీ అలవాటులేవు.' మంచం మీదున్న ప్రక్క బట్టలు మడతలు పెట్టి బల్లమీద వేస్తూ అంది.

'అదేమిటి? పోనీ తలగడ ఉంచుకో.'

'వద్దు. తల క్రిందకి నా సంచీ చాలు.'

'నీ యిష్టం.' ఆ విషయంలో యింక బలవంతం చేయడం యిష్టంలేక అన్నాడు చలపతి.

'అన్నట్లు నీకు చెప్పడం మరచిపోయాను. రామ్మూర్తి యిహా ఊళ్ళోనే ఉన్నాడు.' చలపతి బల్లమీద కూర్చుంటూ అన్నాడు.

'ఎవరు?'

'గుర్తులేదా? చిన్నప్పుడు సన్నగా, పీలగా ఉండేవాడు. గుడిప్రక్కన ఉండేవారు ప్లీడరుగారు—వాళ్ళబ్బాయి,' చలపతి ఉత్సాహంగా అన్నాడు.

'ఊఁ'

'రేపు తీసుకువస్తానుండు. చూద్దువుగాని. బాగా మారిపోయాడులే.'

'వద్దు చలపతీ! అందరూ నీలాగే ఉండరు.' సత్యవతి అంది.

చలపతి మాట్లాడక ఊరుకున్నాడు.

'నువ్విలా గుడ్లప్పగించి చూస్తూ ఎదురుగా కూర్చుంటే నేను అసలు భోజనం చేయను.' సత్యవతి అంది యిబ్బందిగా.

'సరే అయితే. నేను కూడా యిహాలోగా భోజనం చేసి వస్తాను.' చలపతి నవ్వి లేచాడు.

'మళ్ళీ రానక్కరలేదు. ప్రొద్దుపోయింది కాని, వెళ్ళి పడుకో. చీటికీ మాటికీ చూస్తూ ఉండక్కరలేదు. నేనేమీ పారిపోనులే.' సత్యవతి అంది నవ్వడానికి ప్రయత్నిస్తూ.

ఆ రాత్రి త్వరగా నిద్రపట్టలేదు. చలపతికి. మళ్ళీ చిన్నతనం అంతా గుర్తుకి వస్తోంది. ముందు పధిబడి. తరువాత మూడుమైళ్ళ దూరంలోని హైస్కూలు. ఏకూ చింతా లేకుండా తిరిగే ఆనాటి సత్యవతి యిలాగ మారిపోయిందంటే అంతా ఆమె దోషమేనా? అంత తెలివిగా ఉండే సత్యవతి ఎలాగ మోసపోయింది? తన హైస్కూలులో ఆఖరి రోజులు గడిపేటప్పుడు యింకా గుర్తుంది. తన చేత ఎవరితోనూ చెప్పనని వాగ్దానాలు, ఒట్లు వేయించుకుని, ఆ కాలేజీలో చదివే అబ్బాయికి ఉత్తరం యిచ్చి రమ్మంది.

చలపతి ఆ అబ్బాయి ముఖం గుర్తు తెచ్చుకోడానికి ప్రయత్నించాడు. ఊహూ! లాభం లేదు. ఉంగరాలజుట్టు. అంతే గుర్తుంది.

తను నీతులు చెప్పబోతే ఎదిరించి పోరేసింది. 'పాపం! బుచ్చీ! బుద్ధిమంతుడిలాగ వెళ్ళి పాఠాలు చదువుకో కలకండ బుగ్గనెట్టుకుని' అంటూ.

చలపతికి ఆమాటలు జ్ఞాపకంవచ్చి చిన్న చిరునవ్వు వచ్చింది.

ప్రక్కకి తిరిగాడు నిద్రరాక...ప్రక్క మంచంమీద సీతలేచిన చప్పుడయింది మంచినీళ్ళకి.

'యింకా నిద్రపోలేదా? సీతా!' చలపతి అడిగాడు.

'ఊహూ. ఎవరండీ ఆవిడ?'

'నీకు తెలియదులే.' చలపతి ప్రక్కకి తిరిగి పడుకున్నాడు.

సూనె అయిపోయి కొడిగట్టి దీపం ఆరిపోయాక చలపతి నిద్రపోయాడు అర్ధ్రాత్రి.

* * *

'ఎన్నాళ్ళిలా యిక్కడ నేను?' మూడు రోజుల తరువాత సత్యవతి చలపతిని అడిగింది.

'ఏం? అప్పుడే మొహమ్మొత్తిందా, నా ఆతిధ్యం?'

'ఆతిధ్యం కాదు. లాశీవాసం అను.'

'అంటే'

'లేకపోతే యేమిటి చలపతీ! నేనిక్కడ యేపనీ ముట్టుకోకుండా వేళకి మాత్రం తెచ్చిపెట్టిన విందులారగిస్తూ'

'పోనీ మాయింట్లో అంట్లు తోమకూడదా?' చలపతి హాస్యంగా అన్నాడు.

'ఏం అటువంటివి నేనెన్నడూ చేయలేదను కుంటున్నావేమో! అంతకంటె హీనమయినవే చేసాను.'

చలపతి తనమాట అని ఉండకూడదనుకుని బాధపడ్డాడు.

కొంచెంసేపు మౌనంగా ఉండిపోయారు. ఎంత హాస్యంతో కప్పిపుచ్చినా అసలు సమస్య ఉండనే ఉంది.

'ఏం చేద్దామంటావు? నువ్వే చెప్పు.' చలపతి అడిగాడు.

'ముందు నన్ను యింట్లోనుంచి వెళ్ళగొట్టు.'

'ఎక్కడికి వెళ్తావు?'

'సిటీల్లోకి.' సత్యవతి కోపంగా అంది.

'మా ఊళ్ళోలేదు.' చలపతి తేలికగా నవ్వాడు.

మళ్ళీ యిద్దరూ గంభీరంగా మారిపోయి ఊరుకున్నారు.

'పోనీ. ఒకటి చెప్తాను చేస్తావా?' చలపతి చివరకి అన్నాడు.

'చెప్పు.'

చూడు సత్యా! నీకు ఎక్కడా ఎవరూ లేరు. ఈ ఊర్లోనే ఉండిపో. నేను నీకు ఏదో విధంగా దారి చూపిస్తాను నా మీద ఆధారపడ్డావనే బాధ నీకు లేకుండా చేయగలను. నీవు నాకళ్ళ ముందు నుంచి దూరంగా వెళ్ళొద్దు, కష్టపడతావు.' సత్యవతి ఒకసారి తల యెత్తి చూసి మళ్ళీ దించుకుంది.

'విషయం యింత తిన్నగా చెప్పినందుకు క్షమించు సత్యా! నీ మనసు బాధపడితే.'

'లేదు. నువ్వు చెప్పినట్లు చేయటం కంటె గత్యంతరం కూడా లేదు. కాని ఒక్క విషయం. నేను నీ యింట్లో మాత్రం ఉండను.' సత్యవతి అంది.

'అదేం? మాకేం యిబ్బందిగా లేదు. ఎంత పెద్దయిల్లో చూశావుగా.'

'అదికాదు చలపతి! నీ భార్యతో నేను ఒక్క మాట కూడా మాట్లాడలేదు. ఏమని మాట్లాడగలను చెప్పు. నాకు చాలా యిబ్బందిగా ఉంది యీ విషయంలో. వాళ్ళ దృష్టిలో నేను...' సత్యవతి ఆగిపోయింది.

'సరే అలాగయితే. నీ యిష్టం'

'ఇంకో సంగతి. నీవు తరచు ఆ యింటికి అంటే నేనుండే స్థలానికి కూడా రావడానికి వీలులేదు.

'అదేమిటినా?'

'నీ మంచికే చెప్తున్నాను. నేనెలాగూ చెడినదాన్నే.'

'వాళ్ళే కట్టిపెట్టు. నా యిష్టం వచ్చినప్పుడు వస్తాను. నీ రెండో షరతు నేనామోదించలేదు.' చలపతి సంభాషణ తేలికగా మళ్ళించి ఒప్పించడానికి ప్రయత్నించాడు.

సత్యవతి ససేమిరా వల్లకాదంది. చివరకి చలపతి ఒప్పుకున్నాడు.

'పూర్తిగా రావటం మానేసేవు సుమా! పీడ తప్పిందే చాలని. వారం రోజులకో ఎప్పుడో బ్రతికి ఉన్నానో చచ్చానో చూసి పోతూ ఉండు.'

'అదేం మాట సత్యా!' చలపతి బాధగా అన్నాడు.

'యింకెప్పుడూ అననులే.' చలపతి ముఖంలో బాధచూసి సత్యవతి అంది నవ్వడానికి ప్రయత్నిస్తూ.

నాలుగు రోజుల తరువాత చలపతి ఒక చిన్న యిల్లు చూసి సత్యవతిని తీసుకుని వెళ్ళాడు. రెండే రెండు గదులు. ఒకటి చిన్నది. వంటకి ఉపయోగించవచ్చు.

'ఎలాగ ఉంది? చలపతి అడిగాడు.

'బాగానే ఉంది. నేను పెద్ద అద్దెలు యిచ్చుకోలేను. నీ డబ్బు ఒక్క నయాపైస అయినా నాకు తెలియకుండా ఖర్చు పెడితే ఊరుకోను.'

'నీ రెండు షరతులలో యిదిలేదే. అయినా రైలులో అనవసరంగా పాతిక రూపాయలు ఖర్చు పెట్టించావుగా. అప్పు తీరుస్తావా?' చలపతి నవ్వుతూ అన్నాడు.

'ఆ సంగతి వేరు. ఆ శిక్ష అక్కడితో నీకు చాలు.' సత్యవతి కూడా నవ్వింది.

'రేపటి నుంచి పదిమంది పిల్లల్ని పంపిస్తాను. నీకు తెలిసిన చదువేదో వాళ్ళకి చెప్పు.' చలపతి అన్నాడు.

'అమ్మో!'

'ఫస్టుఫారం, సెకండ్‌ఫారం వాళ్ళే. నీకేం కష్టం ఉండదు.'

'నీ ఋణం ఎలాగ తీర్చుకోడమా అని ఆలోచిస్తున్నాను.' తలదించుకుని అంది సత్యవతి.

'పద్దు వ్రాయిస్తాలే మరచిపోకుండా!' చలపతి నవ్వాడు.

'నువ్వు నాకు తల్లివా, తండ్రివా ఎందుకింత జాలినేసంటే చలపతీ!'

'ఏమీకాను కాబట్టేనేమో! యింకో సవరణ యేమిటంటే నీమీద నాకున్నది జాలికాదు.' చలపతి నవ్వి అన్నాడు.

సత్యవతి నవ్వలేదు. నీరునిండిన కనులు కృతజ్ఞతను వెదజల్లుతున్నాయి.

'అలా చూడకు మరి. అక్కడికి నేనేదో దేవుడినయినట్లు. నేను చేసిందేమీ లేదు యిందులో. నేను మళ్ళీ తరువాత కనపడతాను.' చలపతి యింక అక్కడ ఉండలేక తలుపుతీసుకుని బయటకు నడిచాడు.

* * *

ప్రొద్దున్న పదిగంటలవుతుంది.

'కళ్యాణీ! వీధితలుపు చప్పుడవుతోంది. ఎవరోచూడు.' కుడుతున్న విస్తరి చేతితో ఆపుచేసి అంది సీత.


'రుక్మిణత్తమ్మ.' కళ్యాణి అక్కడినుంచే అరచింది.

'ఏమిటే కేకలు? మెల్లిగా చెప్పలేవూ?' సీత కూతురిని కసురుకుంది.

'ఉండవే మరి. వాడగ్గరనుంచి పట్నం బావ విశేషాలు వస్తాయని దాని పడాపడి.'

రుక్మిణి నవ్వుతూవచ్చి దగ్గరగా నిల్చుంది.

'ఏమిటి విశేషం? నల్లపూసవైపోయావు యీమధ్య.' సీత మళ్ళీ తనపని మొదలు



పథవిహీన

పెట్టింది.

'సరేలేకాని...మీ ఆయన యింట్లోనుంచి వెళ్ళినట్లేనా?' రుక్మిణి ప్రశ్నించింది.

'ఇప్పుడే వెళ్ళారు. కూర్చో.'

'మావాడు పరీక్ష పాసయ్యాడు. అదీ విశేషం.'

'ఇంకేం నీకొడుకు డాక్టరయిపోయాడు. రోజుకొక యింజెక్షను పొడిపించుకోవచ్చు' సీత నవ్వింది.

'మొదటి సంవత్సరంతోనే అయిపోయిందా తల్లీ' అని ఆగింది రుక్మిణి.

'ఇదిగో సీతా! దాని ముఖం చూడు మతాబులాగ ఎలాగ వెలిగిపోతోందో యీ సంగతి వినేసరికి. అప్పుడే అక్కడికి తన మొగుడు డాక్టరయిపోయినట్లు' నవ్వుతూ కళ్యాణివైపు చూపింది.

'పో అత్తా! ఎప్పుడూ నన్నేడిపించడానికే మాయింటికి వస్తావు.' కళ్యాణి సిగ్గుపడింది.

'ఏది కోడలా! నీ ముఖంలో ఏడుపే ఉందో నవ్వే ఉందో ఒకసారి ఎవరినయినా అడుగు' రుక్మిణి పకపకనవ్వి కళ్యాణి బుగ్గ గిల్లింది.

'నువ్వొక్కర్తివే యింట్లో ఉంటావను కున్నాను. ఈవిడగారు స్కూలుకి నామం పెట్టిందేం? నేను వస్తానని కాని తెలిసిందేమిటి?' రుక్మిణి సగం హాస్యంగాను, సగం సీరియస్‌గాను అని కళ్యాణికేసి చూపించింది.

'ఏమిటి విశేషం?' సీత ఆగి అనుమానంగా చూసింది.

'చెప్తాగా' అని 'కళ్యాణీ! నీకు కావలసిన వార్తలన్నీ చెప్పేసాను. యిక్కడినుంచి వెళ్ళు. మీ అమ్మా నేనూ మాట్లాడుకోవాలి.' రుక్మిణి కళ్యాణిని లేవదీసింది.

సీత ఆశ్చర్యంగా చూసింది.

'చాటుగా విన్నావంటే ముక్కు పిండేస్తాను' రుక్మిణి కళ్యాణితో అని సీతవైపు తిరిగింది.

'సీతా! ఆవిడ యీ ఊరువచ్చి ఎన్నాళ్ళయింది?'

'ఎవరు?' సీత ఆశ్చర్యంగా అడిగింది.

'ఇంకెవరు? మీ ఆయన తీసుకురాలా?'

'రెండునెలలవుతోందేమో? ఏం?'

'మీ ఆయన పద్ధతి యేమి బాగా లేదు సీతా! ఊళ్ళో అందరూ నాలుగు రకాలుగా అనుకుంటున్నారు.' రుక్మిణి మెల్లిగా అంది.

సీత ముఖం నల్లబడిపోయింది.

'ఏమిటి నువ్వనేది?'

'ఇదేమయినా మహాపట్నమా? ఒకరి సంగతి మరొకరు పట్టించుకోకుండా కూర్చోడానికి. మీ యింటాయనకి తెలియాలి ఆ సంగతి.'

'ఇంకొకటేదయినా మాట్లాడుదూ యిక్కడికి ఆపి.' సీత చిరాకుగా అంది.

'నీకు చెప్పడం నాకు యిష్టం అనుకోకు.' రుక్మిణి కొంచెం కోపంగా అంది.

'అదికాదు కానీ. యిప్పుడసలేం జరిగింది? ఏదో గతిలేని మనిషికి పోషణ కల్పించారు. అదీ ఒక నేరమే?' సీత అంది.

'గతిలేని అమాయకురాలయితే ఏం పర్వాలేదు. కాని ఆ మనిషి వెనుక చాలా కథ ఉందట!'

'ఆ'ట'తో చెప్పుకునే కథలు నాకు చెప్పకు. రుక్కూ!'

'అలాగ నామీద కోప్పడి నా నోరు మూయించగలవు కాని ఊరందరి మాటేమిటి?'

'ఇష్టం వచ్చినట్లు అనుకోనీ నాకు సంబంధంలేదు. ఆయన తత్వం నాకు తెలుసు.'

'నేనుమాత్రం కాదన్నానా? నా ఉద్దేశ్యం యేమిటంటే అసలు ఈ ఊహలకి అవకాశం యివ్వకుండా ఉండలేరా అని.'

సీత మాట్లాడకుండా ఊరుకుంది.

'అసలు ఆవిడ యెవరు?'

'ఆయనకి బాగా తెలిసిన వ్యక్తి.'

'ఏవిధంగా? బంధువా? స్నేహితురాలా?'

'నాకు తెలియదు.'

'మరి నువ్వెప్పుడూ అడగలేదా?'

'నా కనవసరం రుక్కూ! నా కటువంటివి యిష్టం ఉండవు. అంత ముఖ్యమయినదయితే ఆయననాతో చెప్పకుండా ఉండరు.'

'సరే వారి సంబంధంలో అపవిత్రతేమీ లేదనే అనుకుందాం. కానీ లోకం కోసమయినా కొంచెం చూసుకోవద్దా.'

'ఆయన సంగతి నీకు తెలియదు రుక్కూ!

'ఆయనో మనసుకి తోస్తే యింక దేనికీ వెరవరు.'

'పోనీ నువ్వే చెప్పు.'

'ఏమని?' సీత కనుబొమలు ముడిచింది.

'ఊళ్లో అందరూ యిలాగ అనుకుంటున్నారని.'

'ఛీ! నేను కూడా నమ్ముతున్నానని అనుకోకు.' సీత తీక్షణంగా అంది.

'మరయితే యీ ఊళ్లో యీ బుర్రకథలు, హరికథలు జరుగుతూ ఉండాల్సిందేనా?'

'పనిలేని వాళ్ళు చెప్పుకుంటారు. ఆపగలమా?' సీత చిరాకుగా అంది.

'సరే అయితే. యింతకీ నీలాంటి భార్య దొరకడం మీ ఆయన అదృష్టం. నిన్ను హెచ్చరించటం మంచిదనుకున్నాను. మరోకలా అనుకోకు.' రుక్మిణి వెళ్లిపోయింది.

సీత మనసంతా చికాకుగా అయిపోయింది. ఎంత మరచిపోదామన్నా వీలుకావటం లేదు. ఏ పని చేస్తున్నా ఒకటే ఆలోచన! యిటువంటి వదంతి ఎందుకని పుట్టింది?

వలపతి ఆ రోజు రెండు మూడుసార్లు అడిగాడు. 'అలా ఉన్నావేమిటని'

రాత్రింబవళ్లు అదే ఆలోచన సీత మనసులో దొలిచి స్థానం కోసం ప్రయత్నిస్తోంది ఛ! యీ ఊహ మనసులోనికి రానీయకూడదని వందసార్లనుకున్నా అనుకుంది. అనుకున్న ప్రతిసారీ మరు నిముషం పెనుభూతంలా ఎదురుగా నిలుస్తోంది. ఏం చేయాలి? భర్తని అడిగేస్తే వదలిపోతుంది. ఒక్కొక్క క్షణం అలాగ అనిపించేది. మరు క్షణం మనసు తనంత తాను సమాధాన పరచుకునేది.

మరునాడు మధ్యాహ్నం సీత అన్నగారు గోపాలం వచ్చాడు. భోజనం చేసిన తరువాత ఏవో మాటలు చెప్పుకుంటూ ఉండగా మధ్యలో ఆగి అన్నాడు గోపాలం.

'అవును కాని సీతా! బావ గురించి అంతా యేదో చెప్తున్నారు. ఎవరినో తీసుకుని వచ్చాడట. నీకేమయినా తెలుసా?'

'ఏం? నీ దాకా కూడా ప్రాకిందేమిటి?' సీత నీరసంగా అంది.

'ఈ ఊరతనే అక్కడికి ఏదో పని మీద వచ్చినప్పుడు నాతో అన్నాడు.'

'అందుకనే వచ్చావా? యిప్పుడు?' సీత అడిగింది.

'నిజం తెలుసుకోవాలిగా. అయినా బావకీ వయసులో యేమిటీ పిచ్చి.?'

'అన్నయ్యా!' సీత తీక్షణంగా అంది. 'చెప్పుడు మాటలు విని అంటున్నావు. ఆయన సంగతి యిన్నాళ్లుగా చూస్తున్నావు. నీకు తెలియదా?'

లోలోపల అంతరాత్మ ఓడిపోయావు అని హేళన చేస్తోంది. కనులలో నిప్పులు, కోపంతో ఎరుపు చేసుకున్నాయి.

'మరి నాతో చెప్పినతను వాళ్ళు బాగా తెలిసినవాడే. అబద్ధం చెప్పడమే నేను కోను.' గోపాలం సంశయంగా అన్నాడు.

సీత అన్నగారికి జవాబివ్వలేదు. ముఖం ఎర్రబడిపోయింది.

'నీదంతా తెల్లనివన్నీ పాలనుకునే స్వభావం సీతా! నిప్పులేనిదే పొగరాదుగా? అసలు బావ మామూలుగా పూర్వంలాగే ఉంటున్నాడా?' గోపాలం అడిగాడు.


'ఆయనలాంటివారు కారన్నయ్యా!' సీత మనసులో బాధ పట్టలేక యేడ్చేసింది.

'ఛ! ఊరుకో. ఏదో అందరూ అనుకుంటున్నారని చెప్పాను. అవకాశం దొరికితే వెయ్యి వదంతులు పుడతాయి. నాకు నిజంగా యేమీ అనుమానం లేదులే. అసలిదెందుకు వ్యాపించిందో తెలుసుకుందామని వచ్చాను.' గోపాలం ప్రేమగా అన్నాడు.

రెండు నిముషాల తరువాత సీత తలయెత్తి అన్నగారివంక చూసింది.

(ఇంకా ఉంది)

అల్లాటప్పయ్య





కర్మానుభవం



ధర్మపథం

బులుసు వెంకటరమణయ్య

ఎవరు చేసుకున్న కర్మను వారు అనుభవించక తీరదనే పెద్దలమాట అనాదిగా వినవస్తూ ఉన్నది.

'అవశ్యమనుభోక్తవ్యం
కృతంకర్మ శుభాశుభమ్'

మనం శుభకర్మ — అంటే పుణ్యకర్మ చేసినా దానిఫలాన్ని తప్పకుండా అనుభవించి తీరాలి; అశుభకర్మ - అంటే పాపకర్మ చేసినా దానికి తగిన ప్రతిఫలాన్ని అనుభవించి తీరాలి!

వీటివి ఎప్పుడు అనుభవించాలి? ఈజన్మలోనా? లేక జన్మాంతరంలోనా? అనే ప్రశ్న ఉత్పన్నమౌతుంది.

క్రిందటిజన్మలో చేసిన పాప పుణ్యాల ప్రతిఫలాన్ని ఈ జన్మలో అనుభవించవలసి ఉంటుంది, ఈజన్మలో చేసిన పాప పుణ్యాల ఫలితాలను మరోజన్మలో అనుభవించి తీరవలసిందే!

కాని—

ఎక్కువపుణ్యంకాని, ఎక్కువ పాపంకాని చేస్తేమాత్రం ఫలితాలు - ఈ జన్మలోనే కనబడతాయి!

'అత్యుత్కటైః పుణ్యపాపై
రిహైవ ఫలమశ్నుతే—'

మిక్కిలి గొప్ప పుణ్యం చేసినా, పాపం చేసినా దానిఫలితం ఈ జన్మలోనే అనుభవానికి వస్తుందని అభిప్రాయం.

ఈ అంశాలనుబట్టి గమనిస్తే ప్రతి ప్రాణికీ పునర్జన్మ ఉన్నదనే తెలుస్తున్నది.

పునర్జన్మను చాలా మతాలవారు అంగీకరించారుకూడా.

ప్రాణి మరణించినతర్వాత — అంటే భౌతికశరీరాన్ని విడిచిన తర్వాత వెంట మరేవీరావు. ఒక్క పుణ్య పాపాలుమాత్రం వద్దన్నా వెంబడించి తీరుతాయి. వాటి ఫలితాలను వచ్చేజన్మలో అనుభవించకనూ తప్పదు.

ఇవి ప్రాణులను ఎలా అనుసరిస్తాయి?

ఓపికతో గమనిస్తే సులువుగానే ఈ విషయం తెలుస్తుంది.

సంచితం, ప్రారబ్ధం, ఆగామి అని కర్మ మూడువిధాలు.

సంచితమంటే యిదివరకు కూడబెట్టుకొన్నది. ఇది భూతకాలానికి సంబంధించినది. ప్రారబ్ధం — ఈ జన్మలో ప్రారంభించబడినది — ఇది వర్తమానకాలానికి సంబంధించినది. ఆగామి — ముందు రాబోయేది. ఇది భవిష్యత్తుకు సంబంధించినది.

సంచితమైన కర్మ ఫలాన్ని అందరూ అనుభవించి తీరవలసిందే. దాన్ని తప్పించుకోవడం బ్రహ్మకు కూడా తరంకాదు. ప్రారబ్ధకర్మకూడా — అది ఆచరించినంతవరకూ అనుభవించాలి. ఎంతో ఆత్మజ్ఞానసంకలవాడై, వేటితోనూ సంబంధం పెట్టుకోకుండా జడభరతుడివలె విరక్తుడై ఉన్నవాడే ఆగామి కర్మఫలాన్ని తప్పించుకోగలుగుతాడు.

పునర్జన్మకి కారణం ఈ కర్మకలాపమే!

ఒక జన్మలో చేసిన పాపపుణ్యాలు మరణానంతరం ప్రాణిని వెంబడించివస్తాయికదూ! వాటిలో పుణ్యంపాలు ఎక్కువైతే కొంత ఉత్తమజన్మ కలుగుతుంది. పాపంపాలు ఎక్కువవుంటే నీచజన్మ వస్తుంది.

ఆ జన్మలోకూడా ప్రాణి స్థాణువులా ఉండదు. ఏదో కర్మని చేస్తూవుండడం సహజం. దానిమూలంగా పుణ్య, పాపాలను సంపాదించడమూ సహజమే! మళ్లీ అవసాన సమయంలో — ఆజన్మలోచేసిన పాపపుణ్యాలు వెంబడించి, మరొకజన్మకు కారణమవుతూ ఉంటాయి.

ఈవిధంగా ప్రతి జన్మలోనూ కర్మలు మిగిలివుండిపోవడమూ, వాటి ఫలితాలను అనుభవించడానికి మరొకజన్మ ఎత్తడమూ తప్పక జరుగుతూనే ఉంటుంది.

పుణ్యపాపాలు రెండూ పూర్తిగా అనుభవానికివచ్చి మిగత లేనప్పుడే nil balance స్థితిలోనే ముక్తి కలుగుతుంది. ముక్తి అంటే—కర్మబంధాలనుంచి విడుదల పొందడమేకాని వేరుకాదు. అదే ముక్తి లేక మోక్షం!

ఈరీతిని కర్మబంధాలనుండి తప్పించుకోవడం గొప్ప తపశ్శాలులకుతప్ప సామాన్యులకు సాధ్యంకాదు. దానికి ఎన్నివేల జన్మలనో ఎత్తవలసి వుంటుంది.

భాగవతంలో ఈసందర్భంలో చమత్కారంగా ఒకవిషయం చెప్పబడింది.

ఒక గొప్ప కన్యక ఎట్టి కష్టమూ లేకుండా చాలా స్వల్పమైనకాలంలోనే ముక్తిని పొందినదట! అయితే - పూర్వజన్మలో ఆమె చేసుకున్న పుణ్యపాపాల సంగతి ఏమిటి? అని అడగండి.

శ్రీ కృష్ణుడు లభించకపోవడంవల్ల కలిగిన గొప్ప విరహవేదనను అనుభవించడంవల్ల అనేక జన్మాల పాపాలు పూర్తిగా అనుభవించబడ్డాయి. అతనిని స్మరిస్తూ పొందిన నిరవధికమైన ఆనందంవల్ల ఆమె చేసిన పుణ్యాలు సమస్తమూ అనుభవాలయిపోయాయి. పాపపుణ్యాలు పూర్తిగా అనుభూతాలైపోయినందున మిగులు అనేది లేకపోయింది. ఆ కర్మబంధం తెగిపోయినందున ఆ గోపికకు వెంటనే ముక్తి లభించినదట!

పుణ్యకర్మలూ, పాపకర్మలూ పూర్తిగా అనుభవించబడి, మిగులు లేకుండా ఉన్నపుడే బంధవిముక్తి కలుగుతుంది.

ముక్తిఅన్నా మోక్షమన్నా అదే! మహాతపశ్శాలులూ, యోగులూ కోరేదీ అదే! ●

జాన్ కోర్ట్

బ్రిటన్‌లో ఏ షాపులోకయినా వెళ్లండి, ఏ కెమిస్ట్ షాపులోకయినా వెళ్లండి—

100 రకాల సువాసన ద్రవ్యాలు,
117 రకాల (రంగుల) లిప్‌స్టిక్‌లు,
50 రకాల ఫేస్ క్రీమ్‌లు,
70 రకాల (రంగుల) గోళ్ల రంగులు,
100 రకాల టాల్కం పవుడర్లు,
60 రకాల షాంపూలూ,
దొరుకుతాయి.

అంటే బ్రిటన్‌లో ఆడవారి అలంకరణ ఎంతో పెద్ద పరిశ్రమ అన్నమాట. ఏటేటా బ్రిటిష్ స్త్రీలు తమ అలంకరణ కోసం ఇంకా ఇంకా ఎక్కువడబ్బు కర్చు పెడుతున్నారు.

కాస్మెటిక్స్, స్నో, పవుడరు, లిప్‌స్టిక్ వగయిరా, ల మీద మాత్రం ఇక్కడ 1967 లో 8.4 కోట్ల పవున్లు (నేటి మారకం ప్రకారం 176 కోట్ల చిల్లర రూపాయలు) కర్చు పెడ్తారని అంచనా. 1957 లో 6.18 కోట్ల పవున్లు, 1953 లో 7.5 కోట్ల పవున్లు కర్చు పెట్టారు.

ఇక సబ్బులు, ఒంటికి రాసుకునే సుగంధ ద్రవ్యాలకి సుమారు 3 కోట్ల పవున్లు కర్చు చేస్తారట!

'మేకప్' వాడటం ఇంకా ఎక్కువ అవటమే కాక, ఈ మేకప్ వస్తువుల సంఖ్య కూడా రోజురోజుకీ పెరిగిపోతుంది.

లిప్‌స్టిక్‌కి బ్రషులు, పెదిమలకి మందులు, పవుడర్లకి బ్రష్‌లు, కంటి పత్రాలకి రంగు (!), జుట్టు వంకరలు తిప్పేవి, కనుబొమలకి రంగులు, జుట్టుకి టానిక్కులు, పూతలు, జిగజిగమని మెరిసే పొడులు (జుట్టుకి), గోటిచిగుళ్లు తీసేసేవి, గోళ్లకి మందులు, చర్మానికి టానిక్కులు, హార్మోన్ క్రీమ్‌లు, రూజ్, ఒంటి దుర్గంధాలని పోగొట్టేవి, చేతికి క్రీములు...ఇంకా ఎన్నో!

ఇక ఎలా కర్చు చేస్తారు?

టాల్కమ్ పవుడరు మీద అధిక వ్యయం చేస్తారట స్త్రీలు. 100 కి 92 మంది ఆడవారు ఇది అన్నిటికన్నా ముఖ్యం అన్నారుట.

తర్వాత లిప్‌స్టిక్. 100 కి 85 మంది వాడ్తారు. పది సంవత్సరాలలో లిప్‌స్టిక్ వాడే స్త్రీలసంఖ్య 10 శాతం పెరిగిందట!

నగరాలలో ఇరుకుగా ఉండేవారు దేహ దుర్గంధాలని పోగొట్టే వస్తువులని, ద్రవ్యాలని వాడటంలో ఆశ్చర్యం లేదు.

1962 లో 48 శాతం వాడితే, 1967 లో 62 శాతం వాడుతున్నారుట.

కంటికాటుక కూడా బాగా ప్రచారంలోకి వస్తోంది. దీని మీద ఏటా ఈదేశంలో 50 లక్షల పవున్లు కర్చు అవుతున్నాయి.

ఇరవయి నిండనివారు కాస్మెటిక్స్‌మీద అయ్యేకర్చులో సుమారు నూటికి 33 శాతం కర్చుచేస్తారుట. వాటిద్వారా వివాహాలు త్వరగా చేసేసుకుందామని. వయసులో ఉన్నపిల్లలకి తమ అందం ముఖ్యం అని వేరే చెప్పాలా? ఎందుకు ఇన్ని లక్షలు, కోట్లు కర్చుపెడ్తారు ప్రకటనలమీద?

ఇక్కడ జరిగిన పరిశోధనలో—ఇరవయి నిండనివారిలో—

100 కి 96 మంది లిప్‌స్టిక్, 93 పవుడర్, 66 క్రీమ్, 36 తుడిచే క్రీమ్, కంటికాటుక, 22 క్రీమ్‌రూజ్ వాడ్తారని తెలిసింది.

పెళ్లికాగానే ఈ పిల్లలు 'అతి అలంకరణ' కొంచెం తగ్గిస్తారుట. అందులోనూ కంటికాటుకని!

లండన్‌లో ఉద్యోగంచేసే అమ్మాయి—సుమారు ఇరవయి అయిదేళ్ల వనిత—సంవత్సరానికి సుమారు 18 పవున్ల చిల్లర కర్చుచేస్తుందిట. (అంటే సుమారు 370 రూపాయలు.) ఇందులో టాల్కం పవుడర్‌కి మాత్రం 3 పవున్ల చిల్లర అవుతుందిట. కంటికాటుకకి సుమారు 2 పవున్ల చిల్లర, ఒంటికివాడే దుర్గంధ నివారిణులకి 3 పవున్లు.

టూత్‌పేస్ట్‌కి 2 పవున్ల చిల్లర, సబ్బుకి ఒకటిన్నర పవును. కేశాలంకరణ

గుండెపోటు వచ్చేదాకా ఆగనక్కరలేదు!

గుండెపోటు మీ ఆయుషుని పొడిగించవచ్చు!

హఠాత్తుగా జీవితంలోని అందాలు మీకు బాగా తెలిసిరావచ్చు. అంతదాకా మీకు చిరాకెత్తించి, బాధ కలిగించిన విషయాలన్నీ అతి అల్పమయినవిగా మీకు తోచవచ్చు!

హడావుడి తగ్గిస్తారు. పుష్టికరమయిన ఆహారం తగు మాత్రంగా తింటారు. మీకు ఇష్టమయిన వాళ్లనే కలుస్తూ ఉంటారు, గుండె పోటు మూలంగా ఉద్రేకం కలిగించేవి ఏవి పనికిరావనే మిషతో పెత్తనాలు తగ్గించుకుంటారు!

ఇలా మీ ఆరోగ్యం బాగుపడుతుంది. గుండెపోటు వచ్చేదాకా ఆగకండి. ముందే జీవితంలోని అందాలని కని పెట్టండి!



3.

హెచ్. ఎల్. హార్షవ్‌షోవ్
(కాపీరయిటు)

ఆడవారి ముఖం విలువ

కర్చు అదనం.

అరవయిఏళ్లు వయిన ఆడవారు అలంకరణకోసం సంవత్సరానికి 3 పవున్లు కూడా కర్చుపెట్టరుట. కాని, ఇటీవల విడాకులు పుచ్చుకున్న ఒక వనిత తనపాలు అలంకరణ బడ్జెట్ ఇలా ఉందని చెప్పింది—

120	పవున్లు	సుగంధద్రవ్యాలు
90	,,	పవుడర్ కి
70	,,	కేశాలంకరణ
40	,,	బ్యూటీ క్లినిక్ కర్చుల్లు
50	,,	ఇతరసౌందర్యసాధనలు

45–62 ల మధ్య స్త్రీలు క్రమంగా ఫేస్‌పవుడర్ వాడకానికి మాత్రం తగ్గిపోతారుట. పవుడర్ వాడేవారి శాతం 72. ఈ వయస్సువారిలో లిప్‌స్టిక్ వాడేవారి శాతం 45 (50 శాతం క్రీమ్ వాడితే చర్మానికి మంచిదని నమ్ముతున్నారుట)

ఇటీవల బ్రిటన్‌లో ఆడపిల్లలు వివాహం చేసుకునే వయస్సుబాగా తగ్గిపోయింది.

అందుచేత నలభయి ఏళ్లకింద అమ్మమ్మలు చాలామంది ఉన్నారు. వీరందరూ మేకప్ వాడుతూ ఉంటారు. ఒకటి, రెండు దశాబ్దాలకింద అమ్మమ్మలు లిప్‌స్టిక్ వాడుతారంటే అదిరిపడేవారు! మేకప్—ఏదో రకంగా—వాడే అమ్మమ్మల అమ్మలు కూడా ఉన్నారు.

60 ప్రాంతం వయస్సుకల స్త్రీలు తమ చిన్నతనంలో 'మేకప్' వాడటం 'అక్రమం' అనుకునేవారని అంటూ ఉంటారు!

40 సంవత్సరాలక్రితం నలుగురిలో ఒక స్త్రీ ఫేస్ పవుడర్ వాడేదిట. లిప్‌స్టిక్, బుగ్గలికి రంగు వేసుకునేవారు నూటికి 6 మంది, జుట్టుకి వంకులు పెట్టుకునేవారు 10 మందిట. అప్పటికాలంలో 'మర్యాదగా బతికే' స్త్రీలు మేకప్ వాడేవారు కారు. 1967 లో మేకప్ వాడని స్త్రీ ముఖం కృత్రిమంగా కనిపిస్తుంది!

(ఫో. వ. ఫీ.) ●

నివృత్తి-ప్రవృత్తి

'సావధాన్! సావధాన్! శుభమంగళ్ సావధాన్!' అంటూ ఏకకంఠంతో పాడారు పురోహితులంతా. అది మహారాష్ట్రములో జాంబ్ అనే గ్రామం. ఇప్పటికి మూడు వందల ఏళ్ల క్రితం సంగతి; ఒక వివాహం జరుగుతోంది. ఈ శుభసమయంలో పెళ్లికి వచ్చినవారందరిని భయాందోళనలలో ముంచే సంఘటన ఒకటి జరిగింది.

పన్నెండేళ్ల పెళ్లికొడుకు నారాయణ్ ఈ మాటలు వింటూనే కళ్యాణ మంటపం వదిలి పరిగెత్తుకు వెళ్ళి పోయాడు. క్షణంలో ఎవరికీ కనిపించకుండా మాయమయి పోయాడు. అతన్ని పట్టుకోవాలని ఎందరో వెంటపడ్డారు. కాని, అతను దొరకలేదు.

నారాయణ్ తండ్రిపేరు సూర్యజీపంత్ ఠోసర్. అతను సంపన్నుడి కిందే లెక్క. జాంబ్ గ్రామం కరణం. నారాయణ్ కి చిన్నప్పటి నుంచీ దైవభక్తి మెండు. తల్లిదండ్రులు వివాహం కుదిర్చినప్పుడు తనకి ఇష్టం లేదన్నాడు కాని వారి ఒత్తిడి వల్ల చివరికి ~~అంగీకరించాడు. ఇక~~ వివాహం అవపోతూందనగా 'సావధాన్ సావధాన్' అనే పురోహితుల హెచ్చరికలు అతని మొదటి అనిష్టాన్ని మేల్కొలిపాయి. సంసార సాగరపు పరిధి ఎటువంటిదో తిరిగి అవగాహన చేసుకున్నట్లయింది. వెంటనే వివాహం నుంచి తప్పించుకుని పారిపోయాడు.

కొంత కాలం లోకసంచారి అయిన నారాయణ్ చివరికి టాంక్లి అనే పల్లెలో స్థిరపడ్డాడు. టాంక్లి నాసిక్ వద్ద గ్రామం. పన్నెండేళ్లు తపస్సు చేశాడు. పన్నెండేళ్ళ తపస్సు తర్వాత తిరిగి లోకసంచారం ప్రారంభించాడు. మహారాష్ట్ర అంతా తిరిగాడు. దేశంలో ఇతర భాగాలు కూడా చుట్టాడు. ప్రతిచోటా అతనికి మహమ్మదీయరాజులు కొందరి అసహనం వల్ల హైందవమతంలో ఏర్పడిన ఆధ్యాత్మిక క్షీణత బాగా కనిపించింది. హైందవ సమాజాన్ని పునరుద్ధరించటమే తన ధ్యేయంగా పెట్టుకున్నాడు. అప్పటికి అతని పేరు 'రామదాస్'గా మారిపోయింది.

అయితే, తక్కిన కొందరు మహారాష్ట్ర మహాత్ములలాగ కేవలం ఆధ్యాత్మికవిషయాలని గురించి మాత్రమే మాట్లాడి ఊరుకునే వాడుకాదు రామదాస్. ఇహ లోకంలో జీవితం కూడా ముఖ్యం అని బోధించేవాడు. 'నివృత్తి' ఎంత ముఖ్యమో 'ప్రవృత్తి' కూడా అంతే అని చెప్పేవాడు.

రామదాస్ సందేశం ఆయన 'దాసబోధ' లో ఇమిడి ఉంది. ఇది మరాఠీ భాషలో రాసిన ఉద్గ్రంథం. మహారాష్ట్రలో రామదాస్ పద్యాలు విని ఆనందించనివారు లేరు.

రామదాస్ కేవలం మత ప్రచారకుడు మాత్రంగానే ప్రసిద్ధి చెందలేదు. ఛత్రపతి శివాజీ గురువుగా భారతదేశ చరిత్రలో శాశ్వత స్థానం సంపాదించుకున్నాడు. రామదాస్ లేక నారాయణ్ 1682లో తన డెబ్బయినాలుగవ ఏట ఈ లోకాన్ని వదిలి వెళ్ళి పోయాడు.

—ఎస్. ●

వంటలు :

ఉల్లిపాయ పాయసం

ఉల్లిపాయ తరిగిన ముక్కలు...సుమారు 1 కప్పు, పాలు...రెండు గ్లాసులు, బాదం పప్పు...15, చక్కెర...8 చంచాలు, ఏలక్కాయలు ... 8లేక 9, కుంకుమపువ్వు, కిస్మిస్‌పళ్ళు ... 4 చంచాలు, నెయ్యి ... పావుచంచా.

పాలు పొంగనివ్వాలి. ఇంతలో తొక్కతీసిన బాదం (వేడినీటిలో నానబెట్టి) పప్పుని ఏలక్కాయతో రుబ్బి ఈ 'పిండి'ని ఒక కప్పు సరిపడా నీరు కలపాలి.

సన్నగా తరిగిన ఉల్లిపాయ ముక్కలని నీటితో కడిగి ఘాటు తీసెయ్యాలి. తర్వాత వాటిని నెయ్యిలో వెయించి పాలు వాటి మీద పొయ్యాలి అవి మెత్తబడేదాకా ఉడక నివ్వాలి. మూత అవసరం. ఆ తర్వాత చక్కెరవేసి పూర్తిగా కరగనివ్వాలి.

దీనికి బాదం 'పిండి' నీరు కలిపి సుమారు రెండు కప్పుల పరిమితికి తగ్గిపోయేదాకా ఉడకనివ్వాలి. నిప్పుమీద నుంచి దింపెయ్యాలి.

నేతిలో వెయించిన కిస్మిస్ పళ్ళు కలపాలి. కుంకుమ పువ్వుని సుమారు 8 చంచాల వేడిపాలలో నానిపి పసుపు వచ్చిన ఈ పాలని కూడా పై పాయసానికి కలపాలి.

రెండు కప్పుల పాయసం వస్తుంది.

—ఎ. వి. ●


సౌందర్యమైన చర్మంతో
ప్రారంభమవుతుంది సౌందర్యం
గోద్రెజ్ చందన సబ్బు అత్యంత
శుద్ధమైన చందన తైలంతో చేయబడింది—
మీ చర్మాన్ని శుభ్రపరచడంతోపాటు,
అది చర్మానికి వెన్నవంటి
మృదుత్వాన్ని యిస్తూ
అందమైన కాంతిని,
చాలా కాలము నిలిచే
పరిమళాన్ని యిస్తుంది.
అది చాలాకాలం
వాడుకకువుంటూ మీ
డబ్బుకు సరైనచక్కని
విలువనిస్తుంది. ప్రతి బిళ్ళ,
కొనుగోలుకు దొరికే
యే యితర చందన సబ్బు
బిళ్ళకన్నా నాల్గవవంతు
పెద్దది.
Sandal
LUXURY SOAP by Godrej
గోద్రెజ్ వారి
లగ్జరీ
సాండల్
సబ్బు
క్రొత్త శ్రేష్ఠమైన అసలైన
చందన పరిమళము




మెదడుకి మేత

డాక్టర్ మహీధర నళినీమోహన్



(క) నీరు—గ్యాస్—విద్యుత్తు:

ఇక్కడి బొమ్మలో చూపినట్లు 1, 2, 3 ఫ్యాక్టరీలు ఉన్నాయి. వీటికి అవసరమైన నీళ్లు, విద్యుచ్ఛక్తి, వంటచెరకుగా ఉపయోగపడే గ్యాస్ సరఫరా చేయడానికి



మూడు చిన్న చిన్న కర్మాగారాలు కట్టేరు. ఒక గొట్టం మీదుగా మరో గొట్టం వెళ్ళకుండా ఈ మూడు ఫ్యాక్టరీలకు పైన చూపించిన కర్మాగారాలనుంచి నీరు, గ్యాస్, విద్యుత్తు సరఫరా గొట్టాలు వేరు వేరుగా వెయ్యాలి. ఇది ఎట్లా సాధ్యమో తెలియక తికమకపడుతూన్న ఇంజనీర్లకు మీరేమైనా సలహా ఇవ్వగలరా?

* * *

(చ) ఎలుకల బోను:

1 నుంచి 21 వరకు అంకెలు వేసిన అట్టముక్కలను గుండ్రంగా బొమ్మలో చూపిన క్రమంలో అమర్చు. ఈ ముక్కలు ఎలుకలు అన్నమాట. ఈ ఎలుకల నన్నిటినీ చంపాలి. ఆ చంపడంలో కొన్ని నియమాలు పాటించాలి.

నీకు తోచిన ఏదో ఒక ముక్క మీద వేలుపెట్టి దానిని 1 వ ముక్క అను. అక్కడినుంచి ఒకటి, రెండు, మూడు, నాలుగు...అని పైకి అంటూ వరుసగా ముక్కలను 'సవ్యమార్గం'లో [అంటే గడియారపు ముళ్ళు తిరిగే దిశలో] లెక్కించుకుంటూ వెళ్ళు. సాధారణంగా నీవు పైకి అంటున్న అంకెకూ, ఆ ముక్కమీదఉన్న సంఖ్యకూ సంబంధం ఉండదు. కాని, ఒక్కొక్కప్పుడు 'కాకతాళీయం'గా ఆ రెండు సంఖ్యలూ సమానం అవుతాయి. అట్లా సమానం అయిన ముక్కను ఆటలో నుంచి తీసెయ్యాలి. అంటే ఆ ఎలుకను పట్టేశామన్నమాట. ఆ ముక్కను తీసేసి, తరువాత ముక్కదగ్గర నుంచి మళ్లీ ఒకటి, రెండు, మూడు ... అంటూ లెక్కపెట్టుకుంటూ వెళ్లాలి. నీవు లెక్కిస్తున్న సంఖ్య, అట్టమీది సంఖ్య సమానం అయినప్పుడల్లా ఆ ముక్కను ఆటలో నుంచి తీసేస్తూ ఉండాలి. ఈ విధంగా ఆ 21 ముక్కలనూ తీసివెయ్యగలగాలి. ఉదాహరణకి: 18 అనే

ఎలుకల బోను





సంఖ్య ఉన్న ముక్క దగ్గర మొదలుపెట్టి, దానిని ఒకటి అనీ, తరువాత ఉన్న 8 ముక్కను రెండు అనీ, తరువాత 11 ముక్కను మూడు అనీ...లెక్కించుకుంటూ పెడితే ఆఖరికి 19వ అంకె ఉన్న ముక్కను 19 అని లెక్క పెడతాం. అప్పుడు అది పండిందన్నమాట. దానిని తీసేసి తరువాత ఉన్న 21 సంఖ్యగల ముక్కను ఒకటి అనీ, 5 సంఖ్యగల ముక్కను రెండు అనీ ... లెక్కించుకుంటూపోతే తరువాత 10 సంఖ్యగల ముక్క పండుతుంది. తరువాత 1 అనే అంకె ఉన్న ముక్క పండుతుంది. తరువాత మరే ముక్కా పండదు. 21 అంకెలు లెక్కపెట్టేక ఇంక ఎదరకు లెక్కించడం అనవసరం. ఇంకేవీ పండవు. 18 దగ్గర మొదలు పెడితే మూడు ముక్కలే పండేయి. అసలు చెయ్యవలసినదేమిటంటే సరియైన ముక్కతో మొదలుపెట్టి 21 ముక్కలనూ ఏరి వెయ్యగలగాలి.

నిజానికి బొమ్మలో చూపిన ముక్కల కూర్పుతో అన్ని ముక్కలనూ ఏరి వెయ్యడం సాధ్యంకాదు. కాని, రెండు ప్రత్యేకమైన ముక్కలను తారుమారు చేస్తే ఇది సాధ్యమే. ఉదాహరణకి 6,2 అనే అంకెలున్న ముక్కల స్థలాలు తారుమారు చెయ్యవచ్చు. లేదా 7,11; లేదా 16, 12...ఏ రెండు అయినాసరే.

ఏ రెండు ముక్కలను తారుమారు చేస్తే, ఎక్కడి నుంచి మొదలుపెడితే అన్ని ఎలుకలనూ పట్టివెయ్యవచ్చునో కనుక్కొండి చూద్దాం.

(ట) శతమానం భవతి:

$$96\frac{2148}{537} = 96+4=100$$

1 నుంచి 9 వరకూ ఉన్న అంకెలన్నిం


టినీ ఒక్కొక్కసారు మాత్రమే ఉపయోగించి, 100కి సమానం అయేలా వ్రాశాం. ఈ విధంగా ఇంకా రకరకాలుగా వ్రాయవచ్చు. వ్రాయగలరేమో ప్రయత్నించండి.

* * *

జవాబులు

(క)

ఈ సమస్యను ఇక్కడి బొమ్మలో చూపినట్లు సాధించవచ్చు. ఇందులో 3వ ఫ్యాక్టరీకి వెళ్ళవలసిన నీటి గొట్టాన్ని 1వ ఫ్యాక్టరీ



ఆవరణలోంచి తీసుకు వెళ్ళాలి. ఇల్లా చేయడానికి 1వ ఫ్యాక్టరీ అభ్యంతర పెట్టదనే అనుకున్నాం.

* * *

(చ) 6,13 ముక్కలను తారుమారు చేసి, 14వ సంఖ్య గల ముక్కతో మొదలు పెడితే 21 ముక్కలనూ ఈ క్రింది క్రమంలో పేర్చవచ్చు. 6,8,13,2, 10,1, 11, 4, 14,3,5, 7,21, 12, 15,20,9,16,18,17,19.

ఇంతేకాదు 10,14 ముక్కలను తారుమారు చేసి 19తో మొదలు పెట్టినాసరే, 21 ముక్కలనూ పేర్చవచ్చు.

* * *

(ట) పది రకాల జవాబులు ఇక్కడ ఇస్తున్నాను.

1) $96\frac{1752}{438}$ 2) $96\frac{1428}{357}$

3) $94\frac{1578}{263}$ 4) $91\frac{7524}{836}$

5) $91\frac{5823}{647}$ 6) $91\frac{5742}{638}$

7) $82\frac{3546}{197}$ 8) $81\frac{7524}{396}$

9) $81\frac{5643}{297}$ 10) $3\frac{69258}{714}$

బాలసాహితి శీర్షిక ప్రారంభం

మల్లన్న మంత్రి

ఒక రాజుగారివద్ద ఒకప్పుడు మంత్రి పదవి ఖాళీ వచ్చింది. ఆ రోజుల్లో మంత్రిపదవికి తెలివి తేటలే ముఖ్యం కనుక మంత్రిపదవిని కోరే వారందరికీ ఒక పరీక్ష యేర్పాటు చేయబడింది. కాని ఆ పరీక్షలో యెవరూ నెగ్గలేదు.

మంత్రిలేని రాజ్యం, రవుతులేని గుర్రం వంటిది కాబట్టి, రాజుగారు తమరాజ్యంలో యీవిధంగా చాటింపించేరు. "ఎవరైతే రివాజు ప్రకారం కొలిచి బియ్యానికి సమానంగా నూనె యిచ్చి లాభాన్ని సంపాదించగలరో వారికి మంత్రిపదవి యివ్వబడుతుంది.

నూనెధర యెప్పుడూ బియ్యం ధరకంటే అయిదారురెట్లు అధికంగా ఉంటుంది. అందుచేత యెట్టి పరిస్థితిలోనూ బియ్యానికి సమానంగా నూనె యిచ్చినట్లయితే లాభం రాదని ప్రజలందరూ అనుకొన్నారు.

మొట్టమొదట మల్లన్న కూడా అలాగే అనుకొన్నాడుకాని తరువాత యీవిధంగా ఆలోచించేడు. రాజుగారు ప్రకటించిన సమస్యకు యేదో ఒక పరిష్కారమార్గం తప్పకుండా ఉంటుంది. బియ్యానికి సమానంగా నూనె యిచ్చినట్లయితే నష్టం రాకతప్పదు. లాభం రావాలంటే యెక్కువబియ్యానికి తక్కువ నూనెను యివ్వవలసి ఉంటుంది. అలాగ యివ్వడానికి యీ ప్రశ్న ప్రకారం అవకాశం ఉందా? అని చాలాసార్లు తనలో అనుకొన్నాడు.

మల్లన్న, రాజుగారివద్దకు వెళ్ళి తాను బియ్యానికి సమానంగా నూనె యివ్వగలనని చెప్పేడు. బియ్యానికి సమానంగా నూనె యిచ్చినట్లయితే యెలాగ లాభం వస్తుందని రాజుగారు ప్రశ్నించేరు.

"రివాజు ప్రకారం కొలవాలి అని మాత్రం మీరు అన్నారుగాని, వాడుకలో ఉన్న శేర్లు, కుంచాలుమాత్రమే ఉపయోగించాలి అని మీరు అనలేదు. అందుచేత మూడు, నాలుగు అడుగుల వెడల్పు అరంగుళం లోతుగల పళ్లెం వంటి పాత్రను తెప్పించవలసినదిగా మల్లన్న రాజుగారిని కోరేడు.

మల్లన్న కోరిన రకం పాత్రను సభలోనికి తీసికొని వచ్చేరు. మొట్టమొదట మల్లన్న దానితో బియ్యాన్ని కొలిచేడు. పాత్ర నిండిన తర్వాత కూడా మీదను గోపురంవలె బియ్యాన్ని పోసేడు. అది రివాజు. కాబట్టి ఎవరూ దానికి అడ్డు చెప్పలేదు.

తరువాత పాత్రలో అంచుల వరకు మాత్రం నూనె పోసేడు. ఇది కూడా రివాజే. పాత్ర బాగా వెడల్పుగా ఉంది. కనుక పాత్రకుపైన ఉన్న "తల" బియ్యం నూనెకంటే చాలా ఎక్కువ ఉన్నాయి. అందుచేత నూనె యిచ్చిన వానికే లాభం వస్తుంది.

మల్లన్న యుక్తికి రాజుగారుసంతోషించి, అతన్ని మంత్రిగా నియమించేరు.

"కౌటిల్య"

వారఫలం

7-7-1967 శుక్రవారం మొదలు
13-7-1967 గురువారం వరకు.

మేషం: కొన్ని వ్యవహారాల్లో మీ మంచితనమే మీకు యిబ్బందిని కలిగిస్తుంది. వ్యాపారంలో ముఖ్యమైన వ్యక్తులను కలుసుకొంటారు. సాహసముతో కూడిన వ్యవహారాలు ప్రోత్సాహకరంగా ఉంటాయి. ఉద్యోగంలో కార్యభారం పెరుగుతుంది. సాహిత్య కళారంగాల్లో మీ కృషి రాణించగలదు.

స్త్రీలకు:— ఆరోగ్యం బాగా ఉంటుంది. వినోద కాలక్షేపాల్లో పాల్గొంటారు.

వృషభం: వ్యాపారంలో పోటీవారి పోటీని యెదుర్కొని అనుకూలతను సాధించ గలరు. ఆర్థిక వ్యవహారాల్లో మొగమాటాలకు లొంగిపోవడం తగదు. ప్రయాణాలు కొంచెం శ్రమ మీద ఫలించ గలవు. రాజకీయ వ్యవహారాల్లో అనుకూలత లభిస్తుంది. మిత్రులకు సహాయం చేస్తారు.

స్త్రీలకు:— కుటుంబ వ్యవహారాల్లో కార్యభారం పెరుగుతుంది. దైవ కార్యాలు నెరవేరుతాయి.

మిథునం: భారీ యెత్తున చేసే వ్యాపారాలు ప్రోత్సాహకరంగా ఉంటాయి. సమయానికి యేదో ఒక విధంగా డబ్బు చేతికి వస్తుంది. నూతన వ్యవహారాలు లాభించ గలవు. సాహసముతో కూడిన వ్యవహారాలు వారాంతంలో లాభిస్తాయి. కోర్టు వ్యవహారాలు బాగా ఉంటాయి. సజ్జన సాంగత్యం లభిస్తుంది.

స్త్రీలకు:— ఆరోగ్యం బాగా ఉంటుంది. బంధుమిత్రులను కలుసుకొంటారు.

కర్కాటకం: కొన్ని పనులు సులువుగా నెరవేరినా, మరి కొన్నింటిలో శ్రమకు గురి కాగలరు. వృత్తిలో అనుకూలమైన మార్పులు వస్తాయి. అధికారుల వలన జరగవలసిన వ్యవహారాలు ప్రోత్సాహకరంగా ఉంటాయి. ఉద్యోగంలో గౌరవం బాగా ఉంటుంది. ప్రయాణాలు ఫలించ గలవు.

స్త్రీలకు:— కుటుంబ వ్యవహారాలు సంతృప్తికరంగా ఉంటాయి. నూతన విషయాలను తెల్సుకొంటారు.

సింహం: ఈ వారం శుభాశుభ మిశ్రమంగా ఉంటుంది. కొన్ని వ్యవహారాల్లో అధిక వ్యయం జరగడం వలన ఆర్థికంగా ఒత్తిడి వస్తుంది. ముఖ్యమైన వ్యవహారాలు భాగస్వాముల నిర్ణయానికి వదల వేయడం మంచిది. వారం మధ్యలో అనుకూలత లభిస్తుంది. సాంఘిక వ్యవహారాల్లో గౌరవము లభిస్తుంది సంతోషకరమైన వార్తలను వింటారు.

స్త్రీలకు.— ఆరోగ్యం బాగా ఉండదు. మీ తాలూకు వస్తువులు పోయే ప్రమాదం వుంది.

కన్య: వృత్తి వ్యాపారాల్లో మీరు యిదివరకు చేసిన ప్రయత్నాలు యిప్పుడు ఫలిస్తాయి. ఆర్థిక వ్యవహారాలు ప్రోత్సాహకరంగా ఉంటాయి. వారాంతంలో చికాకులు యేర్పడతాయి. ప్రయాణాల్లో శ్రమ కలుగుతుంది. రాజకీయ వ్యవహారాల్లో ప్రతిపక్షాల సంచలనం అధికం కాగలదు.

స్త్రీలకు:— కుటుంబ వ్యవహారాల్లో అధిక వ్యయం జరుగుతుంది. సంతానానికి సౌఖ్య సంతోషాలు లభిస్తాయి.

తుల: మీ ఆత్మ విశ్వాసమే అన్ని వ్యవహారాల్లోను అనుకూలతను సాధించ గలదు. నూతన వ్యవహారాలు లాభదాయకంగా ఉంటాయి. వృత్తిలో ప్రయోజనం గల పరిచయాలు యేర్పడతాయి. స్థిరాస్తి వ్యవహారాల్లో మీ ప్రయత్నాలు ఫలిస్తాయి. సాహసముతో కూడిన వ్యవహారాలు వారాంతంలో లాభిస్తాయి.

స్త్రీలకు:— ఆరోగ్యం బాగా ఉంటుంది. సంతోషకరమైన వార్తలను వింటారు.

వృశ్చికం: లాభం రావలసిన వ్యవహారాల్లోనే నష్టం వచ్చే పరిస్థితి యేర్పడుతుంది. ఉద్యోగంలో యెవరినీ విశేషంగా నమ్మడం తగదు. వారం మధ్యలో అనుకూలతను సాధించ గలరు. రావలసిన డబ్బు సమయానికి అందుతుంది. సాహిత్య కళారంగాల్లో ఖ్యాతి లభిస్తుంది. పోటీ వారిలో గౌరవం బాగా ఉంటుంది.

స్త్రీలకు:— కుటుంబ వ్యవహారాలు సామాన్యంగా ఉంటాయి. పుణ్యకార్యాలు చేస్తారు.

ధనుస్సు ఏ వ్యవహారంలోనూ ఆరంభంలో కనుపించిన అనుకూలత ఆఖరువరకు నిలవదు. కొంత మంది వ్యక్తులు మిమ్మల్ని నమ్మించి మోసం చేస్తారు. సాహసముతో కూడిన వ్యవహారాల్లో జోక్యం చేసికోవడం తగదు. వారాంతంలో మంచి పరిస్థితి యేర్పడుతుంది. వృత్తిలో నూతనావకాశాలు లభిస్తాయి.

స్త్రీలకు:— ఆరోగ్యం బాగా ఉండక పోవచ్చును. అధిక వ్యయం జరుగుతుంది.

మకరం: ఫలితం మాట యెలాగవున్నా, ప్రయత్నించిన ప్రతిపనీ సులువుగా నెరవేరుతుంది. సమయానికి యేదో ఒక విధంగా డబ్బు చేతికి వస్తుంది. వారాంతంలో ఆకస్మికంగా చికాకులు యేర్పడతాయి. ప్రయాణాల్లో శ్రమ అధికంగా ఉంటుంది. ఉద్యోగంలో మెప్పుకురాని కార్యభారాన్ని వహిస్తారు.

స్త్రీలకు:— కుటుంబ కార్యక్రమాలు నిరాటంకంగా నెరవేరుతాయి. వినోద కాలక్షేపాల్లో పాల్గొంటారు.

కుంభం వ్యాపారంలో కొత్తవారి పోటీని యెదుర్కోవలసి వస్తుంది. రావలసిన డబ్బు మీద ఆధారపడి యితరులకు వాగ్దానాలు చేయడం తగదు. వృత్తిలో ముఖ్యమైన వ్యక్తులను కల్సుకొంటారు. కోర్టు వ్యవహారాల్లో శ్రమకు గురి కాగలరు. పోటీ వారితో వాదప్రతివాదాలు తగవు.


స్త్రీలకు:— ఆరోగ్యం బాగా ఉంటుంది. సాహిత్య కళారంగాల్లో ఖ్యాతి లభిస్తుంది.

మీనం: వృత్తి వ్యాపారాల్లో మీ కార్యక్రమాలు ప్రోత్సాహకరంగా ఉంటాయి. సాహసముతో కూడిన వ్యవహారాలు వారం ప్రారంభంలో లాభిస్తాయి. ప్రయాణాలు కొంచెం శ్రమ మీద ఫలించగలవు. ఉద్యోగంలో మిత్రులకు ఉపకారం చేయగలరు. సజ్జన సాంగత్యం లభిస్తుంది.

స్త్రీలకు:— కుటుంబ వ్యవహారాలు సామాన్యంగా ఉంటాయి. దైవకార్యాలు నెరవేరుతాయి.

—మహేష్ ●


సినిమాకి డబ్బులిచ్చేంతవరకూ ఘెరావో



వైజ్ఞానిక గాథావళి-98

జీవ నిర్మాణము

- డాక్టర్




జరాసంధుణ్ణి గురించి వింతకథ ఒకటి చెప్తారు. అతణ్ణి ఒకకాలు తొక్కిపెట్టి రెండోకాలు పట్టుకుని చీల్చివదేస్తే ఆరెండుతునకలూ చేరుకుని మళ్లీ లేస్తాడుట యుద్ధానికి. దీని నిజము ఎంతమాత్రమో మనకు తెలియదుగాని, జీవమునకు ఆధారమైన జీవకణాన్ని రసాయనికులు రెండుగా చీల్చి, ప్రొటీనును ఒకగొట్టములోనూ న్యూక్లెయిక్కు ఆమ్లమును ఇంకొక గొట్టములోనూ ఉంచితే ఆరెండూ జీవలక్షణాలు ఏమీ చూపించలేదట గాని, ఈరెంటినీ కలిపితే మళ్లీ జీవకణాలు ఏర్పడతాయట.

కంటికికనబడక మైక్రోస్కోపులో మట్టుకు కనిపించే సూక్ష్మజీవులు— రోగకారకజీవులను— గురించి మనము విన్నాము. మైక్రోస్కోపులోకూడా కానరావటత రోగకారక కణాలు వైరసులనేవి—జీవానికీ అజీవానికీ సంధిదశలో ఉన్నట్టివి— ఎలక్ట్రాన్ మైక్రోస్కోపులో చూచారు. ఆ చూపులోకూడా కనబడేది ఆవైరసుల ప్రొటీను శరీరమే. లోపల వుండే న్యూక్లెయిక్ ఆమ్లము ఆ వైరసు గుణధర్మాల్ని నిర్ణయిస్తుంది. పొగాకుమీద దండెత్తే వైరసుకూ మనిషికి రోగముతెచ్చే వైరసుకూ ఈ న్యూక్లెయిక్కు ఆమ్లమే భేదము. జీవపదార్థము అన్నదిఏఅంగమునకు చెందేదైనా,కణములు(Cells)గా వుంటుంది. జీవకణము అన్నదానిలో సైటోప్లాజమ్ అనే ముద్ద, కేంద్రకము అనే నడిమి చుక్కా తప్పకుండా వుంటాయి. జంతువుల జీవకణములకు సైటోప్లాజమ్ చుట్టూ పల్చని కవచముంటుంది. వైరసుకుకూడా న్యూక్లెయిక్ ఆమ్లమూ ప్రొటీను కవచమూ ఉంటుంది. ఈ కవచము జీవకణ కవచమునకు అంటుకుని వైరసు యొక్క న్యూక్లెయిక్ ఆమ్లము మాత్రము జీవకణములోనికి ఎక్కించబడుతుంది. జీవకణము బలహీనమైతే ఆ కణము యొక్క ప్రొటీను కవచము భిన్నమై కొత్త వైరసులు పుట్టి ఈ నాశనమును విస్తరింపజేస్తాయి.

వైరసులు అతిసరళ జీవకణాలు. ఫ్రాంక్లిన్, విలియమ్స్ అనే అమెరికను వైజ్ఞానికులు 1955లో పొగాకు మచ్చలలోని వైరసులను రాసాయనికముగా ప్రొటీను కవచమూ, న్యూక్లెయిక్ ఆమ్లమూగా విడగొట్టారు. అంటే ఒక గొట్టములో న్యూక్లెయిక్ ఆమ్ల ద్రావణమూ, ఇంకొకగొట్టములో ప్రొటీను ద్రావణముగా విడతీశారన్నమాట. ఈరెండు రెండుద్రావణాలూ వేరేవేరే జీవచిహ్నాలు ఏమీన్నీ కనపరచలేదు. అనగా పొగాకుదళాలమీద అవి వృద్ధి కాలేదూ, పొగాకుకి మచ్చల వ్యాధిని పెంచనూలేదు. అయితే,ఈరెంటినీ కలిపినప్పుడు ప్రొటీనులు న్యూక్లెయిక్ ఆమ్ల అంగములను పరివేష్టించాయీ కొన్నాళ్లకు పొగాకు వైరసులు తయారయి పోయాయి. ఈ వైరసులు పొగాకుకి మచ్చలవ్యాధి కలిగించాయీ వంశవృద్ధీ చేసుకున్నాయి.

వైరసులు గాజుగొట్టములో ఉన్నప్పుడు వంశవృద్ధి చేసుకోలేవు. స్ఫటికాలలాగే మెదలకుండా వుంటాయి. అయితే, పొగాకులాంటి జీవపదార్థము మీద ఉన్నప్పుడు అవి వంశాభివృద్ధి చేసుకుంటాయి.పొగాకు మచ్చల వైరసును ప్రొటీనూ న్యూక్లెయిక్ ఆమ్లముగా విడదీసినప్పుడు, ఆరెండింటిలో దేనికది పొగాకుమీద పెరగలేదు. రెండూ కలిపితే జీవలక్షణము— వంశవృద్ధి— కనబడింది. రెండింటినీ కలపడము మనము గొట్టాలలో చేశాము. అంటే జీవమును సృష్టి చేసినా మన్నమాటకదా?



వైరసుయొక్క రెండుభాగాలనూ మనము సృష్టించిన దెక్కడా? 'వాటిని రెండింటినీ రసాయన మిశ్రమమువల్ల తయారుచేసి, అలాటివాటినికలిపి, వైరసును నిర్మించినప్పుడు కదా జీవమును గాజుగొట్టములో సృష్టించినట్టూ?' అన్నప్రశ్న పుట్టవచ్చును. నిజమే ప్రొటీనూ న్యూక్లెయిక్ ఆమ్లమూ అన్న రసాయనములను వేరేవేరే రాసాయనికంగా నిర్మించి ఆరెంటినీ కలిపినందువల్ల జీవపదార్థము— వంశాభివృద్ధిచేసుకోగలిగినట్టిది—తయారైతే, అప్పుడు 'జీవమును తయారు చేశాము'అని చెప్పుకోవచ్చు. ప్రొటీను అణువునూ న్యూక్లెయిక్ ఆమ్లపు అణువునూ రసాయనికంగా విశ్లేషించి వాటి నిర్మాణము ఈరీతిగా వుంటుందని నిర్ణయించారు. ఇకపెద్ద ఎత్తున అనిర్మాణాన్ని ప్రయోగశాలలో చేసే యత్నము జరుగుతుంది. ముందుముందు ప్రొటీనునూ న్యూక్లెయిక్ ఆమ్లమూ నిర్మిస్తారు. విన్నమొన్న ఇన్సులీనును నిర్మించారని వినలేదా మనము?

అయితే ఒక్కజీవకణాన్ని నిర్మించడముతో అయ్యేదేమిటీ? జంతుసృష్టికి మూలాధారమగు శుక్ర శోణిత కణములను సృష్టిస్తేకదా జీవసృష్టి చేసినట్టూ? ఆరెంటినీ శరీరాలనుండి విడదీసి, కృతక వాతావరణములో వాటిని చేర్చి, అవి పిండముగా వృద్ధిఅయేటట్టు చేయడము ఒకపార్శ్యము లోనూ, వాటినే వేరువేరుగా నిర్మించే యత్నము ఇంకొకపక్క జరుగుతుంది. రాసాయనికులు జయింపి తీరుతారు.

భూమి మీదకు అసలు జీవము ఎలాగ ఆవిర్భవించింది? అన్న ప్రశ్నకు వైజ్ఞానికులు జవాబు ఆలోచిస్తున్నారు. ఆవిరిగా ద్రవముగా ఘనపదార్థముగా ఖగోళాలు—ముఖ్యంగా మన భూమి—ఏర్పడేదశలో ఎలాగో పుట్టింది జీవము. జీవంలోనివి—యామినో ఆమ్లములుండే ప్రొటీనూ, న్యూక్లియో టైడ్లుండే న్యూక్లెయిక్ ఆమ్లమూ అన్నవి మన భూమి యేర్పడే పరిస్థితులలోనే ఎట్లు ఏర్పడినవి? అది ప్రశ్న.

యురే విజ్ఞాని ప్రోద్బలంవల్ల స్టాన్లీమిల్లర్, హైడ్రోజనూ, మిథేనూ, అమ్మోనియా, నీటిఆవిరి మిశ్రమాలలో నుంచి మందముగా విద్యుదుత్సర్గము (Electric Discharge) లను పంపేడు చాలా రోజులపాటు. 'మందపు ఉత్సర్గాలు ఏలానే' అంటే, ఏర్పడ్డ అణువులు విరిగిపోకుండానూ. ఆమిశ్రమాన్ని పరిశీలిస్తే యామినో ఆమ్లములు ఏర్పడ్డట్టు తేలింది. అయితే న్యూక్లెటాయిడ్లో? వాటిల్లో భాస్వరముంటుంది. భాస్వరపరమాణువులు ఏర్పడాలంటే అత్యుచ్చ ఉష్ణోగ్రతలు అవసరము. ఇవి ఎక్కడ నుంచి రావాలా? సముద్రాంతర అగ్నిపర్వతాల విస్ఫోటనమని ఒకరు. ఇవి ఇంకా తేల్చవలసి యున్నది.

సీరియల్

తేజోవతి

జరిగిన కథ

యస్. యస్. యల్. సి. పరీక్షల్లో వేణు కాపీలు పట్టుకుంటాడు శంకరం మేష్టారు. శంకరం గారి మంచితనాన్ని గ్రహించిన వేణు అక్కయ్య జ్యోతి వేణుని శంకరంగారి దగ్గరకి ట్యూషనుకు పంపిస్తుంది. జ్యోతి, బావ ఆనందరావును వివాహం చేసుకోబోతుంది. కారణం లేకుండానే శంకరానికి వారిద్దరూ ప్రత్యర్థిగా తయారవుతారు. ఆనందరావు, తమ్ముడు రంగడికి విద్యాబుద్ధులు గరపాలనే వుద్దేశంతో తనదగ్గరకు రప్పిస్తాడు. వేణూను గౌరవంగా పెట్టిన శంకరంమాష్టార్ని సత్కరిస్తుంది జ్యోతి. మరోసారి ఆతని మంచి తనాన్ని తెలుసుకుంటుంది. వేణూ పూర్వ్లోపిల్లలందరికీ నాయకుడయ్యాడు.

11

వేణు గుంటూరు చేరేసరికి బాగా చీకటి పడింది. బస్సుస్టాండునుంచీ నేరుగా స్టేషనుకు నడుగెళ్ళాడు... తీరా అక్కడికి వెళ్ళాక తెలిసింది 'బండి పావుగంట లేటని'... రైల్వే డిపార్టుమెంటు మీద అప్పుడొచ్చినంత కోపం మున్నెన్నడూ రాలేదు వేణుకు ...అక్కడ రిజల్ట్సు పేపరుకోసం చేరిన వేణు ఫ్రెండ్స్, యింకా మరికొందరు, అంతాచేసి ఆలస్యంగా వస్తున్న ఆ బండిని దానికి కారకులైన రైల్వేవారిని తిట్టుకుంటూ కూచున్నారు. ఇక కొద్దిసేపట్లో బండి వస్తుందనగా 'ప్లాటుఫారం మీద నిలబడతాం' అని బయలుదేరారు అక్కడున్న పిల్లలు...'ప్లాట్‌ఫారం టికెట్‌లేందే లోపలికి వెళ్ళడానికి వీల్లేదని' అని టి. సి. అటకాయించాడు గేటుదగ్గర.

వేణు ముందుకొచ్చి, 'ఈ బండిలో రిజల్ట్సు పేపర్లు వస్తాయి. పేపరు కొనుక్కుని వచ్చేస్తాము...అంతే......మావాళ్ళ సైకిల్సుగూడా యిక్కడే వున్నయి చూడండి. మావాళ్ళలో చాలామంది పేపరుకొనుక్కోటానికే డబ్బు తెచ్చుకున్నారుట...డబ్బులున్నవాళ్ళం మేము ప్లాట్‌ఫారం టికెట్లు కొనుక్కున్నాం చూడండి ... మిగతావాళ్ళను గూడా పాపం లోపలకు రానివ్వండి...మేము ఏగొడవా చెయ్యకుండా పేపరు కొనుక్కుని వెళ్ళిపోతాం...' అంటూ చాలాసేపు బతిమాలాడు వేణు టి. సి. ని.

'అదేంలేదు....మిస్టర్ !...టికెట్లున్నవాళ్లను మాత్రమే పోనిస్తాం. లేనివాళ్ళు పోవడానికి వీల్లేదు...కావాలంటే పేపర్లు మీరు కొనితెచ్చి పెట్టండి...లేదా...... పేపర్లు తర్వాత బయటకు తెచ్చి అమ్ముతారు...అప్పటిదాకా ఆగమనండి...' అని ఖండితంగా చెప్పేశాడు టి. సి.

అసలే రైలు లేటని మండిపడి పోతున్న పిల్లలకు యిది అగ్నిలో ఆజ్యం పోసినట్లయింది. ప్లాటుఫారందాకా వచ్చిన పేపర్లు బయటకు రావనికాదు...రిజల్ట్సు తెలియవనీకాదు...కానీ అదో ఆత్రుత. అలా పేపరు వచ్చీరాగానే అందర్నీ తోసుకుంటూ వెళ్ళి పేపరు సంపాదించి చూసుకుంటే అదో తృప్తి, ఆనందమూ ... అసమయంలో వేచి వుండడమనేది విద్యార్థులకు చేతగాని పని...అసలా సమయంలో టి. సి. అంత ఖండితంగా మాట్లాడకుండా వాళ్ళకు నచ్చచెప్పడానికి ప్రయత్నించివుంటే వాళ్ళు 'సరే' నని వుండేవాళ్ళేమో...కానీ యీ రోజుల్లో యింతగా జరుగుతున్న విద్యార్థుల ఆందోళనలకు అధికారులు కూడా కొంతవరకూ కారణమే...ముందు వెనుకలు ఆలోచించని వాళ్ళవయసును దృష్టిలో పెట్టుకుని వాళ్ళతో జాగ్రత్తగా వ్యవహరించగలిగితే, దౌర్జన్య చర్యలకు దిగకుండా ఆపగల అవకాశం వుంటుంది. విద్యార్థులతో వ్యవహరించవలసి వచ్చినప్పుడు చూపించవలసింది తర్కమూ, అధికారబలమూకాదు, పరిస్థితిని అదుపులో పెట్టుకోగల ఓర్పు, చాకచక్యమూను. కానీ దురదృష్టవశాత్తూ అలాంటి నేర్పును యీ రోజుల్లో అధికారులు చూపుతున్నది బహు కొద్దిమంది మాత్రమే..

'అయితే— టిక్కెట్లులేని వాళ్ళను పోనివ్వరన్నమాట !...' వేణు ఆఖరుసారిగా మళ్ళీ ఒక్కసారి అడిగాడు...

'ఎన్నిసార్లు చెప్పాలి?...వెళ్ళనివ్వరు!?...' అన్నాడు విసుగ్గా టి. సి...

'ఎందుకు వెళ్ళనివ్వరో మేము చూస్తాం...' గుంపులోనుండి ఒక విద్యార్థి అన్నాడు.

'ఎలా వెళ్ళగలుగుతారో మేమూ చూస్తాను...' అన్నాడు ఆగ్రహోదగ్రుడైన టి. సి....

అన్నేళ్ళ జీవితానుభవం తర్వాతకూడా పెద్దలు చూపలేని నిగ్రహాన్ని, అందులోనూ పొంగే పాలలాంటి వయసులో వున్నవాళ్ళు చూపిస్తారని ఆశించడంలో అర్థంలేదు... 'అరేయ్! ... పదండిరా...' అన్నాడు వేణు వెనక్కు తిరిగి విద్యార్థుల నుద్దేశించి.

అతడలా అనడమే తరువాయి పిల్లలందరూ. 'హా' అంటూ టి. సి.ని నెట్టుకుని లోపలికి వెళ్ళారు... అంతటితో ఆగక స్టేషనులో నానాభీభత్సమూ చెయ్యడానికి పూనుకొన్నారు...పరిస్థితి చెయిదాటి పోతోందని గ్రహించిన, మరో అనుభవం జీర్ణించుకున్న అధికారి గబగబా బయటికొచ్చి, 'ముందు నే చెప్పేమాట ఒకటి వినండి... తర్వాత మీ యిష్టం వచ్చినట్లు చేయవచ్చు....' అన్నాడు... ఏం చెబుతాడోనని ఆగారు విద్యార్థులంతా...

'ఈ దేశం మన దేశం...ఈ స్టేషను యిందులోని ప్రతి వస్తువూ ఒక్క రైల్వే వారివే కావు ... ఇవి మీవి, మావి కూడాను...అంటే మనవి. ఈరోజు ఆవేశంలో మన ఆస్తిని ధ్వంసం చేసుకున్నట్లు కాదు...రేపు మళ్ళీ మనమే కట్టుకోవాలి... మళ్ళీ పన్నుల రూపంలో మీ దగ్గర నుంచే వసూలు చేస్తారు ... ఆగ్రహంతో ధ్వంసం చేసుకున్న వాటిని, మళ్ళీ కట్టుకోగలమన్న ధైర్యం మీకుంటే, మీ యిష్టం, వాటిని ధ్వంసం చెయ్యండి ... మేమంతా

చూస్తూ నిలబడతాం...' అంటూ చిన్న ఉపన్యాసం, పిల్లలకు నచ్చేలా చెప్పాడు... అంతే విద్యార్థుల ఆవేశం తగ్గి, ఆలోచన పనిచెయ్యడం ప్రారంభించింది. ఆయన చెప్పింది నిజమేనని కాస్త వెనక్కు తగ్గారు. ఇంతలో బండి రావడం, పిల్లలు పేపరు కోసం ఎగబడ్డంలో ఆ విషయమే మర్చారు... వేణు కష్టపడి పేపరు సంపాదించాడు...తీరా పేపరు తెరిచేసరికి అతడి చేతులు వణుకుతున్నాయి...అసలు కష్టపడి చదివిన వాళ్ళకే ఎక్కువ ఆదుర్దా వుంటుంది కాబోలు!... చదవని వాళ్ళే నిశ్చింతగా వుంటారు. వేణుకు ఒక పట్టాన తన నెంబరు గుర్తు రాలేదు. ఆ హడావుడిలో...నెంబరు జ్ఞాపకం వచ్చి ఆదరాబాదరా వెతికి, 'నా నెంబరు... నా నెంబరు లేదురా...' అన్నాడు రుద్ధమైన కంఠంతో. అతడి కళ్ళు చలికిల బడ్డాయి. కళ్ళల్లో కన్నీటి పొరలు కమ్మేసనయి...

'పేపరు చూస్తున్న మరో అతడు... 'నువ్వు చూపింది కృష్ణా జిల్లారా... గుంటూరుజిల్లా చూడు...' అని మందలించే సరికి, మళ్ళీ వెతికాడు వేణు... 'ఒరేయ్! పాసయ్యానురోయ్...' అంటూ ఎగిరి ఒక్క గంతేసి యింటివైపు పరుగు ప్రారంభించాడు.

'అమ్మా!...నే పాసయ్యాను...' అంటూ రొప్పుతూ, రోజుతూ, ఆయాసపడూ పేపరుతో సహా ప్రత్యక్షమైన కొడుకును చూసి జానకమ్మగారు ఆశ్చర్య పోయింది.

'ఎప్పుడొచ్చావ్!... ఎందుకొచ్చావ్! ... పెట్టెబెడ్డింగ్ ఏది?...' అని అడుగుతున్న తల్లి ప్రశ్నలకు, 'శంకరం మేష్టారితో చెప్పి వస్తా'నని మాత్రం జవాబిచ్చి యింట్లో సైకిలు తీసుకుని బయలుదేరాడు.

వేణు వెళ్ళేసరికి శంకరంగారు వీధి వాకిలికి తాళం వెయబోతున్నారు.

'మేష్టారూ!... నేను పాసయ్యానండీ...' సైకిలు స్టాండువేసి పేపరు చేతికిచ్చాడు వేణు సంతోషంగా...

'ఓహో!...చాలాసంతోషం వేణూ!...' అన్నారు శంకరంగారు. మబ్బులు కమ్మిన ఆకాశంలో మెరుపు మెరిసినట్లు ఆయన విషణ్ణవదనంలో సంతోషపురేఖ వెలిగింది.. పేపరందుకుని చూస్తూ, 'చాలా సంతోషం వేణూ!...ఇకముందు కూడా యిలాగే అపజయమనేది లేకుండా కృతార్థుడవవాలి!...' అన్నారు దీవిస్తూ.

వేణుకు సంతోషంతో మాటలు పెగల్లేదు.

శంకరంగారు వేణుకు పేపరిచ్చి మౌనంగా తాళం వేస్తున్నారు...తనవెంతో అభినందిస్తారని, తనను పార్టీయిమ్మని, ఏకాలేజీలో చేరతావని, చాలాచాలా ప్రశ్నలు వేస్తారని అనుకునివచ్చిన వేణుకు, శంకరంగారు ఒక్క మాట మాత్రం అని మౌనంగా వూరుకోడం బాధ కలిగించింది... 'తాళం వేస్తున్నారు! పార్వతిగారు లేరా?...ఆవిడకు చెప్పాలను



పూర్వాసంధ్యా ప్రవర్తతే...

చున్నాను.' అన్నాడు.

'ఎవ్వరూ లేరోయ్...' శంకరంగారి స్వరంలో విషాదం పలికింది. ఎప్పుడూ వుండే చిరునవ్వుకు బదులు ఆయన మొఖంలో విచారపు ఛాయలు కన్పించాయి.

'అంతా హాస్పిటల్లో వున్నారు వేణూ... మా బాబుకు ఒంట్లో బాగుండకపోతే హాస్పిటల్లో చేర్పించాం' అన్నారు.

'ఎవరికి!...రఘు బాబుకా?...' అన్నాడు వేణు నివ్వెరపోతూ...అతడి వుత్సాహమంతా చప్పబడి పోయింది.

'ఆఁ...రఘువాళే...' అన్నారు. ఆ పైన యింక మాట్లాడలేకపోయ్యారాయన. ఇంతలో ఏదో ఆలోచనరాగా, 'వేణూ!...ఏమీ అనుకోనంటే ఒక్క సాయం అడుగుతానోయ్ ...నీదగ్గర ఒక్క వందరూపాయలుంటే సర్దగలవా?...హాస్పిటల్లో ఏవో కొన్ని బాకీలు వాళ్లదగ్గర అయిపోయినవట... త్వరగా కొనుక్కొచ్చుకుంటే వాడతా మన్నారు...' అన్నారు అడగలేక అడుగుతూ శంకరంగారు.

'ఓ...అలాగే...' నన్న వేణు సైకిలు మీద సరాసరి యిల్లు చేరుకుని, 'అమ్మా! ఒకవంద రూపాయలు...వంద రూపాయలు కావాలిట అర్జంటుగా మా మేష్టారికి....' అని అడిగాడు...

'ఎందుకురా...ఏం జరిగింది?...' అని అడుగుతున్న తల్లికి జవాబు చెప్పకుండా బీరువా తాళం చెవులు తీసుకుని, అందులో వందరూపాయలు తీసుకుని, మళ్లీ తాళం కూడా వెయ్యకుండా మేష్టారికి ఎదురెళ్లి యిచ్చి వచ్చాడు.

'థాంక్స్ వేణూ!...' అని అది అందుకుని గబగబా వెళ్లిపోయ్యారు శంకరంగారు... అలా యిస్తున్నప్పుడే మేష్టారి మొఖంలో మెరిసిన కృతజ్ఞతను చూసి వేణుకు ఓ విధమైన సంతృప్తితో బాటు కించిత్గర్వం కూడా కలిగింది...'అసలు పాసయినప్పుడు తీసుకోవచ్చులే అనే వుద్దేశంతోనే అప్పుడు వద్దన్నాడేమోనన్న ఆలోచనకూడా పోయింది వేణుకు. తర్వాత తన ఫ్రెండ్సును కల్సుకో డానికి వెళ్లిపోయ్యాడు వేణు.

మర్నాడు పొద్దున్నే ఫస్టు బస్సుకి వెళ్లిపోయ్యాడు వేణు. జ్యోతి వేణుకు అని వందిస్తూ, 'అంతా ఆ కాలం మేష్టారి చలవరా...' అంది.

'అక్కా!...ఆ రోజు మనమిస్తామంటే వద్దన్నారా...నిన్న నన్ను అడిగి మరీ తీసుకున్నారు మేష్టారు, వాళ్ళ బాబుకు ఒంట్లో బాగుళ్లేదని!'

'అరె!...వాళ్ళ బాబుకి ఒంట్లో బాగు ల్లేదా?...నువ్వు చూసి రాలేదురా వేణూ?...' అని ఆదుర్దాగా అడిగింది జ్యోతి.

'నే చూడలేదక్కా... అయినా ఏముంటుంది?... జలుబో, జ్వరమో, అయ్యుంటుంది...' అన్న వేణు మాటకు

'వెళ్ళి చూసి వుండాల్సిందిరా పాపం... ఎంత యిచ్చినా ఆయన ఋణం మనం తీర్చుకోలేమురా...' అంది జ్యోతి.

వేణు జవాబు చెప్పలేదు. ఇంతలో అతడి మిత్ర బృందమంతా వచ్చారు వేణు పాసయ్యాడని విని ... జ్యోతి అప్పటికప్పుడు అందరికి కాఫీటిఫినూ చేసి యిచ్చింది ... వేణుకు మహదానందంగా వుంది...తను ఆరు నెలల్లో కాలేజీలో చేరబోతున్నాడు!...రెండు రోజుల తర్వాత నాటకం. ఆనందరావు వూరి వెలుపలగా స్టేజీ అదీ వేయించి పెద్ద బ్రహ్మాండంగా ఏర్పాట్లు చేయించాడు...

నాటకం రసవత్తరంగా సాగిపోతోంది. ఆనందరావు 'గ్రీన్ రూం'లో వున్నాడు... కొంచెం సేపయ్యాక ఈలలు, 'వన్స్ మోర్' అంటూ కేకలు, గోలా విన్పించింది... ఆ తర్వాత చిన్న చిన్న మట్టిపెళ్ళలు ఒకటే అరా పెద్ద రాళ్ళూ కూడా స్టేజిమీద పడ్డం ప్రారంభమైంది. ప్రేక్షకుల్లోంచి 'కూర్చో, కూర్చో' మన్న కేకలు, అలజడి...

మధ్యలో డ్రామా ఆగిపోయింది. ప్రేక్షకులు వాళ్ళల్లో వాళ్ళు ఘర్షణ పడుతున్నారు. ఈ సంగతి ఆనందరావుకు తెలిసి అతడు పరుగెత్తుకుంటూ వచ్చేసరికి ఎక్కడి వాళ్ళక్కడ చెల్లాచెదరయ్యారు. అంతకూ ప్రతిపక్షం వాళ్లెవరూ రాకుండా అన్ని కట్టుదిట్టాలు చేసుకుంటే యీ అలజడి ఎవరు చేశారన్న విషయం ఆనందరావుకు అంతుబట్టలేదు. అది ఓ సవాలులా అనిపించింది ఆనందరావుకు. మళ్ళీ నాటకం కొనసాగించాలన్న వుత్సాహం పిల్లలకూ లేక పోయింది, అంతకంటె ఆనందరావుకూ లేక పోయింది! వేణు ఎంత వుత్సాహంగా, ఎంత వుబలాటంతో నాటకం వెయ్యాలనుకున్నాడో అంత నిరుత్సాహ పడిపోయ్యాడు... ఇక ఆ వూళ్లో వుండ బుద్ధిపుట్టలేదు...మర్నాడే వూరికి బయలుదేరాడు వేణు.

వేణు యింటికి రాగానే, 'మా మేష్టారి అబ్బాయికి ఒంట్లో బావుళ్లేదన్నావ్, ఎలా వుందో కనుక్కురారా...' అన్నది జానకమ్మ గారు.

ఈ రెండు రోజుల నుంచీ వేణు బాబు సంగతే మర్చిపోయ్యాడు. తల్లి గుర్తు చెయ్యగానే శంకరంగారి యింటికి బయలు దేరాడు. వేణుకు బాబు అంటే నిజంగా ప్రాణం. మేష్టారు చూడకుండా చాక్లెట్లు బిళ్లలూ అవి కొనుక్కువచ్చి పెడుతుండే వాడు...తనతోబాటు అప్పుడప్పుడూ షికారు కూడా తీసుకు వెళ్తుండేవాడు. ఆనాడు రిజల్ట్సు తెలిసిన సంబరంలో ఆ విషయం ఆటే పట్టించుకోలేదుగానీ యివ్వాళ నిజంగానే ఆదుర్దా కలిగింది...

శంకరం మేష్టారు వాకిట్లో వేదుకొని వున్నారు మౌనంగా. ఆ యింటిని చూడగానే వేణు గుండెలు దడదడ లాడాయి ఎందుకో...మేష్టారిని పలుకరించకుండానే లోపలికి వెళ్లాడు...ఇల్లంతా ఏదో వెలితిగా, చిన్నబోయినట్లుగావుంది వేణుకు...ముందు గదిలో గుమ్మాని కానుకుని శోకమూర్తిలా కూర్చునివుంది పార్వతి. వేణుకు భయం వేసింది. భయం భయంగానే యింటి నాలుగు మూలలా వెతికాడు బాబు కోసం... ఎక్కడా కనిపించలేదు.. ఏమడగాలో తోచక ఎదురుగా వున్న పార్వతివైపు చూశాడు ప్రశ్నార్థకంగా.

'అంతా అయిపోయింది వేణూ!... మూడురోజులు కూడా అయిపోయ్యాయి...' అంటుంటే పార్వతి పెద్దపెద్ద కన్నుల్లో నుంచి రెండు కన్నీటి బొట్లు రాలాయి ఎంత దాచుకున్నా దాగని కడుపుకోతని సూచనా మాత్రంగా తెలుపుతూ...

వేణు నిశ్చేష్టుడయ్యాడు. అతనికి వున్నట్టుండి యిల్లంతా స్మశానంలా అనిపించి భయమేసింది. కొయ్యబొమ్మలా రెండు నిముషాలు నిలబడ్డాడు...అతడి కళ్లముందు బాబు నవ్వుతూ 'వేణూ!......పరీక్ష అయ్యాయా...మళ్లీ ఎప్పుడొస్తావు మా యింటికి?...' అంటూ కన్పించాడు...వేణు.

ఘూర్ణాసంధ్యా ప్రవర్తతే..

కళ్లలోని కన్నీళ్లు బొటబొట రాలాయి... ఏమి మాట్లాడాలో తోచక బరువుగా బయలుదేరుతున్న వేణును శంకరంగారు పిలిచారు...అతణ్ని వుండమని చెప్పి, ఆ లోపలికి వెళ్లివచ్చిన శంకరంగారు, మూసి వున్న వేణు పిడికిలి తెరిచి, వందరూపాయల నోటు గుప్పిట్లో పెట్టేశారు.

'అడగంగానే నువ్విచ్చావు...కానీ అప్పటికే సమయం మించి పోయింది వేణూ...' అన్నారు గద్గద కంఠంతో...ఆయన కళ్లు అశ్రుసిక్తాలయ్యాయి. బరువుగా నిట్టూర్చి వెళ్లి కుర్చీలో పడుకున్నారు......వేణుకు నోటు పట్టుకున్న ఆ చెయ్యి బరువుగా, మనసే బరువుగా, తను మొయ్యలేనంత బరువుగా వున్నట్లనిపించింది. 'ఫర్వాలేదు.... వుంచండి.' అందామనుకున్న మాటలు గొంతుకలోనే ఆగిపొయ్యాయి. ఓ నిముషం స్థాణువులా అలాగే నిలబడి, చివరికి అక్కడ ఆయన ముందు నిలబడ్డానికి సిగ్గేసి మెల్లిగా ఒక్కోఅడుగూ వేసుకుంటూ యిల్లు చేరుకున్నాడు...

ఈ సంఘటన వేణును రెండువిధాలుగా బాధిస్తోంది. శంకరం మేష్టారు తనను డబ్బు అడగంగానే తనకు కలిగిన అభిప్రాయానికి ఓతట్టు సిగ్గు పడిపోతూ, ఆ విధంగా భావించినందుకు తన్ను తను తిట్టుకుంటున్నాడు...ఇంకోవైపు బాబు జ్ఞాపకాలు వేధిస్తున్నాయి వేణును. మనసును చిత్రవధచేసే యీ రెంటిమధ్య సతమతమవుతూ ఎప్పటికోగాని నిద్రపోలేదు వేణు ఆరాత్రి...

* * *

'అసలు రఘుబాబు చచ్చిపోవలసింది కాదు వేణూ!...' అన్నాడు భోజనం చేస్తూ రామం.

రామం అంటే వారాలు చేసుకుని చదువుకునే కుర్రాడు. వాళ్ళ యిల్లు కూడా శంకరంగారి యింటి దగ్గర్లోనే... తండ్రి తాగుబోతు. అతడి సంపాదన అతడి తాగుడుకే చాలదు. ఇక పిల్లల్ని ఏం చదివించ గలడు? పిల్లలందరూ మంచి తెలివిగలవాళ్ళు. వాళ్లల్లో రామం పెద్దవాడు. ఈఏడే ఎస్సెల్సీకి వచ్చాడు. చందాలు పోగుచేసి జీతం కట్టుకుంటాడు. శంకరంగారి యింట్లోనే కూర్చుని చదువుకుంటుంటాడు. శంకరం మేష్టారే వేణుతో చెప్పి వాళ్ళింట్లో వారం యిప్పించాడు.

పాపం అన్నదానికి వేణు తల ఆడించి వూరుకున్నాడు. నిజమే!...బాబు చనిపోవల్సిన వయస్సా అది? అనుకున్నాడు ... బాబును తల్చుకున్నప్పుడల్లా వేణు కళ్ళు చెమరుస్తూనే వుంటయి...బాబు జ్ఞాపకం రాగానే అన్నం సయించక కంచంలో కెలుకుతూ కూర్చున్నాడు. అతడి మనసులో మాత్రం...దేముడు దేముడంటారు...తప్పు చేసిన వాళ్ళను శిక్షిస్తాడంటారు?... మరి బాబు ఏం తప్పు చేశాడని చంపేశాడు ఆ దేముడు?...అదే ఆలోచన కలిగింది...

తను అన్నదానికి వేణు జవాబు చెప్పక పొయ్యేసరికి మళ్లీ రామం ... 'నిజం వేణూ!... ఒక విధంగా చూస్తే బాబు చావడానికి వరదరాజులుగారు కారణం...' అని ఆగారు......

'వరదరాజులుగారికి దీనితో ఏం సంబంధం?...' వేణు ఆశ్చర్యంతో ప్రశ్నించాడు...

'ఆరోజు నా వారం వరదరాజులుగారింట్లో వేణూ. భోజనం చేస్తుండగా వరదరాజులు మేష్టార్ని పిలిచి ట్యూషను పిల్లలు డబ్బు యిచ్చి వెళ్లారు... 'రెండొందలు వచ్చాయి.... 'బట్టలు తీసుకోవచ్చులే పిల్లలకు' అని వరదరాజులుగారు భార్యతో చెప్పడం నా చెవులారా విన్నాను... ఆ తర్వాత సాయంత్రం నేను శంకరం మేష్టారింటికి వచ్చేసరికి ఆయన దిగాలుపడి కుర్చీలో వున్నారు... 'ఎందుకలా వున్నారని' ధైర్యం చేసి అడిగాను ... 'హాస్పిటల్లో ఏవో మందులు రాసిచ్చారు ... ఎంత త్వరగా కొనుక్కు వస్తే అంత మంచిదన్నారు. నాలుగ్గంటల నుంచీ తిరుగుతున్నాను ... ఎక్కడా డబ్బు చిక్కలేదు రామం' అని చెప్పారాయన. నాకు వెంటనే వరదరాజులు గారు జ్ఞాపకం వచ్చారు... 'వెళ్ళి ఆయన్ను అడగండి' అని చెప్పాను... 'ఆయన దగ్గర మాత్రం ఎలా వుంటుందని' మేష్టారు సందేహిస్తే నేను జరిగిందంతా చెప్పి, ఆయన దగ్గర వుంది వెళ్ళి అడగండని' అన్నాను. 'ఆలస్యమైతే డాక్టర్లు లాభం లేదన్నారని' బాధపడుతూ, బిడియపడుతూనే వరదరాజులు గారింటికి వెళ్లారు ... అప్పుడు నేనూ అక్కడే వున్నాను రాత్రి భోజనానికని. పాపం బిడియపడుతూనే అడిగారు 'ఒక్క వంద రూపాయలుంటే అప్పు యివ్వండి. జీతాలు అందగానే ముందు మీ అప్పు తీర్చేస్తాను.' అని కూడా ప్రాధేయపూర్వకంగా అడిగాడు...

కానీ ఆ వరదరాజులుగారు 'నా దగ్గర లేదని నిర్మొహమాటంగా చెప్పేశాడు... వీళ్ళందరికోసమే కుప్పపోసుకు కూర్చున్నాం!...' అన్న మాటలు, మేష్టారు తిరిగి వచ్చేశాక ఆయనన్నమాటలు వింటుంటే నాకావూట వాళ్లింట్లో అన్నం సయించలేదు...మళ్ళీ ఆవారం వాళ్ళింటికి వెళ్ళ బుద్ధిపుట్టలేదు...నిజంగా మేష్టారు అడగంగానే వరదరాజులుగారు అప్పు యిచ్చుంటే బాబు తప్పక బ్రతికుండేవాడు. ఆ తర్వాత ఎంతోసేపు ఎక్కడెక్కడో ప్రయత్నించి లాభంలేక యింటికి తిరిగివచ్చి బాబుని వేసుకు ఆస్పత్రికి పోబోతుంటే నువ్వువచ్చి యిచ్చావుట.. మేష్టారు ఎన్నిసార్లో అనుకున్నారు... 'పాపం వేణు అడగంగానే పరుగెత్తుకుంటూ వెళ్లితెచ్చిచ్చాడు. అతడి శ్రమ కూడా నిరుపయోగమైందని...' అని చెప్పి ముగించాడు రామం బరువుగా నిట్టూరుస్తూ. ఆ విషయం వేణుతో చెప్పాక గానీ అతడి మనసు తేలికపడ్డట్టు అనిపించలేదు...

వేణు మనసులో ఏ మల్లకల్లోలం రేగుతున్నదో, ఏ నిశ్చయానికి వచ్చాడో చెప్పలేముగానీ గంభీరంగా మాత్రం ఆలోచిస్తున్నాడు...

అసలు కొందరి మనస్తత్వాలు చిత్రంగా వుంటయి. వాళ్లకు ఓ పట్టాన ఎవరిమీదా గురి కుదరదు. అలా కుదిరింది అంటే యిక హరిహర బ్రహ్మరుద్రాదులు వచ్చినా దాన్ని మార్చలేరు సరికదా, యిక వాళ్లకు వచ్చిన ఏ కష్టంగానీ సుఖంగానీ తమదిలా భావించుకుంటారు...వేణు మనస్తత్వమూ అలాంటిదే...

ఆ రోజంతా వేణు ఆలోచిస్తున్నాడు: రాత్రి చీకటి పడేవేళకు ఓ నిశ్చయానికి వచ్చినవాడిలా వెళ్లి తన మిత్రుల నందర్నీ కలుసుకుని మాట్లాడి వచ్చాడు...ఈ మధ్య అసలు వేణుకు తన 'బాచి'వాళ్ళతో అవసరమే కలుగలేదు. ఇంచుమించు వాళ్ళను మర్చిపొయ్యాడు. వాళ్లందరూ కల్సి చాలా

FAMINE RELIEF FUND : Rs. 1000

FIRST PRIZE Rs. 12500

1st ANNIVERSARY OFFER LITQUIZ No. 18

TRANSISTOR FOR EVERY MINIQUIZ ALL CORRECT WINNER

Rs. 25,000

+ RUNNERS-UP UPTO 4 ERRORS
MINIQUIZ UPTO 2 ERRORS

THESE WINNERS WILL SHARE THE BALANCE PROPORTIONATELY

Official Entry Form of Litquiz No. 18

LITQUIZNo.18,ALANKAR,BALARAM ST. BOMBAY-7 (WB)
Note:—(1) Strike out with ink in each column the word you have rejected. (2) Cancel the second coupon if you send only one coupon. (3) If you send Entry fee by M O. you MUST enclose with this Entry Form the M.O. Receipt you get from post office. Entries without M.O. Receipt will be disqualified. (4) Do not Cross I. P. O. Make it payable to Litquiz No. 18 at Bombay.7.

1	Re. 1		2	Re. 1	
1	ACTIVE	SENSITIVE	1	ACTIVE	SENSITIVE
2	ACTIVELY	PASSIVELY	2	ACTIVELY	PASSIVELY
3	ART	CULTURE	3	ART	CULTURE
4	BENEFITS	SUFFERS	4	BENEFITS	SUFFERS
5	BREAK	WIFE	5	BREAK	WIFE
6	COUNTRY	DUTY	6	COUNTRY	DUTY
7	CULTURE	LITERATURE	7	CULTURE	LITERATURE
8	DEMOCRACY	SPIRITUALITY	8	DEMOCRACY	SPIRITUALITY
9	DESTINY	HISTORY	9	DESTINY	HISTORY
10	ECONOMIC	PUBLIC	10	ECONOMIC	PUBLIC
11	GENIUS	GREAT	11	GENIUS	GREAT
12	GREAT	PERFECT	12	GREAT	PERFECT
13	HAPPINESS	SUCCESS	13	HAPPINESS	SUCCESS
14	IDEALS	RELIGIONS	14	IDEALS	RELIGIONS
15	INSPIRATION	REVELATION	15	INSPIRATION	REVELATION
16	LANGUAGE	LITERATURE	16	LANGUAGE	LITERATURE
17	RATIONAL	SPIRITUAL	17	RATIONAL	SPIRITUAL

18 SEND THESE 2 COUPONS & ENTER MINIQUIZ FREE

MINIQUIZ — 10 clues FREE coupon

ACTIVE	SENSITIVE	DESTINY	HISTORY
ACTIVELY	PASSIVELY	ECONOMIC	PUBLIC
BENEFITS	SUFFERS	HAPPINESS	SUCCESS
COUNTRY	DUTY	LANGUAGE	LITERATURE
DEMOCRACY	SPIRITUALITY	RATIONAL	SPIRITUAL

18 (ASVP)

In entering this Quiz I agree to abide by the Rules & Conditions and accept Competition Editor's decision as final and legally binding. Entry fee for each one coupon is Re. 1. Entry fee for this complete Entry Form (of 2 coupons) is Rs. 2. I enclose M O. Receipt/I.P.O./ Litquiz Cash Receipt/Prize Card and its number is...

CAPITAL LETTERS

NAME ....

ADDRESS ....

....

Cut out and send this complete Form

Final Closing Date: 6-7-67
Solution in Bharat Jyoti: 9-7-67
Result in Bharat Jyoti: 23-7-67
*Send with your entries a self-addressed 6 Paise post card to receive Solution immediately.
*Latest issue of Litquiz Weekly will be sent Free on request.

17 CLUES

1. Psychologically it is felt that a child is innately Active/Sensitive. 2. Under normal conditions, mind works Actively/Passively and in an un-controlled way. 3. Art/Culture makes the greatest progress and yields the best results when it is pursued in a catholic spirit and in an atmosphere of freedom. 4. If the present generation is made to sacrifice necessaries, the future generation naturaly Benefits/Suffers. 5. A good Break/Wife can make a man, a bad one can break him. 6. Devotion to Country/Duty should be harmonised with devotion to humanity. 7. Culture/Literature is, indeed, the mirror of life in all its colours and phases, in all times. 8. Democracy/Spirituality and starvation ill go together. 9. Ideas and ideals are very great determinants of human Destiny/History. 10. When men without high religious principle control a people's Economic/Public life that life goes to corrpution and ruin fast as canker kills the flower's bloom 11. Genius would not be Genius/Great if it were not unconditioned.12 He is an ignorant, imperfect man who inspires to become Great/Perfect. 13. A man must labour hard previous to attaining Happiness/Success. 14. History has offered evidence of the fact that different Ideals/Religions have influenced humanity at different stages of its development. 15 It is strange how great Inspiration/Revelation comes sometimes from matters of no moment. 16. Language/Literature grows with the thought and the dynamic living of the people. 17. An awareness that there is a divinity that shapes our ends and ends our shapes too is the beginning and end of all true Rational/Spiritual thinking

NOTE: The above clues are quotations reproduced from the works of authors and writers. They are complete sentences and are also independently complete in sense. Names of Authors/Writers and their Works will be published along with the official solution in Litquiz Weekly.

హార్యాసంధ్యా ప్రవర్తతే...

కేసు మాట్లాడుకున్నారు...

ఆ మరునాడు...

చీకటి పడిపోతోంది. ఆ రోడ్డంతా నిర్మానుష్యంగా వుంది. వరదరాజులుగారి పెద్దబ్బాయి సుబ్బులు అంతదాకా కిళ్లీ కొట్లో కూర్చుని అప్పుడే బయలుదేరాడు ఇంటికి... కడుపులో ఆత్మారాముడు అల్లరి చేస్తుంటే సుబ్బులు సైకిల్ మీద మంచి స్పీడులో వెళుతున్నాడు... సైకిల్ అడ్డ రోడ్డులోకి మలుపు తిరగబోతోంది... మలుపులో అంటే క్రాస్‌రోడ్ మలుపులో ఎవరో వున్నట్లు తోస్తే సైకిల్‌బెల్ మ్రోగించాడు సుబ్బులు...

ఎదురుగా నాలుగు సైకిల్స్‌మీద రోడ్డంతా పర్చుకున్నట్లు వస్తున్న కుర్రాళ్లు మలుపుతిరగడంతో సుబ్బులు సైకిల్‌కి 'డాష్' కొట్టారు... సుబ్బులు సైకిల్ ఒకప్రక్కకి, సుబ్బులు యింకో ప్రక్కకు పడిపోయ్యారు. సుబ్బులు ఒంటి నిండా అయిన దుమ్మును దులుపుకుంటూ, 'ఏయ్! కళ్లు కనబట్టంలా?...' అని అడిగాడు కళ్లెర్రజేసి. తను బెల్ కొట్టినా ఎదురువచ్చి 'డాష్' యిచ్చారు కావాలనే చేసినట్లున్నారు అనిపించిందతనికి..

'ఏయ్ గీయ్' అంటువ్నావ్!... ఏం తల తిరుగుతోందా? మాటలు తిన్నగా రానీ... అన్నాడు డాష్ యిచ్చిన నల్లటి పొడుగాటి యువకుడు.

'రాకపోతే ఏం చేస్తావేంటి?...'

'ఏం చేస్తానా! పళ్లురాలకొడ్తాను...'! అంటూ పైకొచ్చి సుబ్బులు చొక్కాపట్టుకున్నాడతడు.

'ఆ...' అంటూ రోషంతో పడగ తొక్కిన తాచులా చెయ్యెత్తాడు సుబ్బులు.

'పోనీండి... పోనీండి... మిస్టర్!... మీరూరుకోండి...' అంటూ మిగిలిన ముగ్గురిలో యిద్దరు సుబ్బులు చేతిని, ఒకరు ఆ నల్లటి యువకుడి చేతిని పట్టుకున్నారు, వాళ్లిద్దర్నీ విడదీయబోయినట్లు. ఆ నల్లటి యువకుడు ఒక్క విసురులో తన చెయ్యి పట్టుకున్నతడ్ని విడిపించుకుని సుబ్బుల్ని ఒక్కగుంజగుంజి ఆ చెంప యీ చెంప 'ఫెళా ఫెళా' వాయించాడు. నిజానికి సుబ్బులు పిల్లాపిట్టంతమనిషి... అయిదడుగులలోపు ఎత్తు. చామనచాయ రంగుతో సన్నగావుంటాడు వాళ్లమ్మగారిలా. అనలతడు పాతిక సంవత్సరాలు దరిదాపు వయసువాడు. మంచి దృఢకాయుడు.

ఆ దెబ్బంతో సుబ్బులుకు తలతిరిగినట్లయింది. అతడి కిలాంటివి బొత్తిగా కొత్తకాదు. అతడూ కొట్లాటల్లో తిరిగాడు. కానీ యింతటి గట్టివాళ్ళెప్పుడూ తగల్లేదు. సుబ్బులుకు కొంత కోపం వచ్చింది. ఆ నల్లటి వాళ్లనుండి చేతులు విడిపించుకుని ఆ ఎదుటివాడిమీదికి లంఘించబోయాడు. కాని వెంటనే ఆ నల్లటతడు అతడి చెయ్యి పట్టుకుని, వొంగదీసి పెడ్డతో ఒక్క గుద్దు గుద్దాడు సుబ్బుల్ని.

'అమ్మో...చచ్చాను...' అంటూ పెద్దగా కరిచాడు సుబ్బులు. ఇక జోరు పెరిగితే ప్రాణాలు దక్కవని, 'ఇంకెప్పుడూ అనను వంకి...అననండి...' అంటూ ఏడ్చేట్టు పెట్టాడు.

మళ్ళీ డొక్కలో ఒక్క తన్ను తన్నబోతున్న నల్లటతన్ని మిగతావాళ్ళు ఆపారు. 'పో!... బతికావు పో... ఇంకెప్పుడలా పిచ్చి వేషాలు వెయ్యక... మీ అయ్యతో కూడా చెప్పు జాగ్రత్తగా వుండమని ... లేకపోతే కుర్రాడు చావుబతుకుల్లో వున్నాడంటే, దగ్గరుంచుకుని డబ్బు లేవంటాడా?...' అంటూ వెళ్ళి తన సైకిల్ తీసుకుని వెళ్ళిపోయాడతడు. అతడి వెనకాలే మిగతా ముగ్గురూ కూడా నవ్వుకుంటూ వెళ్ళిపోయ్యారు.

వాళ్లు కనుచూపుమేర దాటిపోయ్యేదాకా వుండి, అప్పుడు నెమ్మదిగా లేచి దుమ్ము దులుపుకుని సైకిల్ ఎక్కబోతే వల్లకాలేదు సుబ్బులుకు. ఒళ్ళంతా పచ్చి పుండులా వుంది! మెల్లిగా సైకిల్ నడిపించుకుంటూ వస్తున్న సుబ్బులుకు అతడు ఆఖరున అన్న మాటల అర్థం ఏమిటో తెలియలేదు గానీ, యిది ఎవరో కావాలని చేయించిన పని అనిమాత్రం తెల్సుకున్నాడు.

సుబ్బులు కుంటుతూ యిల్లు చేరుకునే సరికి కమలమ్మగారు కంగారు పడింది... 'అయ్యో!... ఏమిట్రా నాయనా? ... ఏం జరిగింది?...' అంటూ గాభరా పడుతూ వచ్చి పట్టుకోబోయింది కొడుకును...

'అబ్బ!... వుండవే నీతో గొడవ' అంటూ తల్లి చేతిని విసిరికొట్టి సైకిల్ గోడకానించి సరాసరి వెళ్లి మధ్య గదిలో మంచం మీద వాలి పోయ్యాడు సుబ్బులు...

'అయ్యో!... ఏమిట్రా తండ్రీ!... మొహమంతా వాచిపోయింది ... అట్లా తూలుతున్నావ్?...' అంటూ తత్తరపడుతూ వచ్చి సుబ్బులు వొళ్ళు తాకిచూసింది కమలమ్మగారు. సుబ్బులేమీ మాట్లాడలేదు. తల్లిని చూసి యింకొంత బిగుసుకుపోయి, మాటా మంతీ లేకుండా కళ్ళు మూసుకొని ... [illegible]

కున్నాడు. అది చూసిన కమలమ్మగారికి కాళ్ళూ చేతులూ ఆడలేదు ... 'ఏమండోయ్! ... ఇటురండి... వీడు శోషొచ్చి పడిపొయ్యాడండీ...రామ!... రామ! పిల్లాడిలా పడిపోతే చీమకుట్టినట్టులేదు ఇంటాయనకు!... ఛస్తే పీడ వదులుతుందనుకున్నారు గాబోలు...' అంది పెద్దగా ... మాటలు యిల్లంతా మారుమ్రోగాయి ... ఆవిడ ఆక్రోశం శ్రుతిమించి రాగాన పడింది'...

ఇరుగుపొరుగుకు కమలమ్మగారి అభూయిత్యం పరిచితమే. కనుక ఎవ్వరూ అదిరి పడలేదు. వరదరాజులుగారు వంట యింట్లో వున్నారు భోజనంచేస్తూ ... ఆయనకు సుబ్బులు తిరుగుళ్ళు గిట్టవు...అందుకని అతడు యిల్లు చేరుకునేలోపుగా భోజనం ముగించేస్తారు...కొడుకు యింటికి రాగానే తలనొప్పనో కడుపు నొప్పనో అనడం, ఆవిడ గాభరాపడడం అడపాదడపా మామూలే ... మొదట్లో అలాగే నాటకాలు అనుకుని ఆయన పట్టించుకోలేదు. కానీ కమలమ్మగారి మాటల్లోని తీవ్రత యొక్క స్థాయిని బట్టి 'మళ్లీ ఏం కొంప మునిగిందిరా భగవంతుడా!' అనుకుంటూ తింటూ తింటున్న కంచంలో చెయ్యి కడిగేసి లేచి వచ్చారాయన... 'ఏం జరిగిందిరా నాయనా?...' అంటూ...

సుబ్బులు స్థితి చూస్తే ఆయనకూ భయంవేసింది... గబగబా వెళ్లి తడిగుడ్డ పట్టుకు వచ్చి మొహానవేసి కొడుకు పక్కలో కూచుని, 'సుబ్బులూ! ... సుబ్బులూ!... ఏమైంది నాయనా?...' తల నిమురుతూ అడిగారు.

తడి గుడ్డ మహాత్యంతో త్వరగానే తేరుకున్న సుబ్బులు, మూలుగుతూనే జరిగిందంతా చెప్పాడు తండ్రితో, 'నాన్నా! ... వాడు ఆఖరున అన్నమాటలు చూస్తే ఎవరో మనమీద కక్షగట్టి చేయించి వుంటుంది నాన్నా....' అని కూడా చెప్పాడు...

వరదరాజులుగారికి వెంటనే శంకరం వచ్చి అప్పు అడిగిన సంఘటన జ్ఞాపకం వచ్చింది. అయినా— 'తన దగ్గర డబ్బున్న సంగతి శంకరానికి తెలిసే ఆస్కారం లేదే' అనుకున్నారు మళ్లీ.. ఏది ఏమైనా యిది శంకరం పనే ... తన దగ్గర డబ్బుండి వుంటుందనుకోనుండుండాలి. లేకుంటే యీ మధ్య తన్ను అప్పు అడిగిన వాళ్ళే లేరు... పైగా ఆ శంకరం కొడుకు పొయ్యాకవి

చేయించి వుండాలి ... అనే నిశ్చయానికి వచ్చారాయన. భార్యతోనూ, కొడుకుతోనూ గూడా ఆమాటే అన్నారు...కమలమ్మగారు సుబ్బులూ కూడా ఆయన అనుమానాన్ని బలపర్చారు...

'వాడే చేయించుంటాడు......లేకుంటే మనకు విరోధులెవరున్నారు ?... వీడిచేతులు పడిపోను...ఇలాంటి పన్నకు మనపెలా నొప్పిందో?...వాడిదుంపతెగా!......పసివాడని గూడా చూడకుండా...' అంటూ మెటికలు విరిచింది కమలమ్మగారు...

'వాడే అయ్యుండాలి నాన్నా...ఆ వేణుగాడు వాడిదగ్గరే చదువుకున్నాడుగా... వాడిద్వారా చేయించుంటాడు...' అని సుబ్బులు ఖాయపర్చాడు...

'ఔరా! శంకరం!...నంగనాచిలా ఎంత పని చేశావ్?...' స్వగతంలా అనుకున్నారు వరదరాజులుగారు.

'అవును మరి అందరకా మీలా కన్న పిల్లల్ని యిూసడించుకుంటారా? అతడికి బాగా తెలుసు మీరు కొడుక్కు వత్తాసి రారని...చంపేసి పారేసినా మీరు పట్టించుకోరని...మీకు మీ కొడుకు కాబడితే, వాడి ఒంటిమీద యీగ వాలడానికి వీలుండేదా?...' అని తన ఆక్కసుఅంతా వెళ్ల బోసుకుంది కమలమ్మగారు...

'మనంమాత్రం వూరుకుంటామా?... ముప్పతిప్పలు పెట్టి మూడుచెరువుల నీళ్ళు తాగించకుండా గాజులు తొడుక్కుని కూచుంటా మనుకున్నావా?' అని వరదరాజులుగారు అన్నదానికి, 'ఆఁ మీరు, చేస్తారు మేము చూస్తాం.' అంటూ ఎత్తి పొడిచిందావిడ...

'అయితే ఏం చెయ్యమంటావో చెప్పు చూసి...' అన్నారాయన.

'వాడిద్ద వింత క్షోభపెట్టినందుకు నేను వాడినెత్తురు కళ్ళజూడాలి...' అన్నది ఒక్కటేమాటగా కమలమ్మగారు. ఆవిడది కచ్చిబోతు గుణం. ఇష్టమైతే నెత్తిన పెట్టుకుంటుంది, కష్టమైతే వాళ్ళ అంతు తేల్చేదాకా నిద్రపోదు...

వరదరాజులుగారి ఆలోచనలూ అటే పొయ్యాయి...పలుగురు రాష్ట్రాలకు పాకా పోయింది, శంకరం వచ్చేదిపటో కావలా వుంచితే...అనుకున్నారు...ఇంతలో యింకో ఆలోచనగూడా పోయింది...ఒక్కవేళ చేయించింది తనేనని పసిగట్టి, మళ్ళీ తమ ఒంటరిగా వున్నప్పుడు ఏమన్నా చేయిస్తే?...అసలే ఆ పేణాగాడంటే ఆయనకు తగనిభయం ... ఏమో కిడెంచి మేలెంచడం మంచిదిగదా...అనుకున్నారు... కానీ ఆ విషయం భార్యతో చెప్పడానికి బెంకారాయన 'చేతకానివాడు' అంటుందన్న భయంతో...

కమలమ్మగారి ఆలోచనకు సుబ్బులూ నొప్పుకోలేదు శంకరంగారు కక్షగట్టి మళ్లీ వేణుకు పురెక్కిస్తే...వేణు 'బాచి' సంగతి బాగా తెలిసింది. సుబ్బులుకూ... అందుకని వేణుతో విరోధంరాకుండా శంకరం పనిపట్టే ఆలోచన చెయ్యమని హెచ్చరించాడు...

సుబ్బులుకూడా యిలా మాట్లాడ్డంతో యిక కమలమ్మగారు ఏమీ అనలేక పోయింది...

'ఏకెందుకు నువ్వు చూస్తుండు...ఆ శంకరం నల్గురిలోనూ తలెత్తుకుండా పరువు తీస్తాను...' అంటూ శపథం పట్టారువరదరాజులుగారు... (ఇంకా వుంది)

పళ్ళు వచ్చా బాబూ?
ఏదీ చెప్పు చూదాం!



చిత్రలహరి

విశాల్ కంబయిన్స్‌వారి 'అగ్గిదొర'కు వాహినీ స్టూడియోలో ముహూర్తం అయిపోయింది. పూర్ణాపిక్చర్సు కామరాజుగారు కెమెరా స్విచాన్ చేశారు. ఇక అగ్గిదొర జానపదంనుంచి జనపథానికి రావడమే తరువాయి.

మొదటిరోజు షూటింగులో కాంతారావు, భారతి, విజయలలిత, ఛాయాదేవి, ధూళిపాళ, రాజారెడ్డి, ఎ. యల్. నారాయణ పాల్గొన్నారు. సత్యనారాయణ, బాలక్రిష్ణ, రాజబాబు, గణేశ్, పవిత్రాదేవి, పద్మాంజలి మొదలైనవారు తతిమా పాత్రల్ని నిర్వహిస్తారు.

చాలాకాలంనుంచి విఠలాచార్యగార్కి అసోసియేట్‌గా పనిచేస్తున్న బి. వి. శ్రీనివాస్ దీనికి దర్శకుడు, సంభాషణలు జి. కృష్ణమూర్తి, సంగీతం విజయ కృష్ణమూర్తి కూర్చుతున్నారు.


—సికరాజు.

'ఎందున్నావో నోప్రియా, అందుకో నా కౌగిలి' అని పాడుకుంటూ వచ్చింది ఛాయాదేవి. 'మీకూ, ధూళిపాళకీ డ్యూయెట్ పెట్టనా?' అడిగారు విఠలాచార్య ఆమె వేపు చూస్తూ. 'అయ్యబాబోయ్, వొద్దు సార్!' అన్నాను. విఠలాచార్య నవ్వి, 'ఏమిసార్ అలా అంటారు. ఆ వయసులో వింత ప్రేమ వుంటుందనీ!' అన్నారు. నాకంత వయసులేదు గనుక — ఆయన చెప్పింది నిజం కావచ్చు. ఇంతకీ డ్యూయెట్ ఆ వయసులో వాళ్ళకి పెట్టడం లేదుగాని, ఊరికే తమాషాకి అన్నారాయన. ఏమో, చెప్పలేం! ఆయన విఠలాచార్య గనుక, సమర్థులు గనుక డ్యూయట్ పెట్టేసినా ఆశ్చర్యపడఖర్లేదు.

ఇంతలో విజయలలిత మేము వున్న చోటుకి వచ్చి తనూ వో కుర్చీలో కూచున్నది. ఆ అమ్మాయిని చూస్తూ 'వెనక కాళియన్ రత్నం దెయ్యం పట్టినట్లు తలూపుతూ చేసే నాట్యం యిప్పుడు 'షేక్' డాన్సుట ఏమిటీ?' అని అడిగింది ఛాయాదేవి. విజయలలిత నవ్వుతూ తల, వొళ్ళు 'షేక్' చేసింది. 'అవును. ఇందులో ఆశ్చర్యపడవలసింది ఏముందీ?' అన్నారు విఠలాచార్య. 'అయ్యోరామ! వెనకటివన్నీ మళ్ళీ యిప్పుడు కొత్త ఫాషన్ కింద మారి వస్తున్నాయన్న మాట!' అంటూ ఆశ్చర్యపడిపోయింది ఛాయాదేవి.

ఈ సందడి శ్రీ విఠల్ కంబైన్స్‌వారు నిర్మిస్తున్న 'అగ్గిదొర' చిత్రం సెట్స్ మీదది.

ఈ చిత్రానికి రికార్డు చేసిన మొత్తం ఏడు పాటల్లోను రెండింటిని — యువరాణి మందిరంలో నాయకీనాయకులు భారతి, కాంతారావులపై చిత్రీకరణ జరిపారు. వాటిలో వొకటి సి. నారాయణరెడ్డి రచన 'ఎందున్నావో వో చెలీ— అందుకో వా కౌగిలీ, నిలువలేను నిముషమైనా నీవు లేనిదే' అనేది. మరొకటి జి. కృష్ణమూర్తి రచన 'పిలిచిన పలికేవు స్వామీ, శిలగా నిలిచేవేమీ' అనేది. ఈ రెండు యుగళ గీతాలనూ ఘంటసాల, సుశీల పాడారు. 'ఒకరిని పాడు చెయ్యాలనుకునేవారు తామే చెడిపోతారన్న' ప్రాతిపదిక మీద యీ చిత్రం తయారు చేయబడుతున్నదని విఠలాచార్య చెప్పారు.



'లక్ష్మినివాసం'లో రామ్మోహన్, భారతి.



'పూలరంగడు'లో జమున, చలం

*   *

సుశీల పాడిన వొకపాట — విజయవర్ధన్ మూవీస్‌వారి 'ఉపాయంలో అపాయం' చిత్రానికిగాను యిటీవల వాహినీలోని రెండవ ఫ్లోర్‌లో జమున, బేబీ రాధిక, మరి కొందరు పిల్లలమీద చిత్రీకరించారు. ఈ చిత్ర తారాగణంలో జమున పేరు వినిపించలేదు.

మరి జమున ఎక్కడ వుంది? అని కొందరికి సందేహం రావచ్చును. ఆమె యిందులో అతిథి నటిగా పాల్గొంటున్నది. జమునతో పాటు యీ పాటలో నటిస్తున్న పిల్లలు అంతా 3,4 ఏళ్లవాళ్లు. వాళ్లలో బేబీ రాధిక మరీ చిన్నపిల్ల. నిర్మాతలలో ఒకరైన పి. వెంకురెడ్డిగారి అమ్మాయి. చిన్న పిల్లల్ని కెమెరా ముందు నించోబెట్టి షాట్ తియ్యాలంటే అంత సులభం కాదు. అందులోనూ పాటలో. ఇందుకు దర్శకునికి ఎంతో సహనం, ఉత్సాహం, ముఖ్యంగా పసివాళ్ల మనస్తత్వాల నెరిగి ఉండటం అవసరం. డైరెక్టర్ కృష్ణలో యివన్నీ పుష్కలంగా ఉండటంచేత రాధికను మూడ్‌లో పెట్టి తనకు కావలసిన మూవ్‌మెంట్సు చేయించుకున్నారు, పుట్టినరోజు పాట అది 'ప్రతి పాప దేవుని రూపే, ప్రతి నవ్వు తేనియ తీపే — అందరినీ నువు నవ్వించే రోజు, దేవుని దీవెన ఫలించురోజు' అనేది. ఆత్రేయ రచనకు సుశీల స్వరం మాధుర్యం చిలికితే, మహదేవన్ సంగీతం సుధలు చిందుతుందని వేరుగా రాయాలా?

*　　*　　*

బెర్లిన్‌లో జరుగనున్న 17 వ అంతర్జాతీయ చలనచిత్రోత్సవంలో పాల్గొనటానికీ, తమదేశం చూడటానికీ శ్రీ జగ్గయ్యను పశ్చిమజర్మనీ ప్రభుత్వం ప్రత్యేకంగా ఆహ్వానించింది. ఆయన జూన్ 21 ఉదయం మద్రాసునుంచి ఢిల్లీమీదుగా వెళ్లారు. అంతకు ముందురోజు సాయంత్రం 7 గం. లకి ప్రముఖ నటుడు శ్రీ అక్కినేని నాగేశ్వరరావు కూడా శ్రీ జగ్గయ్యకి హోటల్ అశోకాలో అభినందనసభ ఏర్పాటుచేసి తేనీటి విందు యిచ్చారు. 'అంతస్తులు' చిత్రంతో ఆస్ట్రేలియావెళ్లిన నాగేశ్వరరావు జూన్ 14 న తిరిగి వచ్చారు.

*　　*　　*

ఆరుగంటలకు ప్రారంభం కావలసిన సభ ఏడుగంటలకు ఆరంభమయింది. 'జగ్గయ్య అలవాటు ప్రకారం ఆలస్యంగా వచ్చారు. ఇక్కడ అలాంటివి జరిగినా ఫరవాలేదుగాని, ఆయన రేపు విదేశాలకి వెళుతున్నారు గనుక అక్కడ పంక్చుయాలిటీ మెయింటెయిన్ చెయ్యాల'ని ఛలోక్తి విసిరి నాగేశ్వరరావు 'నా సహనటుడు, మిత్రుడు శ్రీ జగ్గయ్యకు యిలాంటి ఆహ్వానం, అవకాశం రావటం



సిడ్నీ మధ్యభాగంలోని డబుల్ బీ వద్ద మిస్ కారల్ ఉడ్, ఆమె స్నేహితురాలితో నాగేశ్వరరావు

నిజంగా నాకెంతో గర్వకారణం' అన్నారు. శ్రీయుతులు నాగయ్య, సుందర్‌లాల్ నహతా, ఎ. ఎల్. శ్రీనివాసన్ జగ్గయ్యకీ అవకాశం రావడంపట్ల తమ హర్షామోదాలను తెలియబరిచారు. గుమ్మడి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ 'తనకు తెలిసినంతవరకూ యిలాంటి అవకాశం రావటం యిది నాలుగవది అనీ — మొదట యస్.ఎస్. కృష్ణన్, తర్వాత శివాజీ గణేశన్, ఆ తర్వాత నాగేశ్వరరావుగారూ యిలా ప్రభుత్వ ఆహ్వానాలపై వెళ్లటం జరిగిందనీ — ఇప్పుడు శ్రీ జగ్గయ్యకీ అవిధమైన అవకాశం రావటం ఫిలిం పరిశ్రమకుచెందిన వారందరికీ గర్వకారణమని' చెప్పారు. గుమ్మడి తమ ఉపన్యాసంలో జగ్గయ్యగురించి ఓ కొత్త విషయం చెప్పారు. అది జగ్గయ్యకు జ్యోతిశ్శాస్త్రంలో కూడా నైపుణ్యం ఉన్నదనేది. ఇటీవల జరిగిన తమ కుమార్తెల వివాహానికి జగ్గయ్యే ముహూర్తం పెట్టారని తెలిపారు ఆయన. డా. సి. నారాయణరెడ్డి అనగనగా 'అనగా అనగా ఒక గంధర్వుడు' పేరిట గేయం చదివారు, జగ్గయ్య గుణగణాల్ని కొనియాడుతూ. జగ్గయ్య కృతజ్ఞత చెప్పారు.

*　　*　　*

సుభాషిణీ ఆర్ట్ పిక్చర్స్‌వారు తమ 'ఆడపడుచు' చిత్రాన్ని జూన్ 21 మధ్యాహ్నం గం. 2—45 కి ప్రసాద్ స్టూడియోలో ప్రారంభించారు. శ్రీ జి. కామరాజు (పూర్ణా పిక్చర్స్) కెమెరా స్విచ్ ఆన్ చేశారు. మొదటి షాట్‌లో యన్. టి. రామారావు, పద్మనాభం, గీతాంజలి పాల్గొన్నారు. శోభన్‌బాబు, వాణిశ్రీ, చంద్రకళ, రేలంగి యితర ముఖ్య భూమికలు పోషిస్తున్న యీ చిత్రానికి ప్రసిద్ధ దర్శకుడు శ్రీ కె. ప్రత్యగాత్మ, సంభాషణలు రాశారు. సంగీతం: టి. చలపతిరావు, కథ: బి. ఎస్. కృష్ణ

కెమెరా: ఎం. జి. సింగ్ నిర్వహిస్తున్నారు. నిర్మాత, దర్శకుడు: కె. హేమాంబరధర రావు.

* * *

విజేతా ప్రొడక్షన్స్ అనే కొత్త సంస్థ తమ తొలి ప్రయత్నంగా ఒక సాంఘిక చిత్రాన్ని నిర్మిస్తున్నది. జగ్గయ్య, కాంచన, కృష్ణ, వాణిశ్రీ, బేబి రోజారమణి ముఖ్య భూమికలు పోషించేందుకు యింతవరకు ఎన్నుకోబడినారు. సంభాషణలు: పినిశెట్టి, సంగీతం: ఘంటసాల, కళ: కె. ఎ. ప్రభాకర్, కెమెరా: మాధవ్ బుల్‌బులే నిర్వహించే యీ చిత్రానికి దర్శకుడు కె. బాబారావు.

* * *

యువకుడు, ఉత్సాహవంతుడు అయిన శ్రీ కె. బాబారావు ఒక చిత్రానికి దర్శ

చిత్రలహరి

కత్వం వహించబోవటం యిది మొదటిసారి. 'భలే అమ్మాయిలు' చిత్రంద్వారా వేదాంతం రాఘవయ్యగారి దగ్గర సహాయకునిగా చేరి. తర్వాత ప్రముఖదర్శకుడు కె. వి. రెడ్డి గారివద్ద - నాగిరెడ్డి, చక్రపాణిగార్ల ప్రోత్సాహంతో విజయాప్రొడక్షన్స్ చిత్రాలకు అసోసియేట్ డైరెక్టర్‌గా పనిచేస్తున్నారు. కె. వి. గారి దగ్గర దర్శకత్వపుశాఖలో ఎన్నో మెళుకువలూ, ఎంతోనేర్పూ గ్రహించారు. ఈ చిత్రం జూలై 9 నుంచి సెట్స్‌కు వెళ్లగలదని తెలుస్తున్నది.

* * *

తారకరామా పిక్చర్స్‌వారు భారీయెత్తున నిర్మిస్తున్న 'శ్రీ కృష్ణావతారం' చిత్రంలో విశేషాలు కొన్ని ఉన్నవి. ప్రముఖ నటుడు శ్రీ యన్. టి. రామారావుగారి కుమారుడు చిరంజీవి హరికృష్ణ — బాలకృష్ణుడిగా నటించడం ఒక్క విశేషమయితే సత్యనారాయణ దుర్యోధనుని పాత్ర పోషించడం మరొక విశేషం. సత్యనారాయణ దుర్యోధనుని పాత్ర వెయ్యడమేమిటీ అని కొందరన్నా—ఆవేశ పోషణలో చక్కనినేర్పు కనపరిచాడని రషెస్ చూసినవారు అభిప్రాయపడుతున్నారు. ఈ చిత్ర నిర్మాత శ్రీ అట్లూరి పుండరీకాక్షయ్య మంచి నటుడవ్వ, నాటకరంగంలో విశేషమయిన అనుభవం



'సురపురానికథ'లో సంధ్యారాణి

వుండటంచేతా సత్యనారాయణను దుర్యోధనుని పాత్రలో తీర్చిదిద్దారని తెలిసిన మిత్రులొకరు చెప్పారు. భారతశ్రీ బిరుదు పొందిన అర్జా జనార్దనరావు యీ చిత్రంలో భీముడు భూమికను ధరిస్తున్నారు. ప్రధాన పాత్రలలో యన్. టి. రామారావు, దేవిక, కాంచన, రాజనాల, ముక్కామల, మిక్కిలినేని మున్నగువారున్నారు. రచన: సముద్రాల రాఘవాచార్య, సంగీతం: టి. వి. రాజు, కళ: గోఖలే, కెమెరా: అన్నయ్య, దర్శకుడు: కె. కామేశ్వరరావు నిర్మాణం పూర్తి కావస్తున్నది.

—మోహన్‌కుమార్

నీకసలేం అనుమానం లేనప్పుడు నాకసలు ఆ బెంగలేదు. ఇంక ఆ ప్రసక్తి వదిలి పెట్టెయ్యి. వెళ్ళి ముందు ముఖం కడుక్కునిరా. నాకు కొంచెం మంచినీళ్ళు తెచ్చిపెట్టు.' గోపాలం అన్నాడు.

సీతలేచి వెళ్ళింది.

'ఎల్లుండి చంటాడి పుట్టినరోజు. ఏదో హడావుడిచేస్తుందిట మీ వదిన. నిన్ను తీసుకునిరమ్మంది. రాకూడదటా పోనీ.' గోపాలం మంచినీళ్ళుతాగి గ్లాసు చేతి కందిస్తూ అడిగాడు.

'ఇప్పుడాయనకి ఖాళీలేదన్నయ్యా. ఏవో పరీక్షలు' సీత అంది.

'పెంగినాడం. బస్సెక్కితే గంటప్రయాణం లేదు. ప్రొద్దున్న బయలుదేరితే సాయంకాలం తిరిగిరావచ్చు. అయినా నువ్వు రావచ్చుగా. ఒకపూట వండుకుని తినలే రేమిటి?'

'ఇప్పుడు కాదులే.' సీత తల అడ్డంగా ఊపింది.

'సరే అయితే. నా మాట వింటావు కనుకనా. నేనలా స్కూలుకి వెళ్ళి బావకి కనపడి మూడు గంటల బస్సు అందుకుంటాను మరి' గోపాలం లేచాడు.

'ఒక నిముషం ఉండు.' సీత లోపలికి వెళ్ళి పదిరూపాయల నోటుతో తిరిగివచ్చింది.

'చంటాడికి.'

గోపాలం తీసుకోలేదు. 'అవన్నీ ఎందుకే. పోనీ నువ్వెప్పుడయినా వచ్చినప్పుడు ఇవ్వచ్చులే.'

'అలా కాదు. నా తృప్తికోసం. అయినా నేను రావడానికి ఎప్పుడు వీలవుతుందో యేమో!' సీత బలవంతంగా అన్నగారి జేబులో పెట్టింది నోటు.

గోపాలం వీధిగుమ్మంవరకూ నడిచాడు.

'అన్నయ్యా!' గోపాలం ఆగి చూసాడు.

'ఆవిషయం ఆయనతో ప్రస్తావించేవు సుమా! నామీద ఒట్టు.' సీత అంది.

'అలాగే.' గోపాలం ఒకక్షణం వాత్సల్యంగా చూసి సాగిపోయాడు.

* * *

'సత్యవతీ!' చలపతి తలుపు మీద కొట్టాడు.

ప్రక్కయింట్లోనుంచి ఎవరో బయటకి వచ్చి చూసి మళ్ళా లోపలికి వెళ్ళి పోయారు.

పథ విహీన

(3౪ వ పేజీ తరువాయి)

తలుపు తెరచుకుంది.

'నువ్వు నామాట వినటంలేదు చలపతీ! యింత తరచుగా రావద్దని చెప్పానా లేదా?' సత్యవతి కొంచెం కోపంగా అంది.

చలపతి చిన్నబుచ్చుకున్నాడు. 'లేదు సత్యా! చిన్న విషయం చెప్పిపోతాను. రేపటి నుంచి మరింకో యిద్దరు పిల్లల్ని పంపిస్తాను. మరి నేవస్తాను.' చలపతి వెనక్కి తిరిగాడు.

'ఎలాగూ వచ్చావుగా. కొంచెంసేపు కూర్చునిపో. నువ్వేదో నాకు మంచిచేయబోయి వస్తావు. నేను నా మాటలతో నిన్ను బాధ పెడుతూ ఉంటాను.' సత్యవతి విచారంగా అని లోపలికి దారితీసింది.

'నన్నుగురించి ఊళ్ళో యేమనుకుంటున్నారు?' సత్యవతి కొంచెం సేపయిన తరువాత మాటల మధ్యలో అడిగింది.

'ఏమనుకుంటారు? ఎవరికి పట్టింది అయినా తీరికూర్చుని ఆలోచించడానికి.

'శుద్ధ అబద్ధం. ఋజువు కావాలంటే చెప్పనా. నువ్వు మొదట పంపిన పిల్లలలో మూడురోజులనుంచీ అయిదుగురు రావడం మానేసారు.'

'అదేమిటి? ఎందుకని? నేను కనుక్కుంటాను రేపు.' చలపతి అన్నాడు ఆశ్చర్యపోయి.

'అవసరం లేదు చలపతీ! నువ్వు అమాయకుడివి. అందుకే అలాగంటున్నావు.'

'అంటే'

'ఏముంది? నా పూర్వచరిత్ర అంతా మీ ఊళ్ళో వ్యాపించి ఉంటుంది యిపాటికి.' నిర్లిప్తంగా అంది.

'ఈ ఊరి ప్రజలకి కూడా యీ వ్యాధి అంటుకుందంటావా?' ఒక క్షణం ఆగి అన్నాడు చలపతి నిస్పృహగా.


'వ్యాధి క్రొత్తగా వ్యాపించడం కాదు చలపతీ! అది యీ ప్రపంచంలో యెక్కడికి వెళ్ళినా కనపడుతుంది'

'నేను వెళ్తాను. నేనేదో ఆలోచిస్తాను. నువ్వు అధైర్యపడకు.' చలపతి బయటకు నడిచాడు ఆలోచిస్తూ;

పిచ్చి చలపతీ! నువ్వేమీ చేయలేవు. ఓడిపోయి తలవంచుకుంటావు చివరికి.' సత్యవతి పెదవుల వెనుక గొణుక్కుంది.

* * *

మందంగా చీకటి అలుముకొంటోంది. సీత వీధి గుమ్మం వానుకుని నిలబడింది. మనసులో భర్త యింకా యింటికి రాలేదేమో' అని ఆలోచన. ఎప్పుడూ స్కూలు అయిపోయిన తరువాత ఒక గంటలో యింటికి వచ్చేస్తారే. యివాళ యేం జరిగింది? అవకాశం కోసం ఎదురుచూస్తున్న అనుమానం హృదయంలో చొరబడదామని విశ్వప్రయత్నం



పథవిహీన

చేస్తోంది. సీత మనసు వెనక్కి వెళ్ళిపోతోంది. వీధిలో మనుష్యుల ఆకారాలు అస్పష్టమయి పోతున్నాయి చీకటి సాంద్రమయి.

దూరంగా యెవరో వస్తున్నారు. సీత మెట్టుదిగి చూసింది.

రాజా చేతులూపుకుంటూ వస్తున్నాడు. 'వయసు పదిహేనేళ్ళు అయినా తండ్రి అంత యెత్తు ఉన్నాడు. ఒకటే పోలిక.' సీత మనసులో అనుకుంది.

'అమ్మా! చదువుకోవాలి. అన్నంపెట్టు.' రాజా హడావుడిగా లోపలికి నడిచాడు.

'కళ్యాణిని పిలు పెడుతుంది.' సీత గుమ్మంలో నుంచి కదలలేదు.

'అదెక్కడుందో యేమో!' రాజా కొంచెం విసుక్కుంటూ లోపలికి వెళ్ళిపోయాడు సీత కళ్ళు చీకటిని శోధించాలని విశ్వప్రయత్నం చేస్తున్నాయి. పావు గంట గడచిపోయింది.

'కళ్యాణీ! దీపం ఒకటి గుమ్మంలో పెట్టు.' సీత కేకేసింది.

కళ్యాణి వచ్చింది. 'రోజూ యిలా చెయ్యి అని ఎవరయినా చెప్పాలేమిటే? అన్నయ్య అన్నం తింటున్నాడా?' సీత అడిగింది.

'ఊఁ' కళ్యాణి కొంచెం విసురుగా మళ్ళీ లోపలికి వెళ్ళిపోయింది. సీత కూడా ఒక క్షణం చూసి లోపలికి నడిచింది.

'రాజా! నాన్నగారు యింకా స్కూలు లోనే ఉన్నారా? యింకా యింటికి రాలేదు?' సీత అడిగింది.

'లేదమ్మా. అప్పుడే వెళ్ళిపోయేరే. నేను స్కూలు నుంచే వస్తున్నానుగా. బహుశ అక్కడికి వెళ్ళేరేమో.' రాజా భోజనం చేయటం పూర్తిచేసి లేస్తూ అన్నాడు.

'ఎక్కడికి?' సీత కనుబొమలు ముడి పడ్డాయి.

'అదే మనింటికి రాలా? ఆవిడింటికి.' రాజా మాటలు యింకా పూర్తికాలేదు.

'రాజా!' సీత తీక్షణంగా అంది. 'అనవసర విషయాలు మాట్లాడకు.'

తల్లికి అంతకోపం యెందుకు వచ్చిందో అర్థంకాలేదు రాజాకి. తలవంచుకుని వెళ్ళిపోయాడు అక్కడినుంచి.

సీతమనసులో ఘోష బయలుదేరింది. తలవేడితో పగిలిపోతునట్టుంది. 'వాడిమీద కోపగించుకొని ప్రయోజనం యేముంది? వాడికేం తెలుసు నిజానిజాలు. తను అతి వసరంగా తొందరపడుతోంది.' సీత విసుగ్గా తనలో తనే అనుకుంది.

'కళ్యాణీ! బాబిగాడేడి?' సీత అడిగింది.

'పక్కింటికెళ్ళాడు. పత్రిక తెమ్మన్నాను.'

'వాడు వచ్చినతరువాత మీరిద్దరూ అన్నం తినేయండి. నాకు తల నొప్పిగా ఉంది.' సీతగదిలోకి వెళ్ళి తలుపు బిగించుకుని మంచంమీద వాలిపోయింది.

'యింతమంది యిన్నివిధాలుగా ఎందుకు చెప్తున్నారు? యిందులో యేమయినా నిజం ఉందేమో! ఆయనెందుకు తనతో చెప్పరు? ఆవిడెవరు? మొదటిసారిగా సీత మనసులో అనుమానం తగిన స్థానం పొందగలిగింది.

'ఛీ! ఛీ! ఒక్కరోజు యింటికి రావడం ఆలస్యమయితే తనెందుకు పిచ్చిగా ఊహించాలి?' సీత వెంటనే తన మనోదౌర్బల్యాన్ని కొట్టేయడానికి ప్రయత్నించింది. యీ ఆలోచన యింక మనసులోనికి రానీయకూడదు.! మనస్ఫూర్తిగా అనుకుంది.

'యీ రోజుతో తను ముప్ఫయి అయిదు సంవత్సరాలు నిండి ముప్ఫయి ఆరవసంవత్సరంలో అడుగుపెట్టింది! సీత దగ్గరలో ఉన్న అద్దం ముఖానికి దగ్గరగా ఉంచుకుని చూసుకుంది. 'భర్త ఒక్కడే తనని సీతా! అని పిలుస్తాడు. ఊరివారందరికీ సీతమ్మగా యేనాడో మారిపోయింది.' యవ్వనదశ చాలా యేళ్ళక్రితం కనుమరుగయిపోయింది. వార్ధక్యం మీదపడి ఆక్రమిస్తోంది. తను తప్పించుకోలేదు. అద్దంలో ప్రతిబింబం తనదికాదు. సీతమ్మ! తలలో చెదురుమొదురుగా తెల్లవెంట్రుకలు మెరుస్తున్నాయి. క్రొత్తలో ఒకటి రెండలా పీకిపారేసింది. యిప్పుడు తన సాధ్యంకాదు. నుదుటిమీద కనపడి కనపడకుండా రెండు ముడతలు కనిపిస్తున్నాయి. కళ్ళక్రింద నల్లని ఛాయలు శాశ్వతంగా పరచుకున్నాయి. ముఖంలో కాంతి క్రొత్తరంగుకి మారుతోంది.

'తనకంటె ఆవిడ యింకా అందంగా ఉండి ఉంటుంది. యీనాటికి కూడా అందం చెదరలేదు' మళ్ళా తన ధ్యాస వద్దనుకున్నచోటే ప్రదక్షిణం చేస్తోంది. లేకపోతే తనకీ ఆ మనిషికీ పోలికెందుకు?

సీత తనమీద తానే చిరాకు పడింది.

రెండు నిముషాలు కళ్ళుమూసుకుని పడుకుంది. 'లాభంలేదు. ఇకా ఆలోచన నన్ను వదలిపోదు!' సీత నిస్పృహగా అనుకుంది.

గడియారం ఎనిమిది గంటలు కొట్టింది.

సీత ఉలికిపడింది. 'ఈాయన ఇంకా రాలేదేం? ఏదయినా ప్రక్క ఊరు వెళ్ళారేమో! పనిమీద. అలాగయితే ప్యూన్‌చేత కబురంపి ఉండేవారే.'

'అక్కడికే వెళ్ళి ఉంటారు.' అంతరాత్మ అంతకంతకు స్వరం పెద్దదిచేసి చెవిలో అరుస్తోంది.

సీత గట్టిగా కనులుమూసుకుని నిద్రపోవడానికి ప్రయత్నంచేసింది. అదేసమయంలో చలపతి నిజంగానే సత్యవతి ఇంట్లోనే ఉన్నాడు.

సత్యవతి మంచంమీద పడుకుంది. చలపతి చిన్న స్టూలుమీద కూర్చున్నాడు.

'సత్యా! ఎన్నాళ్ళనుంచి ఇలాగ ఉంది? నాతో ముందుగా ఎందుకు చెప్పలేదు?' చలపతి ముఖం విచారంగా ఉంది.

'అన్నీ నీ కెందుకని చెప్పాలి? నువ్వెవరివి అసలు?' సత్యవతి తీక్షణంగా అంది.

'లెండి తీసుకునివస్తాను. డాక్టరు దగ్గర కెళ్దాం.'

'నేను రాను.'

'పోనీ డాక్టరు నిక్కడికే తీసుకుని వస్తాను.'

'చెప్పుచ్చుకుని కొడతాను ఎలావస్తాడో?'

'ఏమిటా మొండితనం? చెప్పినమాట విను.' చలపతి కొంచెం కోపంగా అన్నాడు.

'ఏమిటి చలపతీ! పెద్ద రాద్ధాంతం చేస్తావు. రెండురోజులు భోజనం చేయకపోతే ఎవరికయినా పడుతుంది రక్తం నోట్లోనుంచి. ఇప్పటి జబ్బు కాదిది.'

సత్యవతి వాక్యం పూర్తి చేయకుండా తనుచేసిన తప్పు తెలుసుకుని నాలిక కరుచుకుంది.

చలపతి హృదయం బాధగా మూలిగింది. 'అయితే అదన్నమాట అసలు కారణం. నేనేమయ్యాను? చచ్చాననుకున్నావా?' మెల్లిగా అడిగాడు.

'అదేం కాదు. నోరుజారింది. ప్రొద్దున్న మాత్రం అన్నం తినలేదు ఆకలిలేక అంతే.' సత్యవతి తప్పు దిద్దుకోడానికి విశ్వప్రయత్నం చేసింది.

చలపతి తలవంచుకుని మాట్లాడకుండా కూర్చున్నాడు.

'నిజం చలపతీ! నాదగ్గర డబ్బులేక కాదు. నిన్నే అడిగి ఉందునుగా.'

'సరే అయితే! ఇప్పుడు ఇక్కడే భోజనం చేస్తాను. వండిపెట్టు.' చలపతి తలయెత్తి నిష్ఠూరంగా అన్నాడు.

బెదిరిపోయింది సత్యవతి. నాకిప్పుడు నీరసంగా ఉంది. అయినా నీ కోర్కె



తిదురు చూస్తూ ఉంటుంది. యింటికెళ్ళు!

''సత్యా! నే నొకటి చెప్తాను చేస్తావా?' చలపతి సత్యవతి నుదిటిమీద చేయి ఉంచి చూసాడు కాలిపోతోంది.

'నేను నీ మాట వినను.' సత్యవతి ప్రక్కకి తిరిగి పడుకుంది.

'మరి యీ ఊరికి యెందుకు వచ్చావు?' చలపతి కోప్పడ్డాడు.

'బుద్ధిలేక. యింతకు ముందే చెప్పాను. యీ క్షణాన వెళ్ళిపోతాను. పంపించెయ్యి.' సత్యవతి కళ్ళల్లో నీళ్ళు నిండాయి.

'అలాకాదు సత్యా! యిప్పుడు మా యింటికి వచ్చెయ్యి. రెండు రోజులు మామూలుగా ఉన్నావంటే నీ ఆరోగ్యం చక్కబడుతుంది. అప్పుడు నీవు కోరిన చోటికి పంపిస్తాను. ఒక క్షణం యీ ఊర్లో ఉండక్కరలేదు. ఈ ఒక్కసారి నేను చెపినట్లు చెయ్యి.' చలపతి ప్రాథేయపడ్డాడు.

'నువ్వు పిచ్చివాడివి. యిప్పటికి పుట్టిన కథలు చాలవా? జనం అంతా నా ముఖం మీద చెప్పుకుంటున్నారు. నేడో రేపో యింటివాడు కూడా వస్తాడు ఖాళీ చెయ్యమంటూ.' సత్యవతి నీరసంగా అంది.

'చెప్పుకోనీ. అందరినీ గంగలో దూకమను. నాకు లెక్కలేదు.'

'మీ ఊర్లో లేదుగా దూకడానికి.' సత్యవతి పిచ్చిగా విరగబడి నవ్వింది.

'ఏమిటా నవ్వు?' చలపతి కోపంలో నిస్సహాయత ధ్వనించింది.

'నువ్వు ముందు యింటికెళ్ళు. యింకొక్క నిముషం కూడా...' సత్యవతి మాట పూర్తి చేసేలోగా దగ్గుతెర అడ్డం వచ్చి మెలికలు తిరిగింది.

చలపతి పట్టుకున్నాడు. సత్యవతి నీరసంగా విదలించేంది. మంచం ప్రక్కనే వమనం చేసుకుంది. రక్తం చూసి చలపతి తెల్లారెత్తిపోయాడు. మెల్లిగా పట్టుకుని పడుకోబెట్టాడు. సత్యవతి స్పృహలేనిదానిలా పడుకుంది కనులు మూసుకుని.

'యేమిటి చేయడం యిప్పుడు?' చలపతికి మతిపోయింది.

యింట్లో నుంచి నీళ్ళు తీసుకువచ్చి శుభ్రం చేసాడు. రుమాలు తడిపి నుదుటిమీద వేశాడు. 'గొంతుకలో పోయడానికి కనీసం పాలుకూడా లేవు. చుట్టుప్రక్కల యెవరినయినా సహాయం తీసుకువస్తే! ఛీ! వద్దు. అందరూ రాక్షసులు! బ్రతికి ఉన్న వాళ్ళనే చంపేస్తారు. సత్యవతికి స్పృహవస్తే తనేదయినా చేయవచ్చు. బలవంతంగానయినా యింటికి తీసుకుపోవాలి.' చలపతి ప్రక్కనే కూర్చున్నాడు.

ఎప్పుడో పది గంటల తరువాత కనులు తెరచింది సత్యవతి. చలపతి వంగి చూసాడు.

'టైమెంతవుతుంది? నువ్వెళ్ళిపో చలపతీ! ప్రొద్దున్న రా.' సత్యవతి నీరసంగా అంది.

'నిన్ను యిక్కడ నుంచి నాతో తీసుకుని కాని వెళ్ళను.' చలపతి పట్టుదలగా అన్నాడు.

'నేనేమి యింతలో చచ్చిపోనులే. యింకొక్క క్షణంలో యిక్కడినుంచి వెళ్ళకపోతే...' సత్యవతి అంతనీరసంలోనూ కోపంతో లేచి మంచంపట్టె కేసి తలబాదుకుంది.

చలపతి గాభరాగా అడుగు ముందుకు వేసాడు పట్టుకోడానికి.

'పో ముందు.' సత్యవతి మరింతగా కొట్టుకుంది. నుదురు చిట్లింది.

చలపతి బాధపడ్డాడు 'మొండిది. ఏం చెప్పినా వినదు. సత్యవతిని గట్టిగా పట్టుకుని తల తలగడా మీదికి వాల్చాడు.

'సరే! నీమాటేకాని ప్రొద్దున్నే వస్తాను. మంచంమీదనుంచి లేవకు. నేనింటికి వెళ్ళి ఎవరయినా మనిషిని నీకు సాయంగా పంపిస్తాను.' యేమీ చెయ్యలేక అన్నాడు.

సత్యవతి దీర్ఘంగా నిశ్వసిస్తూ పడుకుంది తలకూడా కదల్చకుండా. చలపతి తలుపుదగ్గరగా లాగి చీకటిలోకి నడిచాడు.

* * *

'సీతా!'

'సీతా!' చెవిలోపడ్డ అస్పష్టమయిన పిలుపుకి కళ్ళు తెరచింది సీత! చలపతి మీదకి వంగిచూస్తూ కనపడ్డాడు. గభాలున లేచింది.

'ఇప్పుడే వచ్చారా?'

ఊఁ. నువ్వింకా భోజనం చేయలేదా? నాకోసం యెదురుచూస్తూ ఉన్నావనుకుంటాను.'

'రండి చేద్దాం.' సీత నడవబోయింది.

'లేదు సీతా! నా మనసు బాగాలేదు. యిప్పుడు భోజనంచేయలేను. నువ్వు చేసిరా. అందుకే లేపాను.' చలపతి అన్నాడు.

సీత ఆశ్చర్యపోయింది. 'బహుశ అక్కడే చేసారేమో! తనతో చెప్పడం యిష్టంలేక అలా అని ఉండవచ్చు. యింత రాత్రి వరకూ అక్కడే ఉన్నారన్నమాట. నిజం ఎంతున్నా లేకపోయినా యింతరాత్రి అక్కడ చూసారంటే ప్రజలు అనుకున్నారంటే తప్పేముంది? ఆయనతో చెప్పకతప్పదు.' సీత మనసులో అనుకుంది.

'ఏమిటి సీతా! ఆలోచిస్తున్నావు. ఆలస్యమయిపోయింది. భోజనం చేసిరా.' చలపతి అన్నాడు.

సీత ఒక క్షణం సందేహించి మౌనంగా నిలచింది. 'ఎలాగ చెప్పాలి?'

'ఏమండీ! ఆవిడకి కొంచెం దూరంగా ఉండడానికి ప్రయత్నించకూడదూ, అందరూ...' ఆమె పూర్తి చేయలేదు.

'సీతా!' చలపతి భార్య భుజాలు పట్టుకున్నాడు.' నీకు కూడా నామీద నమ్మకం పోయిందా చివరకి?' మెల్లిగా బాధతో అడిగాడు.

'లేదు. లేదు. నా కసలు అద్వేశ్యంలేదు. అందరూ మీ గురించి చెప్పుకుంటూ ఉంటే సహించలేక చెప్పాను.' సీత భర్త దగ్గరగా జరిగి భుజం మీద తల ఆన్చింది.

'సీతా! ఒకప్పుడు నీవే ఆమె యెవరని అడిగితే నేను చెప్పలేక పోయాను. యిప్పుడు చెప్పవలసిన అవసరం యేర్పడింది. కూర్చో.' చలపతి భార్యను మంచం మీద కూర్చోబెట్టాడు.

'లేదు. నాకేమీ చెప్పొద్దు. అవసరం లేదు. నాకు మీమీద నమ్మకం ఉంది నన్ను నమ్మండి.' సీత కంగారుగా భర్త తన మాటలు మరోలా అర్థం చేసుకున్నాడేమోనని బాధతో అంది.

'ఆ నమ్మకం నిలబెట్టుకోవలసిన బాధ్యత నా మీద కూడా ఉందిగా. అయినా మనిద్దరి మధ్య అగాధం యేర్పడటానికి అవకాశం యివ్వడం నాకు యిష్టంలేదు సీతా! ఆమె పేరు సత్యవతి. మేము చిన్నప్పుడు సుమారు పదిహేనేళ్ళు కలిసి పెరిగాం. ఆమె వయసులో నా కంటె ఒక సంవత్సరమే పెద్ద. ఆమె జీవితంలో మోసగింపబడింది. ఆమె కనులు తెరచేసరికి

నిర్వాసితం కావింపబడి ఒట్టి స్త్రీగా, యేకాకిగా ప్రపంచంలో నిలబడింది. బంధువు లందరూ ఆమెను దూరం చేశారు. సంఘం తన నీడలోకి చేర్చుకోడానికి నిరాకరించింది. పెంచిన కూతురు పదేళ్ళ ప్రాయానికే చని పోయింది. అటువంటి పరిస్థితిలో ఆమె నాకు కనపడి నాతో వచ్చింది సీతా! అంతకు మించి నేనేం చెప్పలేను' చలపతి భారంగా అన్నాడు.

'ఈ ఊరిలో నవా యిద్దరి గురించి చెప్పుకుంటున్నారనే భయంతోనే యీనాడు అక్కడి నుంచి నన్ను తరిమి వేసింది సీతా! యిప్పుడామె పరిస్థితిలో మరెవరున్నా నేను రాత్రి వదలి వచ్చేవాడిని కాను.' చలపతి విచారంగా వివరించి చెప్పాడు.

'మీరు నాకు ముందే చెప్పి ఉండవల సింది.' సీత భర్తతో అంది. విన్న కథ ఆమె హృదయంలో నాటుకుంది.

'అప్పుడు సీతా! అనవసరంగా లేనిపోని అనుమానాలకి తావిచ్చాను.'

'నాన్నా!' బయట నుంచి రాజా పిలిచాడు.

చలపతి బయటకు నడిచాడు.

'నాగరత్నం యింట్లో లేదు నాన్నగారూ.' రాజా అన్నాడు.

'ఎందుకు?' సీత అడిగింది.

'సత్యవతి యింటికి సహాయంగా పంపు దామనుకున్నాను సీతా! యిక్కడికి నసేమిలా రానంది. పోనీ నేనక్కడ ఉంటే తలవగుల కొట్టుకుని చస్తానంది.' చలపతి బాధగా అన్నాడు.

'రండి. యిక్కడికి ఎలాగయినా తీసుకు వద్దాం. నేను ఒప్పించగలను.' సీత సాను నయంగా భర్తవైపు చూసింది.

చలపతి చెప్పులు వేసుకున్నాడు.

'రాజా! వీరన్న యింటికెళ్ళి బండి కట్టించుకునిరా. మేము ముందు వెళ్తాం.' సీత చలపతి వెంటవీధిలోకి దారితీసింది.

యిద్దరూ వెళ్ళసరికి యిల్లు ఖాళీగా ఉంది. తలుపులు దగ్గరగావేసి ఉన్నాయి. సత్యవతి జాడలేదు. చలపతి నుదుటిమీద కొట్టుకున్నాడు.

'ఎక్కడికయినా వెళ్ళిపోయిందేమో! సీతా!' చలపతి విచారంగా అన్నాడు.

మంచం పట్టెమీద ఒక మడచిన కాగితం కనపడింది. చలపతి విప్పిచూసి పూర్తిగా చదువకుండానే జేబులో పెట్టుకున్నాడు.

'సీతా, మేము స్టేషనుకి వెళ్తాను. త్వరగా వెళ్తే దొరుకుతుందేమో? రాజా వస్తాడు. వాడిని బస్‌స్టాండ్‌కి వెళ్ళి చూసిరమ్మను. నువ్వు బండెక్కి యింటికి వెళ్ళిపో.' చలపతి కంగారుగా వీధిలోకి సాగిపోయాడు.

సీత దీర్ఘంగా నిట్టూర్చింది.

రాత్రి ఒంటిగంటకు చలపతి యిల్లు చేరాడు నీరసంగా. సీత వీధిలోనే యెదురు చూస్తూ కూర్చుంది.

'రాజా వచ్చాడా? నేను వెళ్ళేముందే ఎక్స్‌ప్రెస్ వెళ్ళిపోయింది సీతా! అందులో వెళ్ళి ఉండవచ్చు అన్నాడు స్టేషన్‌మాస్టరు. చలపతి భారంగా చెప్పాడు.

'బస్ స్టాండ్‌లో ఎవర్నీ లేరట. రాత్రిళ్ళు బస్‌లు ఏవీ లేవుగా అయినా.'

సీత అంది.

చలపతి యింట్లోకి దారితీశాడు.

'సీతా! సత్యవతి అంటే నాకు యిష్టం. ఆ వ్యక్తిలో యే విధమయిన ఆకర్షణ ఉందో నాకు తెలియదు. ఆ ప్రేమకు అన్నా చెల్లెళ్ళ ప్రేమ అని మరొకటి అని రంగు పూయలేను. నేను చెప్పలేనుకూడా. ఒకొక్కవిధమయిన అనుబంధం నిర్వచనానికి అందదు. మానవధర్మంగా ఏదో సహాయం చేద్దామని అనుకున్నాను. నాకు ఏదో చెడ్డ పేరు వస్తుందేమోనని భయపడి పారి పోయింది ఆ పిచ్చి మనిషి. అభాగ్యురాలు ఎక్కడుందో యేమో!' చలపతి జేబులో సత్యవతి వ్రాసిన కాగితం భార్య చేతిలో పెట్టాడు.

సీత లాంతరు దగ్గరికి తీసుకు వెళ్ళి చదివింది.

చలపతీ!

నీకు తెలియపరచకుండా వెళ్తున్న యీ కృతఘ్నురాలిని నీవు క్షమించగలనని అను కుంటే అదృష్టవంతురాలిని. నీవు నడిచే బాట వేరు. నాకు నిర్దేశింపబడినది మరొకటి. నన్ను నీ బాటలోనికి సంఘం రానీయదు. నిన్ను నా దగ్గరికి నేను రానీ యను. నా కల్మషం యిప్పటికే నీకు అంటింది. ఆ రోజు రైలులో నీ ముఖం చూసి, ప్రేమాప్యాయతలకి ముఖం వాచి పిచ్చిగా నీ వెంట వచ్చేసి అనుక్షణం బాధ పడ్డాను. నిన్ను బాధపెట్టాను. నీవు చూపించే ప్రేమానురాగాలకు నే నర్హురాలని కానని అనిపించింది. అందుకనే వెళ్ళిపోతు న్నాను. ఈ దురదృష్టవంతురాలిని మర చిపో. చనిపోయేలోగా యింకొకసారిమాత్రం నిన్ను చూడాలని కోరుకుంటాను చలపతీ! నా కోరిక నెరవేరుతుందో లేదో చూడాలి.

నీకు యేమీకాని

సత్యవతి

సీత కంటినుండి జారిన ఒక బిందువు సత్యవతిపేరు మీదపడి అక్షరాలు చెదిరి పోయాయి.



పెళ్ళి 'సప్తపది' అయిపోయింది … ఇక 'బాజా' ఆపండయ్!

పుస్తకాలు

సమగ్ర ఆంధ్రసాహిత్యం

పదకొండవ సంపుటం, నాయక రాజులయుగం 11. రచన: శ్రీ ఆరుద్ర. క్రౌను 270 పుటలు. వెల 5 రూ. ప్రకాశకులు యం. శేషాచలం అండ్ కంపెనీ, మద్రాసు. మచిలీపట్టణం, సికింద్రాబాదు.

కవులయొక్కయు, వారి గ్రంధాలయొక్కయు చరిత్రలతో పాటు ఆయా రచనల వైశిష్ట్యాన్నీ, కావలసిన గ్రంధాలలోని కథాంశాన్నీ శిష్టవ్యావహారిక భాషలో చక్కని రచనను సాగిస్తున్న శ్రీ ఆరుద్ర వాఙ్మయ చరిత్ర సంపుటాలలో ఇది పదకొండోది. ఆరుద్రగారు యుగవిభజనను ఆయా ప్రభువుల కాలాలను అనుసరించే చేస్తూ వస్తున్నారు. దక్షిణ దేశంలోని నాయక రాజుల కాలంలో ఎన్నో రంగాలలో ఎంతో సాహిత్యం వెలువడింది. అందువల్ల ఆయుగంలోని వాఙ్మయాన్ని గురించి వివరించడానికి రెండు సంపుటాలు అవసరమైనాయి. మొదటి సంపుటం లోని 13 ప్రకరణాలలో రఘునాథ నాయకుని కాలంలోని వాఙ్మయం గురించి ఉన్నది. 14వ ప్రకరణం మొదలుకొని 28—వ ప్రకరణం చివరివరకూ రఘునాథ నాయకుని పుత్రుడు విజయ రాఘవనాయకుని కాలంలోని గ్రంధాల విషయం ఉన్నది.

విజయరాఘవ నాయకుడు తండ్రివలెనే సంగీత సాహిత్యాలలో ఘటికుడు. చాలా గ్రంధాలను రచించిన గొప్పకవి. కవి పండిత పోషకుడు. అతని వాఙ్మయసేవను గురించిన విశేషాలన్నీ 14—వ ప్రకరణంలో ఉన్నవి. సర్వ సాధారణంగా తెలియని చరిత్రాంశాలను కూడా రచయిత యిందులో వివరించారు. అతని భోగలాలసత, శత్రువులకు బెదరి పారిపోయిన పిరికితనం కూడా నిర్మొగమాటంగా సప్రమాణంగా వివరించబడినవి. లభ్యాలు, అలభ్యాలూ అయిన అతని కృతులను గురించిన చక్కని సాహిత్య విమర్శ యీ ప్రకరణంలో కానవస్తుంది.

తర్వాతి ప్రకరణంలో దామెరల కవులను గురించి, సుప్రసిద్ధ కవి కాకమాని మూర్తికవిని గురించీ ఎన్నో విషయాలు ఉన్నవి..దామెర్ల వెంగళరాజు వ్రాసిన బహుళాశ్వచరిత్రలోని కథాంశం రసవంతంగా చెప్పబడింది. మూర్తి కవి దామెరల వారి కాశ్రితుడు. అతడు వ్రాసిన పాంచాలీ పరిణయ రాజవాహన విజయాల సమీక్షకూడా యిందులో చక్కగా చెయ్య బడింది.

పదిహారో ప్రకరణంలో సుప్రసిద్ధ గేయకవి క్షేత్రయ్యను గురించిన వివరాలు ఉన్నవి. మధుర మధురంగా శృంగార రసంలో పదాలు అల్లిన క్షేత్రయ్య అసలు పేరు వరదయ్య అనీ, క్షేత్రాటనం తిరుగుతూ వుండడం వల్ల క్షేత్రయ్య అనే పేరు వచ్చిందని ప్రసిద్ధి. ఈయన జన్మస్థలాన్ని గురించి భేదాభిప్రాయాలున్నవి. వాటినన్నింటిని పర్యవేక్షించి శ్రీ మల్లాది రామకృష్ణ శాస్త్రి గారి అభిప్రాయాన్ని ఆమోదిస్తూ దక్షిణార్కాడు జిల్లాలోని మొవ్వూరయి ఉండవచ్చునని సకారణంగా చెప్పారు. క్షేత్రయ్య శీలాన్ని చరిత్రనూ గురించిన ఎన్నో విషయాలు పాఠకులకు ఆసక్తిని కలిగిస్తూ ఉన్నవి.

చెంగల్వ కాళ కవిని గురించిన ప్రకరణంలో అతని రాజగోపాల విలాసంలోని అష్టమహిషుల లక్షణాలనూ అష్టవిధ, శృంగార నాయికల లక్షణాలతో సమన్వయిస్తూ చక్కని సమీక్ష చెయ్య బడింది.

రామభద్రాంబ, రంగాజమ్మ మున్నగు కవయిత్రులకు సంబంధించిన 18—వ ప్రకరణంలో ఆంధ్ర విదుషీమణుల రచనలను గురించి, వారు పొందిన సన్మానాలను గురించీ వివరంగా ఉన్నది.

విజయనాయకుని సౌకుమార్యాన్ని వర్ణించే పంపాదపద్యం 119 వ పుటలో

'రాజనిభాననా! సరసు
  రాలవు, జబ్బుగ నల్లినావదే
మే జడ?' 'యింతకంటె వలె
  నేని' వలనొప్ప బిగించి యల్లవే
యోజవరాల 'వేరొకపని
  యున్నది' దోసమె 'దోసమే మహా
రాజగునట్టి యవ్విజయ
  రాఘవు మైచిగురాకె కోమలి!'

అనేవిధంగా ఉన్నది. సరిగా సమన్వయించే పద్ధతిలో ముద్రితం కాలేదు. 'వలనొప్ప బిగించియల్లవే' అనేదానికి 'వలనొప్ప బిగించి కట్టవే' అనీ 'దోసమె దోసమే' అనేచోట "దోసము దోసమే" అనీ పాఠాంతరాలున్నవి. అవే సరియైనవి. నాయికా, చెలికత్తె సంభాషించుకొన్నట్టుం యిది తనజడ అల్లిన చెలికత్తెతో నాయిక అంటుంది. "రాజనిభాననా! సరసురాలవు—; జబ్బుగ అల్లినావదేమెజడ?" అని చెలికత్తె 'ఇంత కన్నా వలెనా?' అని ప్రశ్నిస్తుంది. నాయిక "వలెను;— ఒప్పు గిగించి కట్టవే ఓ జవరాల! వేరొక పని వుంది దీనికి" అని అంటుంది. చెలికత్తె సంగతి గ్రహించి 'దోసము దోసమే' మహా.......... చిగురాకె కోమలి!' అని మందలిస్తుంది.

భోగకాంత విటుణ్ణి గట్టిజడతో తాడించడం ఒక శృంగార చేష్ట. అట్టి తాడనానికి విజయరాఘవుని సుకుమార శరీరం తాళలేదని యిందలి అభిప్రాయం. ఇది చక్కగా ఉన్న పాఠాంతరాల వల్లనే స్పష్టంగా తెలుస్తున్నది.

పందొమ్మిదవ ప్రకరణంలో ఆకాలంలో వుండిన కొందరు నాటక కర్తలను గురించి ఉన్నది. అప్పటి నాటకాలు యక్షగానాలు. అది నాటకాల యుగమని సహేతుకంగా నిరూపించ బడింది. కామరసు వెంకటపతి సోమయాజి, పురుషోత్తమ దీక్షితులు మున్నగు వారి రచనల వివరణం ఉన్నది. అప్పటి హాస్యదోరణి యెలా వుండేదీ అన్నదాన మహానాటకం ఆధారంగా విపులీకరించ బడింది.

వివరించిన నారాయణ ప్రసిద్ధమైన కువలయాశ్వ చరిత్ర తమ రచించిన కవి, ఈ కవి నివాసాన్ని గురించీ, గ్రంధాన్ని గురించీ, గ్రంధం లోని కథాంశాన్ని గురించీ విపులమైన పరిశీలన 20—వ ప్రకరణంలో కానవస్తుంది. అందాల గొడవ ఆకాలంలోనూ ఉన్నట్లు చూపబడింది. (చూ.పుట153) ఇందులో 'శశివేని దాదులకును పరిధానమిచ్చి' అనే చోట పరిదానానికి బదులు 'పరిధాన'మని పడింది. అచ్చు పొరపాటు కావచ్చును.

21—వ ప్రకరణంలో గణపవరపు వెంకట కవి ప్రబంధ రాజ వెంకటేశ్వర విజయ విలాసాన్ని గూర్చి అందులోని విషయాలనూ, కథాంశాన్ని గూర్చి విస్తారంగా ఉన్నది. అసమగ్రమై, కొంతభాగం మాత్రం ఎప్పుడో ముద్రితమై ప్రస్తుతం అలభ్యంగా ఉన్నయీ ఆంధ్రభాషా సర్వస్వరూపమైన ప్రబంధంలోని విషయం యేమిటో చాలా మందికి తెలియదు. ఆరుద్రగారు ఆ విషయాల న్నిటినీ విపులంగా తెలుపుతూ వెంకటకవి చిత్రకవిత్వంలోని మెరుగులను దృష్టాంతాలతో చూపి వాఙ్మయానికి మహోపకారం చేశారు.

కృష్ణలీలా తరంగిణిని సంస్కృతంలో రచించిన నారాయణ తీర్థులవారు పారిజాతాపహరణమనే యక్షగానాన్ని రచించారని తెలుపుతూ, అందులోని కొన్ని ఘట్టాలు ఉదాహరించ బడినవి. కూచిపూడి వారి భామాకలాపకర్త అయిన సిద్ధేంద్ర యోగిని గురించిన్నీ వివరంగా చూప బడినది.

నూకుమూరి అప్పకవిని గురించి 25—వ ప్రకరణంలో విపులంగా ఉన్నది. ఆయన ఉదాహరించిన గ్రంధాల పట్టిక ఈయబడినది. ఆయా ఆశ్వాసాలలోని విషయాల వివరణం కలదు. తన చదువు పూర్తి ఆయాక అప్పకవి శ్రీశైలం వెళ్ళి అక్కడ కొన్నాళ్ళున్నాడు. అప్పుడక్కడ అధికారిగా ఉండిన భోగి విభూషణుడనే ఆయనకు కొన్నాళ్ళు పట్టపు కవిగా ఉండి నట్లు ఇందులో ఉన్నది. 'భోగి విభూషణుడు—' అనే వ్యక్తిని కల్పించడం కంటె శ్రీశైల మల్లికార్జున దేవుడే భోగి విభూషణుడు (పరమేశ్వరుడు) అని అనుకోవడం సముచితం. అప్పకవీయంలో కూడా 'శ్రీ గిరినిలిచినీవును—భోగివిభూషణుని పట్టపు గవీంద్రుడనై' అని మాత్రమే ఉన్నదిగాని, స్పష్టంగా ఒక వ్యక్తి యని చెప్పినట్లు కానరాదు. చరిత్ర కారులున్నూ భోగి విభూషణుడిని గురించి యేమీ చెప్పినట్లు లేదు.

ఈవిధంగానే చింతలపల్లి పండితులను గురించీ, కదిరీపతి అయ్యలరాజు నారాయణ కవులను గురించీ, ప్రసిద్ధ శతక కవులను గూర్చి యితర కవులను గురించీ చెప్పవలసిన వాటిని ఆరుద్ర గారు చక్కగా వివరించారు. గ్రంథ పరిశీలనలోనూ విషయ సేకరణలోనూ కథలను రసవంతంగా చెప్పడంలోనూ రచయిత చూపిన ఓపిక మెచ్చుకో దగింది. ఇతర గ్రంధాలను చూడ నక్కర లేకుండా నాయక రాజులను గూర్చి సంపుటాలు చూస్తే చాలు. దక్షిణాంధ్ర వాఙ్మయ తత్త్వం చక్కగా అవగతం కాగలదు.

—అంగీరస.

Edited, Printed and Published by S. Radhakrishna at the Andhra Patrika Press; 6 & 7, Thambu Chetty Street, Madras-1. Chief Editor: S. Sambhu Prasad.

Regd. No. 4479 ANDHRA SACHITRA VARA PATRIKA



ప్రేమకుమారి